అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 03-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 334 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



మోడీ మౌనం వీడాలి

అదానీ ముడుపులపై నోరు విప్పాలి

- ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోంది
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- ఉభయ సభలు వాయిదా
- లోక్‌సభలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు



అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మోడీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదానీ గ్రూప్ లంచంపై చర్చించాలని, ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం చర్చకు ముందుకు రాకపోవడంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నిమిషాల్లోనే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అదానీ అంశంపై ప్రధాని స్పందించాలంటూ నినాదాలను హెూరెత్తించారు.ఈ ఆందోళనల మధ్యే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ కోస్టల్ షిప్పింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభను వాయిదా వేశారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు పట్టువీడటంలేదు. అదానీ ముడుపుల వ్యవహారంలో కేంద్రం వైఖరి తెలియజేయాలంటూ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళనను హైజాక్ చేసేలా.. స్పీకర్ ఓం బిర్లా వ్యవహరించారు. ఎలాగైనా ఓ ప్రశ్న అడిగేందుకు అనంతపురం ఎంపీ అంబికా జి.లక్ష్మినారాయణను స్పీకర్ పిలిచారు. ఆయన ప్రశ్నకు కేంద్ర స్కిల్ మంత్రి జయంతి చౌదరి సమాధానం చెప్పారు. వెంటనే లక్ష్మినారాయణ సప్లిమెంటరీ ప్రశ్న అడిగారు. దానికి సమాధానం చెప్పిన తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చైర్మెన్ జగదీప్ ధన్కర్ సభను ప్రారంభిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 20 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేసిన ఆయన తిరిగి ప్రారంభమైన రెండు నిమిషాల్లోనే సభను మంగళవారానికి వాయిదా వేశారు. నాలుగు రోజుల్లో కేవలం 54 నిమిషాలు లోక్‌సభ, 75 నిమిషాలు రాజ్యసభ కార్యకలాపాలు జరిగాయి. గత సోమవారం కేవలం ఆరు నిమిషాల పాటే లోక్‌సభ కార్యకలాపాలు జరగగా, బుధ, గురువారాల్లో రోజుకు 14 నిమిషాలు, శుక్రవారం ...13లో

పార్లమెంటరీ ప్రతిష్టంభన ముగింపునకు అంగీకారం

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

పార్లమెంటరీ ప్రతిష్టంభన ముగింపునకు ప్రభుత్వం, ప్రతిపక్షాలూ అంగీకరించాయి. ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు అంగీకరించాయి. నవంబర్ 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ, సంభాల్ హింసాకాండ, మణిపూర్‌లో అశాంతి వంటి విషయాలపై ప్రతిపక్షాల నిరసనల ...13లో

ఇది మీ ప్రభుత్వం

బీఆర్ఎస్, బీజేపీల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ప్రజలపై వారికి ప్రేమ లేదు
- సర్పంచ్ పదవుల కోసమే వారి తాపత్రయం : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని నడిపిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజల కోసం పని చేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, పదకొండేళ్లుగా కేంద్రంలో పాలన చేస్తున్న బీజేపీల తప్పుడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలని సూచించారు. ఆ రెండు పార్టీలకు ప్రజలపై ప్రేమ లేదనీ, కేవలం రాబోయే సర్పంచ్ ఎన్నికల కోసమే ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన 213 నూతన అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించారు. 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు, 28 ప్రభుత్వ అనుబంధ హెల్త్‌కేర్ కాలేజీలు, 32 ట్రాన్స్ జెండర్స్ క్లినిక్స్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అనంతరం 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల నియామకపత్రాలను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతికి ముందు డూడూ బసవన్నలు వచ్చినట్టుగా ఓట్ల కోసం ప్రజల వద్దకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బయల్దేరారని ఎద్దేవా చేశారు. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచకుండా ఇప్పుడు రెసిడెన్షియల్ బాట అంటున్నారని తప్పుపట్టారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చి నల్లచట్టాలు తెచ్చి 750 మందిని పొట్టనపెట్టుకున్న బీజేపీ నాయకులూ ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. ఒక్క వైద్యారోగ్యశాఖలోనే ఏడాదిలో 14 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టడం దేశ చరిత్రలో మొదటిసారని చెప్పారు. ఎనిమిది మెడికల్ కాలేజీలకు మంజూరునిచ్చి సిబ్బంది నియామకాన్ని గత ప్రభుత్వం విస్మరిస్తే, చిత్తశుద్ధి, నిబద్ధత గలిగిన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అవగాహనతో తీసుకున్న నిర్ణయాలతో అనుమతులొచ్చాయని తెలిపారు. గతంలో నోటిఫికేషన్లు ఇవ్వలేదనీ, ఇచ్చి పరీక్షలు నిర్వహించినా ప్రశ్నాపత్రాలను జిరాక్స్ సెంటర్లకు అమ్ముకున్నారనీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని ...6లో

పేదల ఇంట విద్యుత్ వెలుగులు

సత్ఫలితాలిస్తున్న ప్రజా ప్రభుత్వ సంకల్పం : సీఎం రేవంత్‌రెడ్డి

పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలి స్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా వెల్లడించారు. "పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలిస్తోంది. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ ఇందిరమ్మ పాలన. ఒక్క హైదరాబాద్ నగరంలోనే10.52 లక్షల కుటుంబాలు 'గృహజ్యోతి" పథకం కింద ప్రయోజనం పొందుతున్నాయి. ఇది అందరూ హర్షించాల్సిన విషయం" అని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా తెలంగాణ

- బండ తిమ్మాపూర్‌లో హెచ్‌సీసీబీ పెట్టుబడులే అందుకు నిదర్శనం
- వ్యాపార వృద్ధికి పూర్తి సహకారం
- అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హిందూస్తాన్ లీవర్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) కంపెనీ ప్రారంభోత్సవం

6లో..



సీఎం రేవంత్‌ది రెండు నాల్కల ధోరణి

- ముఖ్యమంత్రి మాటలు నమ్మి మోసపోవద్దు : ప్రజలకు మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- ఏడాది కాలంలో రైతుబంధు, బతుకమ్మ చీరెలు, పింఛన్లతోపాటు ప్రజలు అనేకం కోల్పోయారు

13లో..



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఘర్షణ 70 మందికి పైగా మృతి

- గినియా భద్రతా బలగాల కాల్పులతో తొక్కిసలాట
- డజన్ల సంఖ్యలో మృతులు, క్షతగాత్రులు

13లో..



జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష తేదీ ఖరారు

మే 18 న రెండు విడతలుగా పరీక్ష

న్యూఢిల్లీ: ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టా'త్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో బీఈ/ బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ...6లో



అన్నదాత ఆగ్రహం

- గ్రేటర్ నోయిడాలో మళ్లీ మొదలైన రైతుల ఆందోళన
- ఢిల్లీ మార్చ్ ప్రారంభం
- బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు
- దిగొచ్చిన ప్రభుత్వం.. రైతులతో చర్చలకు సీఎస్ హామీ
- లిఖితపూర్వక హామీ ఇస్తేనే సమ్మె విరమణ : ఎస్కేఎం

6లో..

ఆస్తులు-అప్పులపై తేలని పంచాయితీ


విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల భేటీ



- మూడు అంశాలపై అంగీకారం
- డ్రగ్స్ నియంత్రణకు సంయుక్త కమిటీ
- కరెంటు బకాయిలపై మరోసారి కూర్చుందాం : సీఎస్‌ల నిర్ణయం

అమరావతి : రాష్ట్ర పునర్ విభజన అంశాల పరిష్కారంలో భాగంగా ఏపీ, తెలంగాణ సీఎస్‌ల నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. రెండు రాష్ట్రాల పెండింగ్ సమస్యలు గురించి సుమారు రెండు గంటల పాటు సమావేశంలో చర్చించారు. ఈ ఏడాది జులై 5న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని ప్రజావేదికలో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ భేటీకి కొనసాగింపుగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు మంగళగిరిలో నేడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు సీఎస్‌లు మూడు అంశాలపై అంగీకారానికి వచ్చినట్టు తెలిసింది. విద్యుత్తు బకాయిలు అంశం ...13లో

కొనసాగుతున్న మహా ప్రతిష్టంభన



- పదో రోజూ వీడని ఉత్కంఠ
- ముంబయికి బీజేపీ పరిశీలకులు
- నేడు మహాయుతి భేటీ ?
- రేపు బీజేపీ శాసనసభాపక్ష సమావేశం

3లో..

వ్యక్తిగత కారణాలతో ఎస్ఐ ఆత్మహత్య?



(ఫైల్)

- ములుగు జిల్లా వాజేడు మండలంలో సంఘటన
- ఎస్ఐ మృతిపై పలు అనుమానాలు

నవతెలంగాణ-వాజేడు

వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీష్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు గ్రామం సమీపంలో సోమవారం ...13లో

ఇబ్రహీంపట్నంలో కులదురహంకార హత్య

అక్కను కారుతో ఢీకొట్టి..గొంతు కోసి చంపిన తమ్ముడు



(ఫైల్)

- మృతురాలు హయత్‌నగర్ పీఎస్‌లో కానిస్టేబుల్
- స్వగ్రామం నుంచి విధులకు వెళ్తుండగా ఘటన
- నవంబరు 10న యాదగిరిగుట్టలో వివాహం
- ప్రాణహాని ఉందని ఇబ్రహీంపట్నం పీఎస్‌లో ఫిర్యాదు
- ఇరు కుటుంబాలకు పోలీసుల కౌన్సెలింగ్
- ఆస్తి విషయంలో తమ్ముడి ఘర్షణ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి (ఇబ్రహీంపట్నం)

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్‌లో కులదురహంకార హత్య కలకలం సృష్టించింది. కులాంతర వివాహం చేసుకున్నదని తన అక్కను తమ్ముడే హత్య చేశాడు. సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తున్న ఆమెను వెంబడించి కారుతో వెనక నుంచి ఢీకొట్టి, వేట కొడవలితో అతి కిరాతకంగా నరికి హత్య చేశాడు. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన కొంగర పద్మ, రమేష్ దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. వీరి చిన్న కూతురు నాగమణి(27) హయత్‌నగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తోంది. కాగా, అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన శ్రీకాంత్‌ను నాగమణి ప్రేమించింది. వీరి పెండ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో నవంబర్ 10న యాదగిరిగుట్టలో వివాహం ...13లో



చితికిన బతుకులు

చిరువ్యాపారులపైకి దూసుకెళ్లిన సిమెంట్ లారీ

- నలుగురు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- మృతులంతా కూరగాయల వ్యాపారస్తులే
- చేవెళ్ల మండలం ఆలూరులో ఘటన



నవతెలంగాణ-చేవెళ్ల

అతివేగంతో ఓ సిమెంట్ లారీ సృష్టించిన బీభత్సానికి చిరువ్యాపారుల బతుకులు చితికిపోయాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘోర ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ఆలూరు స్టేజీ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూరు గేటు వద్ద హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై పలువురు కూరగాయల వ్యాపారం సాగిస్తుంటారు. సోమవారం సాయంత్రం కూడా వీరి వ్యాపారం కొనసాగుతుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న సిమెంట్ లారీ అతి వేగంగా వచ్చి ఆలూరు గేటు వద్ద అదుపు తప్పి కూరగాయలు అమ్ముతున్న వారిపైకి ...5లో

పాతాళానికి రూపాయి

డాలర్‌తో మరో 13 పైసలు పతనం



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో పతనం అయ్యింది. సోమవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 84.73 కనిష్ట స్థాయికి దిగజారింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవ విలువ. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణాంకాలు రూపాయి విలువను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. మరోవైపు అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత పరిస్థితి మరింత కఠినంగా మారింది. బ్రిక్స్ దేశాలపై 100 శాతం టారిఫ్ పన్నులు ఉండొచ్చన్న సంకేతాలు రూపాయిని మరింత పడిపోయేలా చేసింది. ఇప్పటికే డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు వరుసగా ఈక్విటీలను తరలించుకు పోతున్నారు. మరోవైపు చమురు ధరలు పెరగడమూ, భారత ఎగుమతులు పడిపోవడం, వాణిజ్యలోటు పెరగడం, ఇతర విదేశీ చెల్లింపుల భారం రూపాయి విలువను అధ:పాతాళానికి జారుకునేలా చేస్తున్నాయి. భారత తయారీ రంగం నేలచూపులు చూడటం, జీడీపీ అంచనాలను చేరకపోవడం, ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు క్రమంగా తరిగి పోవడం తదితర అంశాలు ప్రతికూలతను పెంచాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 84.59 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84.73 కనిష్ట స్థాయిని తాకి.. తుదకు అదే స్థాయిలో ముగిసింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాదకర ఘంటికలు మోగుతోన్న వేళ.. రూపాయి పతనం మరిన్ని చిక్కులను తెచ్చిపెట్టనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏడాదిలో 12,403 కొలువులు భర్తీ

- పారదర్శకంగా నియామకాలు
- గ్రూప్-1 పరీక్ష విజయవంతంగా పూర్తి
- జాబ్ క్యాలెండర్ ద్వారా నోటిఫికేషన్ల వివరాలు
- టీజీపీఎస్సీ పనితీరుపై నిరుద్యోగుల్లో సంతృప్తి



టీజీపీఎస్సీ మాజీ చైర్మెన్ మహేందర్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న పాలకమండలి,సిబ్బంది

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 13,121 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్లను జారీ చేసింది. వాటిలో ఏడాది కాలంలోనే 12,403 కొలువులను భర్తీ చేసింది. అందులో హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులు 19, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 18, ఏఈఈ (అగ్రికల్చర్) పోస్టులు 95, ఏఈఈ (మెకానికల్) పోస్టులు 96, ఏఈఈ (ఎలక్ట్రికల్) పోస్టులు 163, ఏఈఈ (సివిల్) పోస్టులు 1,154, భూగర్భ జలపారుదల శాఖలో గెజిటెడ్ పోస్టులు 30, ఎంఏయూడీలో అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 76, అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టులు 145, ల్యాబ్ టెక్నీషియల్ గ్రేడ్-2 పోస్టులు 282, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులు 596, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులు 171, లైబ్రరియన్ పోస్టులు 64, ఏఎంవీఐ పోస్టులు 113, గ్రూప్-4 పోస్టులు 8,143, ఫిజియోథెరపీ పోస్టులు 48, జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులు 882, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు 206, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) పోస్టులు 24, భూగర్భ జలవనరుల శాఖలో నాన్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టులు 25, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) పోస్టులు 53 చొప్పున 12,403 పోస్టులను టీజీపీఎస్సీ భర్తీ చేసింది. పోటీ పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకతను పాటించింది. సంప్రదాయ ఓఎంఆర్ పద్ధతిలో కాకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సీబీఆర్టీ)లో పరీక్షలను నిర్వహించింది. అవకతవకలకు తావులేకుండా వంద శాతం అభ్యర్థుల బయోమెట్రిక్‌ను తీసుకుంటున్నది. రాష్ట్రంలో తొలిసారిగా సమగ్ర జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించింది. నిరుద్యోగులు పరీక్షలు జరిగే తేదీలను గుర్తించి క్రమపద్ధతిలో సన్నద్ధం కావడానికి టీజీపీఎస్సీ అవకాశం కల్పించింది. పోటీ పరీక్షల్లో న్యాయవివాదాలను అధిగమించేందుకు పూర్తిస్థాయి న్యాయ అధికారితోపాటు నలుగురు లీగల్ కన్సల్టెంట్లను నియమించింది. ఐటీ వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. మానవ తప్పిదాలు జరగకుండా ఫలితాల వెల్లడిలో ఆటోమేషన్ ప్రాసెసింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సుదీర్ఘకాలం పట్టే గ్రూప్-4 నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి గ్రూప్-1 పరీక్షను టీజీపీఎస్సీ విజయవంతంగా నిర్వహించింది. గతంలో రెండుసార్లు ఆ పరీక్ష రద్దయ్యింది. వాటిని దృష్టిలో ఉంచుకుని కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ఎలాంటి ఆటంకాలు లేకుండా గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్ రాతపరీక్షలను పూర్తి చేసింది. గ్రూప్-3 విజయవంతంగా నిర్వహించింది. కమిషన్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. 142 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతున్నది. కమిషన్‌లో ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నది. సిబ్బంది పనితీరులో సానుకూల మార్పునకు ఆ శిక్షణ దోహదపడింది.

వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు.. మనువాదులే

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-బంజారాహిల్స్

వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు.. మనువాదులు, స్వార్థపరులని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. వివేక్ మాలలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఇంకా అడ్డుపడతామంటున్న వారికి సమాజంలో ఎవరి మద్దతు లేదన్నారు. అంబేద్కర్ సామాజిక న్యాయ సూత్రాన్ని ముందుకు నడిపేది మాదిగలేనన్నారు. వర్గీకరణకు అడ్డుపడుతున్న వారు మాలల్లో ఉన్న కొంతమంది స్వార్థ పరులేనని చెప్పారు. ఆదివారం జరిగిన మాలల సభలో అంబేద్కర్‌ను అవమానించారని విమర్శించారు. వెంకట స్వామి అంబేద్కర్ కంటే గొప్పవారా? ఆయన చిత్ర పటాన్ని ముందు పెట్టి అంబేద్కర్ ఫోటోను కింద పెడ్తారా అని ప్రశ్నించారు. తాము తమ జనాభాకు తగ్గట్టు వాటా అడుగుతున్నామని, ఏ వర్గం వారికైనా జనాభాకు తగ్గట్టు ప్రాతినిధ్యం ఉండాలని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను ఏ పార్టీ ధైర్యంగా వ్యతిరేకించడం లేదని, వ్యతిరేకించే వారు రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. అన్ని పార్టీలు అనుకూలంగా ఉన్నాయని, కాంగ్రెస్ కూడా అనుకులంగా ఉందన్నారు. అయితే ఇప్పుడు ఆ పార్టీలో వివేక్ ఏ స్థానంలో ఉన్నారని ప్రశ్నించారు. వర్గీకరణను వ్యతిరేకించే వారు కొత్త పార్టీ పెట్టుకోవాలని సూచించారు. వర్గీకరణను అడ్డుకునే వాళ్లని రాజకీయ జీవితం లేకుండా చేస్తామని హెచ్చరించారు. రాజకీయంగా వారిని ఎదుర్కొంటామని, కచ్చితంగా ఓడిస్తామని చెప్పారు. 59 కులాల్లో మీరు ఒంటరి వారు అవుతారని తస్మా జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారిని మాదిగల శత్రువులుగా చూస్తామని వాళ్ళు ఎన్ని జన్మలెత్తినా, ఆరు నూరైనా ఎస్సీ వర్గీకరణ ఆగదన్నారు. వర్గీకరణ వద్దంటే మాలల మీటింగ్‌లో మాదిగలు కూడా ఉండాలి కదా అని అన్నారు.

జలదృశ్యం నుంచి తెలంగాణ భవన్ దాకా..

- 25 ఏండ్లపాటు పార్టీకి సేవలందించిన గొప్ప వ్యక్తి
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి వీడ్కోలు సభలో హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాటి జలదృశ్యం నుంచి నేటి తెలంగాణ భవన్ దాకా 25 ఏండ్లపాటు తమ పార్టీకి ఎనలేని సేవలందించిన మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి గొప్ప వ్యక్తి అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశంసించారు. పార్టీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటిదాకా ప్రధాన కార్యదర్శిగా ఉండి, ఏండ్లపాటు తెలంగాణ భవన్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారని తెలిపారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు బాధ్యతల నుంచి వైదొలుగుతున్నారని తెలిసి అధినేత కేసీఆర్ సైతం ఎంతో బాధపడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ భవన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి...సోమవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ అంటే అందరికీ కేసీఆర్ పేరు గుర్తుకొస్తుందనీ, అదే తరహాలో తెలంగాణ భవన్ అంటే శ్రీనివాసరెడ్డి పేరే గుర్తుకొస్తుందని తెలిపారు. భవన్ ఇన్‌ఛార్జిగా కేసీఆర్ చెప్పిన ప్రతీ విషయాన్నీ ఆయన తూ.చా.తప్పకుండా అమలు చేసేవారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ కష్టాలన్నింటినీ ఆయన కళ్లారా చూశారని చెప్పారు. ఈ క్రమంలో ఆయన తన అనుభవాలన్నింటినీ పుస్తక రూపంలో తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలతో దేశానికే ముప్పు

ప్రజలకు పేదరికం, కార్పొరేట్లకు రూ.కోట్ల ఆదాయం

అగ్రిస్‌యాక్టుతో రైతులు కూలీలుగా మారే అవకాశం

- పోరాటాలతోనే ప్రభుత్వాలకు బుద్ధి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- మిర్యాలగూడలో ప్రారంభమైన సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా మహాసభలు
- రెడ్‌షర్ట్ వాలంటీర్స్‌తో భారీ ప్రదర్శన, బహిరంగసభ



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రధాని మోడీ విధానాల వల్ల భవిష్యత్‌లో దేశానికి ముప్పు వాటిల్లనుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా 21వ మహాసభలు మిర్యాలగూడలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాదిమందితో మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఎన్నెస్పీ క్యాంపులో జరిగిన బహిరంగసభలో రాఘవులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను కొల్లగొట్టి పది మంది కార్పొరేట్లకు కోట్లాది రూపాయలను అప్పనంగా అప్పజెప్తున్నారని, సామాన్య ప్రజలు మాత్రం పేదరికంలోకి నెట్టబడేలా విధానాలను అనుసరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుచట్టాలపై ఢిల్లీలో రైతులు ఉద్యమం చేపట్టగా మోడీ వెనక్కు తగ్గారని, కొన్ని హామీలను సైతం ఇచ్చారని గుర్తుచేశారు. కానీ వాటిని ఇప్పటివరకు అమలుచేయలేదని అన్నారు. రైతులకు కనీసం గిట్టుబాటుధర చట్టం తేవాలని, సంక్షోభం నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని, ఢిల్లీ ఆందోళనలో అమరులైన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మరోమారు రైతులు ఢిల్లీ బాట పడుతున్నారని చెప్పారు. మోడీ విధానాల వల్ల రైతులు దివాళా తీస్తున్నారని, అప్పులు, ఆత్మహత్యలు పెరిగి గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కష్టార్జితంతోనే అంబానీ తన కొడుకు పెండ్లికి రూ.4వేల కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. విద్యుత్ భారాలను పేదలపై మోపేందుకు గతంలో అదానీ తెలంగాణకు రూ.2029కోట్లు, ఆంధ్రాకు రూ.1750కోట్లు లంచంగా ఇచ్చారని విమర్శించారు. దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ నిజాయితీగా లేదని, సీపీఐ(ఎం) మాత్రమే పేదల కోసం నిజాయితీగా పనిచేస్తుందన్నారు.



రైతుల భూములను కార్పొరేట్‌శక్తులకు అప్పజెప్పేందుకు అగ్రిస్‌యాక్టు పథకాన్ని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చేందుకు యత్నిస్తోందని తెలిపారు. ఈ యాక్ట్ ద్వారా భూములను కంప్యూటరీకరణ చేసి రైతు ఐడీ కార్డుతో దాన్ని అనుసంధానం చేసి కొనుగోలు, అమ్మకాలు సులువుగా జరిగేందుకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. తద్వారా బలహీనమైన రైతులకు ఆశచూపి ఆ భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని, ఈ యాక్ట్ ద్వారా భవిష్యత్‌లో రైతులు కూలీలుగా మారే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాలకు హక్కులు లేకుండా మోడీ కొత్తచట్టాలు తీసుకొస్తున్నారని, దాని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం ద్వారా స్థానిక సంస్థలు నిర్వీర్యం కావడంతో పాటు ప్రాంతీయ పార్టీలు కనుమరుగవుతాయని తెలిపారు. ప్రజలు తిరగబడితే ప్రభుత్వాల మనుగడ కష్టమని, ఇటీవల శ్రీలంక, నేపాల్‌లో జరిగిన పరిణామాలే ఉదాహరణ అని అన్నారు. లగచర్లలో ఫార్మాకంపెనీ రద్దు కమ్యూనిస్టులు ముందుండి పోరాడటం వల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రజాఉద్యమాలు నిర్వహించి బలమైన శక్తిగా ఎదుగుతామని, ఎర్రజెండాకు పూర్వ వైభవం తేవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి. మల్లు లక్ష్మీ మాట్లాడారు.

ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశ్, సయ్యద్ హాషం, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, నాగార్జున, చినపాక లక్ష్మీనారాయణ, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ వాటర్ సంప్ పనులను పరిశీలించిన సీఎం



నవతెలంగాణ - బంజారా హిల్స్

హైదరాబాద్‌లోని లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద వరద నివారణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంప్ పనులను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నివారణపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. రోడ్లపై వరదను మళ్లిస్తే నగరంలో ట్రాఫిక్ జామ్‌లను తగ్గించవచ్చని సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి అన్నీ చోట్ల పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైయిన్ వాటర్ సంప్‌ల డిజైన్ మార్చాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ వ్యాప్తంగా గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గర రెయిన్ వాటర్ సంపులను నిర్మించాలని ఆదేశించారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇళంబర్తి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలి

- భూ నిర్వాసితులందరికీ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, భూనిర్వాసితులందరికీ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో రెండు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు మహాసభలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అంతగిరిసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, కాలువలు, ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల భూమిని సేకరించారని అన్నారు. కానీ రైతులకు, నిర్వాసిత కుటుంబాలకు, యువతకు పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వలేదని ఆరోపించారు. మూడు, నాలుగు ఏండ్లు గడిచినా.. ఇప్పటికీ ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని అన్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా సమస్యల పరిష్కారం చూపాలని కోరారు. జిల్లాలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల అమలుకు నోచుకోవడం లేదని, ఉద్యోగ భద్రత లేదన్నారు. వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ ఈఎస్ఐ డిస్పెన్సరీ హాస్పిటల్ లేదన్నారు. బీడీ, హమాలీ భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు భద్రత లేదని, వారి భద్రతకు సమగ్ర బీమా చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ, మున్సిపల్, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విద్యుత్ రంగాల సమస్యలు పరిష్కరించి కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేసి, కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతాంగం, ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కార కోసం భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, శశిధర్ గోపాలస్వామి, ఎల్లయ్య భాస్కర్ సత్తిరెడ్డి బండ స్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా మల్లు నాగార్జున్‌రెడ్డి

- 9 మందితో జిల్లా కార్యదర్శి వర్గం,
- 34 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-సూర్యాపేట

నవంబర్ 29, 30, డిసెంబర్ ఒకటవ తేదీల్లో జరిగిన సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా మూడో మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభల్లో 34 మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిలో 9మంది కార్యదర్శివర్గ సభ్యులు. కాగా, జిల్లా కార్యదర్శిగా మల్లు నాగార్జున్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, ములకలపల్లి రాములు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా వేల్పుల వెంకన్న, జె.నర్సింహారావు, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, దండా వెంకట్‌రెడ్డి, కొప్పుల రజిత, మేకనబోయిన శేఖర్, ఎల్గూరి గోవింద్, మద్దెలజ్యోతి, కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, మిట్ట గడుపుల ముత్యాలు, బెల్లంకొండ సత్యనారాయణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పల్లె వెంకట్ రెడ్డి, దుగ్గి బ్రహ్మం, భూక్యా పాండునాయక్, వట్టెపు సైదులు, షేక్ యాకూబ్, కొదమగుండ్ల నగేష్, కందగట్ల అనంత ప్రకాష్, షేక్‌సైదా, జూలకంటి విజయలక్ష్మి, బచ్చలకూర స్వరాజ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వికలాంగులకు సమాన హక్కులుండాలి

నవ తెలంగాణ - హైదరాబాద్

వికలాంగులను కూడా సమాజంలో పూర్తి స్థాయి పౌరులుగా గుర్తించాలని కోరుకుంటున్నామని ఆల్ ఇండియా యూకో బ్యాంక్ బ్యాంక్ దివ్యాంగ్‌జన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ ప్రెసిడెంట్ ఎ శ్రీను, ప్రతినిధి అక్కిశెట్టి శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు. శారీరక అవరోధాలను తొలగించడానికి ప్రభుత్వం, ప్రయివేటు సంస్థలు కలిసి పని చేయాలన్నారు. ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. వికలాంగుల హక్కులను పరిరక్షించాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుంటే పోరాటం



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని, దాంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని, హామీలను అమలుచేయకుంటే పోరాటాలు తప్పవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం నాందేవ్‌వాడలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఏడాది ప్రజా పాలనలో సాధించిన విజయాలపై విజయోత్సవ సభలను నిర్వహిస్తున్నదని, కానీ నేటికీ ఇంకా అనేక సమస్యలు, ప్రజలకు ఇచ్చిన హామీలు అపరిష్కృతంగా ఉన్నాయని అన్నారు. రైతు భరోసాను ఇంతవరకు అమలు చేయలేదని, దాంతో పెట్టుబడి కోసం ప్రయివేటు వ్యక్తుల వద్ద రైతులు అప్పులు చేస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. అదే విధంగా వ్యవసాయ కూలీలకు రూ.12,000, వృద్ధులు, వితంతువులకు రూ.4000 పెన్షన్, వికలాంగులకు రూ.6000 పెన్షన్ చెల్లిస్తామని హామీనిచ్చినా ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభించలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ ఇంకా జరగలేదని అన్నారు. ఉద్యోగ, కార్మికుల వేతనాలు పెంచేందుకు, అదేవిధంగా పెండింగ్ డీఏలు ఇవ్వలేదని తెలిపారు బీడీ కార్మికులకు జీవన భృతి రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళనలు చేస్తుంటే, అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమ, జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, వెంకటేష్, కమిటీ సభ్యులు వై.గంగాధర్, నన్నేసాబ్, సుజాత, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అదానీకి బంగ్లా షాక్

విద్యుత్ ధరలు తగ్గించాల్సిందేనని పట్టు

బ్లాక్‌మెయిల్ చేస్తే ఊరుకోబోమని స్పష్టీకరణ

ఢాకా : అదానీ గ్రూపుతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం కింద ధరలను గణనీయంగా తగ్గించాలని బంగ్లాదేశ్ కోరుతోంది. అదానీ గ్రూప్ చైర్మెన్ గౌతమ్ అదానీపై అమెరికా న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలైన నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. అమెరికా కోర్టులో ప్రాసిక్యూటర్లు అభియోగాలు నమోదు చేసిన నేపథ్యంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఫ్రాన్స్‌కు చెందిన టోటల్‌ఎనర్జీస్ సంస్థ పెట్టుబడులను నిలిపివేసింది. కెన్యా ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులన్నింటినీ రద్దు చేసుకుంది. వివిధ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల కారణంగా అదానీ గ్రూప్ కంపెనీలు 33 బిలియన్ డాలర్లకు పైగా నష్టపోయాయి.

షేక్ హసీనా ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఏడు ప్రధాన ఇంధన, విద్యుత్ ప్రాజెక్టులపై విచారణ జరిపేందుకు దర్యాప్తు సంస్థను నియమించాలని సమీక్షా కమిటీ బంగ్లా ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ ఏడింటిలో అదానీకి సంబంధించిన ప్రాజెక్ట్ కూడా ఉంది. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం ఈ సమీక్షా కమిటీని నియమించింది. మరోవైపు...2017లో హసీనా ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని బంగ్లాదేశ్ హైకోర్ట్ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది.

హసీనా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జార్ఖండ్‌లోని గొడ్డా బొగ్గు ప్లాంటులో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అదానీ పవర్ కంపెనీ బంగ్లాదేశ్‌కు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్టులో ఏవైనా తేడాలు ఉన్నట్లయితే తిరిగి చర్చలు జరుపుతామని బంగ్లాదేశ్ విద్యుత్, ఇంధన సలహాదారు మహమ్మద్ ఫౌజల్ కబీర్ ఖాన్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు జరిగే విచారణలో అవినీతి, లంచం ఆరోపణలు



నిరూపితమైనప్పుడు మాత్రమే ఒప్పందాన్ని రద్దు చేసుకుంటామని ఆయన చెప్పారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని అంశాలను గుర్తించిందని అంటూ విద్యుత్ ప్లాంటుకు ఇచ్చిన కొన్ని ఆదాయపన్ను మినహాయింపుల నుండి తమ దేశం ఎలాంటి ప్రయోజనం పొందడం లేదని వివరించారు.

ఒప్పందాన్ని సవరించాలని కోరుతూ బంగ్లాదేశ్ విద్యుత్ అభివృద్ధి బోర్డు (బీపీడీ) గత సంవత్సరం అదానీ పవర్‌కు లేఖ రాసింది. కాగా అదానీపై అమెరికా చేసిన అవినీతి ఆరోపణలు తమ ఒప్పందంపై ప్రభావం చూపకపోవచ్చునని కబీర్ ఖాన్ చెప్పారు. 'ఎందుకంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాల్సి ఉంటుంది. అదానీ మాత్రమే కాదు...విద్యుత్‌ను ఎవరు సరఫరా చేసినప్పటికీ ధరలు సగటు రిటైల్ ధరల కంటే తక్కువగా ఉండాలని మేము కోరుకుంటున్నాం' అని అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్‌కు అదానీ అత్యధిక ధరను (యూనిట్ ధర 14.02 టాకాలు) వసూలు చేశారు. 'అదానీ తన సరఫరాను సగం తగ్గించుకుంటే ఏమీ అవదు. ఎందుకంటే విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం బంగ్లాదేశ్‌కు ఉంది. మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి ఏ విద్యుత్ ఉత్పత్తిదారునూ అనుమతించం' అని కబీర్ ఖాన్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న 'మహా' ప్రతిష్టంభన

పదో రోజూ వీడని ఉత్కంఠ

ముంబయికి బీజేపీ పరిశీలకులు

- నేడు మహాయుతి భేటీ ?
- రేపు బీజేపీ శాసనసభాపక్ష సమావేశం

న్యూఢిల్లీ/ముంబయి : మరాఠా పీఠంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం పదో రోజుకు చేరింది. బుధవారం జరిగే పార్టీ శాసనసభాపక్ష సమావేశానికి పరిశీలకులుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీని బీజేపీ అధిష్టానం ముంబయి పంపుతోంది. మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే తన షెడ్యూల్ సమావేశాలను రద్దు చేసుకున్నారు. మరో కీలక నేత, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ హస్తిన బాట పట్టారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ఆయన బీజేపీ నాయకత్వంతో చర్చలు జరుపుతారు. బీజేపీ అధిష్టానంతో జరిగే చర్చల సందర్భంగా మంత్రుల శాఖల కేటాయింపు అంశాన్ని అజిత్ పవార్ లేవనెత్తే అవకాశం ఉంది. కాగా మహాయుతి నేతల మధ్య సోమవారం సమావేశమేదీ జరగబోదని శివసేన వర్గాలు తెలిపాయి. మహాయుతి భాగస్వామ్య పక్షాల మధ్య బీజేపీ ఏర్పాటు చేయబోయే సమావేశం కోసం తాము ఎదురు చూస్తున్నామని ఆ వర్గాలు చెప్పాయి. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి శిండేకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించి పది రోజులు గడిచినప్పటికీ ఇంకా ప్రభుత్వం ఏర్పడలేదు. ముఖ్యమంత్రి పదవికి ఫడ్నవీస్ పేరు ఖరారైందని బీజేపీ సీనియర్ నేత ఒకరు పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. బీజేపీ శాసన సభా పక్ష సమావేశంలో ఫడ్నవీస్‌ను నేతగా ఎన్ను కుంటారని ఆయన చెప్పారు. మహారాష్ట్ర ముఖ్య మంత్రి పదవిపై బీజేపీ అధిష్టానం మల్లగుల్లాలు పడు తుంటే ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల ఐదవ తేదీన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్‌కులే ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే అవకాశం ఉన్నదని ఆయన చెప్పారు. ఏక్‌నాథ్ శిండే గొంతు ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతుండడంతో సోమవారం జరగాల్సిన మహాయుతి నేతల భేటీ వాయిదా పడింది. షిండే తన అధికార నివాసం 'వర్ష'కు చేరుకోలేదు. ఆయన ఇంకా సతారాలోని తన స్వగ్రామంలోనే ఉన్నారు. మహాయుతి నేతలు మంగళవారం సమావేశమై మంత్రుల శాఖల కేటాయింపుపై ఓ నిర్ణయానికి వస్తారని సమా చారం. ఇదిలావుండగా తనకు ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని డిమాండ్ చేస్తున్నట్టు వస్తున్న వార్తలను శిండే కుమారుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిండే తోసిపుచ్చారు. ఈ వార్తలు నిరాధా రమని అంటూ మంత్రి పదవికి తాను పోటీలో లేనని స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఏక్‌నాథ్ షిండే విశ్రాంతి కోసం స్వగ్రామానికి వెళ్లడంతో వదంతులు వ్యాపిస్తు న్నాయని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించిన తర్వాత తనకు కేంద్రంలో క్యాబినెట్ మంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, అయితే పదవిని చేపట్టాలన్న కోరిక తనకు లేదని అన్నారు.



నవతెలంగాణ

పుస్తకాలు దీపాలవంటివి వాటిలోని వెలుతురు మనలోని అజ్ఞానం అనేచీకటిని తొలగిస్తుంది - డా॥ బి.ఆర్. అంబేద్కర్

మంగళవారం 03 డిసెంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

సభా హననం



ప్రశ్నకూ, విమర్శకూ భయపడే పాలకపక్షం ఎంత బలవంతమైనదైతే మాత్రం ఏం ప్రయోజనం? ప్రశ్నలకు జవాబు చెప్పలేనప్పుడు అది పలాయనమే చిత్తగిస్తుంది. తన జవాబుదారీతనం లేమిని కప్పిపుచ్చుకోవడానికి ఎలాంటి అనైతిక ధోరణులకైనా దిగజారుతుంది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల తీరు గమనిస్తే బోధపడే సారాంశమిదే. పార్లమెంటు మన శాసనవ్యవస్థకే తలమానికమైన చట్టసభ. దేశానికే దిశానిర్దేశం చేసే అత్యున్నత ప్రజాప్రాతినిధ్య వేదిక. అలాంటి చోట ఏ చర్చకూ అవకాశం లేకుండా పోయాక ఇక మన ప్రజాస్వామ్యానికి అర్థమేముంటుంది? నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు ఇలా మొదలు... అలా వాయిదా అన్న ధోరణిలో జరుగుతున్న తీరు చూస్తే ఎవరికైనా కలిగే అభిప్రాయం ఇదే.

> అవినీతి తిమింగిలాల జాబితాలో ఇప్పుడున్న పేర్లు మొదటివి కావు...ఆఖరివి అంతకంటే కాబోవు! అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అక్కరకు రావాల్సిన జాతి వనరులను ఈ ధూర్త రాజకీయాలే దిగమింగుతున్నాయి. ఈ పార్లమెంట్ సమావేశాల ప్రారంభమైన రెండోరోజే రాజ్యాంగ దినోత్సవం...దానిలో రాజ్యాంగస్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పిన ప్రధాని, ఇదే రాజ్యాంగపు విలువలను ఇదే సమావేశాల్లో అటకెక్కించారు. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనపై నోరువిప్పని మోడీ సాబ్.. అవినీతిని రూపుమాపుతామంటూ జబ్బలు చరవడం హాస్యాస్పదం కాక మరేమిటి?

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెబీని అడ్డం పెట్టుకుని ఆయా రాష్ట్రాలతో ఎక్కువ ఖరీదుకు విద్యుత్ ఒప్పందాలు చేసుకుని రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలన్న విపక్షాల డిమాండ్‌ను కేంద్రం ఎందుకు పట్టించు కోదు. ప్రతిపక్షనేతలపై ఈడీలను, సీబీఐలను ఉసికొలిపే మోడీ సార్ ఐదు రాష్ట్రాల్లోని రాజకీయ నేతలకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్ట జెప్పినట్టు అదానీ బ్రదర్స్ రాసుకున్న పత్రాల్లో తేలినా చర్యలకు ఎందుకు ఉపక్రమించడం లేదు? మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు బాధ్యులైన ఆ రాష్ట్ర సీఎంపై చర్యలు తీసుకోవడం, మరో పక్కదేశంలో పలుచోట్ల మసీదుల కింద దేవాలయాలున్నాయనే నెపంతో అల్లర్లు సృష్టించడం, మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన చట్ట ఉల్లంఘనలు, దేశానికి అవసరమైన మౌలికాంశాలపైన పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు పట్టుపడితే మోడీ ప్రభుత్వం తప్పించుకు తిరుగుతోంది. అవినీతిలో, బంధుప్రీతిలో అస్మదీయులకు ప్రజాసంపద దోచిపెట్టడంలో గత పాలకుల కంటే రెండాకులు ఎక్కువే చదివారు నేటి పాలకులు. వీరి హయాంలో అవినీతిని వ్యవస్థీకృతం చేయడంలో మరింత పెంచి పోషించింది తప్ప.. దానిని అరికట్టడానికి తీసుకున్న చర్యలు శూన్యం. కార్పొరేట్లకు దోచిపెట్టడానికి వల్లమాలిన ప్రేమ ఒలకబోసే ఈ నేతలే అవినీతి గురించి గురివింద మాదిరి నైతిక విలువలను వల్లిస్తున్నారు.

విదేశాల్లో దాచిన నల్లడబ్బును వందరోజుల్లో వెనక్కు తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15లక్షలు చొప్పున జమచేస్తానన్న ఎన్నికల వాగ్దానాన్ని మూడు వేల రోజులు గడిచినా రాకపోవడంతో చివరకు ఎన్నికల తమాషాగా దాన్ని తేల్చివేశారు. మరి ప్రధాని పేదల కోసమే పడే ఆరాటం, పోరాటం ఏమైపోయాయి? అని అడిగితే నేరం. పనామా పత్రాలు, బహమస్ లీకులు వెల్లడించిన భారత నల్లకుబేరులపై కనీస చర్యలు కూడా తీసుకోలేదు. అంతెందుకు, అవినీతిని అంతం చేస్తానంటున్న మోడీ, దేశంలో పెచ్చరిల్లిన అవినీతికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజాందోళన తదుపరి లోక్‌పాల్ బిల్లును పార్లమెంట్ ఆమోదించి ఏండ్లు గడిచినా ఇంతవరకు ఎందుకు నియమించలేదు! నిజంగా నేరస్థులో కాదో తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది విచారణ ఖైదీలు కారాగారాల్లో మగ్గిపోతున్నారు. అవినీతిని ఆరోప్రాణంగా భావించే పెద్దమనుషులేమో నాయకులై...చట్టానికి చుట్టాలై రాజకీయ చక్రం తిప్పుతున్నారు. నీకిది, నాకది పద్ధతిలో పంచుకుంటూ, తమ చేతులకు మట్టి అంటకుండా, మూడో కంటికి తెలియకుండా డబ్బును భారీయెత్తున దేశం దాటించే అదానీ, విజయ్ మాల్యా, నీరవ్‌మోడీలాంటి బడాబాబులెందరు? విదేశాల్లో తలదాచుకుంటున్న ఇలాంటి వారిపై చర్యలంటే పాలకులకు వణుకెం దుకు? అవినీతి జగత్తుకు మకుటంలేని మహారాజులైనప్పటికీ వారందరూ కాషాయ తీర్థం పుచ్చుకోగానే అగ్నిపునీతులైపోతున్నారు.

అవినీతి తిమింగిలాల జాబితాలో ఇప్పుడున్న పేర్లు మొదటివి కావు... ఆఖరివి అంతకంటే కాబోవు! అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అక్కరకు రావాల్సిన జాతి వనరులను ఈ ధూర్త రాజకీయాలే దిగమింగుతున్నాయి. ఈ పార్లమెంట్ సమావేశాల ప్రారంభమైన రెండోరోజే రాజ్యాంగ దినోత్స వం... దానిలో రాజ్యాంగస్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పిన ప్రధాని, ఇదే రాజ్యాంగపు విలువలను ఇదే సమావేశాల్లో అటకెక్కించారు. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనపై నోరువిప్పని మోడీ సాబ్.. అవినీతిని రూపుమాపుతామంటూ జబ్బలు చరవడం హాస్యాస్పదం కాక మరేమిటి? "తమ విధానాల ద్వారా 2లక్షల కోట్లు అవినీతి పరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడగలిగాం" చెప్పే మోడీ సార్.. బడానేతలు బ్యాంకులకు ఎగొట్టిన లక్షల కోట్లు సంగతి దాచారా? మరిచారా? చర్చకూ ప్రశ్నకూ అవకాశమివ్వని ఈ సమయ హననం అంత కంతకూ వేగం పుంజుకుంటోందనడానికి ఈ సమావేశాలు ఓ మచ్చుతునక. ప్రతిపక్షాల గొంతునొక్కే నిరంకుశ పోకడలకు ఇదో పరాకాష్ట. ఈ స్థితిని ప్రతిఘటించడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం పౌరసమాజమూ ప్రగతిశీల శక్తులందరి కర్తవ్యం.

'భోపాల్'పాఠాలు నేర్చామా?

భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాద సంఘటనగా మిగిలిన మధ్యప్రదేశ్‌లోని భోపాల్ దుర్ఘటన నుండి పాఠాలు నేర్చుకున్నామా? యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ కక్కిన విషంతో భోపాల్ మృత్యు నగరంగా, శవాల దిబ్బగా మారి మారి నలభై ఏండ్లు గడిచిపోయాయి. కానీ, ఇప్పటికీ దాని దుష్ప్రభావాలు వెంటాడుతున్న నేపథ్యంలో అటు వంటి దారుణాలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం లేదనే! సరళీకరణ ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రజల ప్రాణాలకన్నా, పెట్టుబడిదారుల, కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తడమే పాలకులకు ప్రాధాన్యతగా మారింది. భోపాల్ స్థాయిలో కాకపోయినా తెలుగు రాష్ట్రాల్లోనూ పారిశ్రామిక ప్రమాదాలు కొనసాగుతు ఒడటం విచార కరం. ఏపీలోని విశాఖ ఎల్‌జీ పాలిమర్స్, ఆస్థాయిలో కాకపోయినా తెలంగాణలో సంగారెడ్డి, పటాన్‌చెరు, ఐడిఏ బొల్లారం ప్రాంతాల్లో పరిశ్రమల్లో నిత్యం ఏదో ఓ ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అయినప్పటికీ



పరిశ్రమల అభివృద్ధి కోసం నెత్తురు చిందించే కార్మికులు, వాటి ఏర్పాటు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసే ప్రజల ప్రయోజనాలను పాలకులు విస్మరిస్తూనే ఉన్నారు. భోపాల్ బాధిత ప్రజానీకం తమ సొంత పట్టణంలోనే కాందిశీకులుగా మారామని విలపిస్తున్నారు. ప్రభుత్వాల విధానాలు ఇలాగే కొనసాగితే మన రాష్ట్రం లోనూ అటువంటి దుస్థితి ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

ఆ రోజు ఏం జరిగింది?

1984 డిసెంబర్ 2వ తేదీ రాత్రి 'యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ' నుండి ఒక్కసారిగా వెలువడిన విష వాయువులు భోపాల్ నగరాన్ని చుట్టుముట్టాయి. ఏం జరుగుతోందో అర్థంకాక, ఊపిరాడక నిద్రలో ఉన్న వారు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. విష వాయువుల బారి నుండి ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీసిన వారు రోడ్లపైనే తుదిశ్వాస విడిచారు. తెల్లవారే సమయానికి ఎక్కడ చూసినా శవాల కుప్పలతో భోపాల్ మృత్యు నగరంగా మారింది. ఈ దుర్ఘటనలో 10,047 మంది ప్రాణాలు కోల్పోయారని, 5,74,000 మంది విషవాయువుల ప్రభావానికి గురయ్యారని ప్రభుత్వ అంచనా! మృతుల సంఖ్య 15 వేల పైనే ఉంటుందని వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రకటించాయి. రసాయన పారిశ్రామిక రంగంలో జపాన్‌లోని హిరోషిమా అణుబాంబు విస్ఫోటనంతో సమానమైనదిగా ఈ దారుణాన్ని నిపుణులు పోల్చారు. విష వాయువుల దుష్ప్రభావం ఇప్పటికీ వెంటాడుతోంది. ఈ విషాద సంఘటన జరిగిన ఇన్నేళ్ల తరువాత కూడా శిశువులు శారీరక, మానసిక వైకల్యంతో పుడుతూనే ఉన్నారు. భూగర్భ జలాలు విషతుల్యంగానే ఉన్నాయి.నష్టపరిహారం కోసం బాధిత కుటుంబాలు న్యాయస్థానాల చుట్టూ ఇంకా తిరుగుతూనే ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితేమిటి?

నలభై ఏళ్ల తరువాత కూడా భోపాల్ ప్రజలను విషవాయువు దుర్ఘటన ప్రభావాలు వెంటాడుతున్నాయి. రోగ నిరోధక శక్తి గణనీయంగా తగ్గింది. కరోనా విజృంభించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. విషవాయువు ప్రత్యక్ష బాధితులతో పాటు వారి సంతానానిది కూడా ఇదే దుస్థితి. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి లీకైన విష వాయువు కారణంగా వేలాదిమంది శ్వాసకోస వ్యాధులకు గురైన సంగతి తెలిసిందే. వీరందరికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గడంతో వారి సంతానంపై కూడా దాని ప్రభావం పడినట్లు తేల్చారు. మరోవైపు 1984 గ్యాస్ లీకయిన ప్పటి నుండి యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పడి ఉన్న విష పదార్థాలను ఇప్పటికీ తొల గించలేదు. వీటిని తొలగించాలని ఈ ఏడాది ప్రారంభంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. కానీ, అమలు అంతంత మాత్రమే. వీటిని ప్రాంగణంలోని మరో 23 చోట్ల ప్రధాన వ్యర్థాలను పూడ్చివేశారని, ప్లాంటుకు సమీపంలో ఉన్న ఒక చెరువులో కూడా వేల టన్నుల విష వ్యర్థాలను పూడ్చిపెట్టారని చెబుతున్నారు. వీటిని కూడా వెలికితీసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ వ్యర్థాల ఉనికిని ప్రభుత్వం ఇంకా నిర్ధారించాల్సి వుంది. అంటే, ఈ సమస్య పరిష్కారం కావడానికి ఇంకా ఎన్ని తరాలు మారాలో, ఎందరు ప్రజలు నష్టపోవాలో ఊహించు కోవాల్సిందే! ఈ ఏడాది ప్రారంభంలో భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో పేరుకు పోయిన విషపూరిత రసాయనిక వ్యర్థాలను తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలు జారీ చేసింది. అయితే, అమలు అంతంత మాత్రమే! ఫలితంగా భూగర్భ జలాలు పెద్ద ఎత్తున కలుషితమయ్యాయి. ఈ నీటిని తాగిన వారు అనేక రోగాల బారిన పడుతున్నారు. విష వాయువు బారిన పడిన ఒక మహిళ అప్పటి నుండి ఇప్పటి వరకు (నలభై సంవత్సరాల కాలంలో) 150 కిలోల ఔషధాలు వాడినట్లు ఒక వార్తా సంస్థకు చెప్పారు. అటువంటి దుస్థితి మన రాష్ట్ర ప్రజలకు రాకూడదని ఆశిద్దాం..!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

'కులగణన'పై ఈయనకు గుర్రెందుకు?



జి.రాములు
9490098006

మాజీ డీజీపీ అరవిందరావు నవంబర్ 23న ఆంధ్రజ్యోతి దినపత్రికలో కులగణనను వ్యతిరేకిస్తూ ఒక వ్యాసం రాశారు. కులగణన చేయడం భారతీయ సమాజాన్ని విడగొట్టే కుట్రగా చెప్పారు. ఇది బ్రిటీషు పాలకులు భారతీయ సమాజాన్ని విభజించే ఎజెండాతో అనుసరించిన పంథా అని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కులగణన జరిగితే సమాజంలో అల్లకల్లోలం ఏర్పడుతుందని, దాన్ని పోలీసులుగాని, ఆర్మీగాని అదుపు చేయలేరని ఆందోళన పడ్డారు. తన వాదనను సమర్థించుకోవడానికి అవాస్తవాలు చెప్పారు,వక్రీకరణలు జోడించారు.

నిజానికి ఈ దేశ మూలవాసులకి అసలైన మొదటి శత్రువులు నాడు పశ్చిమాసియా నుండి వచ్చిన ఆర్యులే. ఆ తర్వాతనే మరేవరైనా కావొచ్చు. అరవిందరావు వర్ణవ్యవస్థ అనాదిగా ఉందని, అదేమి భారతదేశ ప్రత్యేకత కాదని, ఇలాంటి వ్యవస్థలు ప్రపంచమంతా వున్నాయన్నారు. ఆయన చెప్పింది పాక్షిక సత్యమే. బ్రిటీషువారు వచ్చాకే భారతదేశంలో వర్ణవ్యవస్థ ఉనికిలోకి వచ్చిందనడం, వారొచ్చిన తర్వాతనే దేశంలో విచ్ఛిన్నకర పరిస్థితులు దాపురించాయనడం, అస్పృశ్యత బ్రిటీష్ వారు రాకముందు లేదనడం, అమాయకత్వం లేదా తెలివితక్కువతనం లేదా మోసకారితనం అవుతుంది.

బ్రిటీషు వారికి నల్ల జాతీయులంటే చులకన భావన ఉంది. దేశ సంపద కొల్లగొట్టారు. ఉద్యమాలను అణచివేశారు. కాని వారి కాలంలో తమ అవసరార్థం ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే సంస్క రణలు అనేకం చేశారన్నది వాస్తవం. వేల ఏండ్లుగా సాగుతున్న బ్రాహ్మణిజాన్ని దాని ఆధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా మూఢచారాలను నిషేధించారు. "సతీసహగమనం" రద్దు చేశారు. వర్ణాశ్రమ ధర్మానికి భిన్నంగా విద్య ప్రజలందరికి అందించే ప్రయత్నం చేశారు. విద్య అంటే మత గ్రంథాలు, పురాణాలు వల్లె వేయడం కాదని లోకజ్ఞానాన్ని పెంచే లెక్కలు, సైన్సు, చరిత్ర, భూగోళం, సామాజిక శాస్త్రం వంటివని వాటిని భోదనాంశాలుగా చేశారు. ఫలితంగానే పూలే, పెరియార్, అంబేద్కర్ లాంటి మహనీయులు నాటి భారతీయ సమాజం నుండి తయారయ్యారు. వారికి సేవకులను తయారు చేసుకోవడమూ అందులో ఇమిడి ఉంది. అది వేరే విషయం.

అరవిందరావు కులవ్యవస్థ ఇస్లాం వచ్చాకో, క్రైస్తవం అవతరించాకో ప్రారంభమయినట్లు చెప్పడం మోసకారితనమవుతుంది. ఈ విషయమై స్వామి వివేకానంద ఏమి చెప్పారో చూడండి. "అస్పృశ్యులు అనబడే ప్రజలను ఈనాటి అధ్వాన్న స్థితికి దిగజార్చింది ఎవరు? ఎవరు దీనికి బాధ్యులు? దీనికి ఆంగ్లేయులు మాత్రం కారణం కాదు. అనేక పారమార్థిక, వ్యవహారిక సిద్ధాంతాలను కనిపెట్టిన హిందూమతంలోని కుటిలులే ఇందుకు కారణం" అని స్పష్టంగా చెప్పారు. రామకృష్ణ మఠం ప్రచురించిన "స్వామి వివేకానంద" పుస్తకంలోని పదహారో పేజీలో ఈ విషయం స్పష్టంగా ఉంది. స్వామి వివేకానంద చెప్పిందైనా అరవిందరావు పరిగణలోకి తీసుకొని ఉంటే బావుండేది.

వర్ణవ్యవస్థగా చెప్పబడేది కేవలం సమాజ అవసరాల కోసం, సౌలభ్యం కోసం ఏర్పడ్డ వృత్తుల విభజన మాత్రమే, ఆ వృత్తులు వంశ పారంపర్యం కాదు. అక్కడ ఉచ్చం, నీచం, అంటరానితనం అంటూ తారతమ్యాలు లేవు. ఒక వృత్తి నుండి మరే వృత్తికైనా మారే స్వేచ్ఛ వుండేది. ఎలాంటి వివక్షలు లేవని ఆయన వాదన. ఆయన నిజంగానే ఆ వాదనను నమ్మేవారయితే మనుస్మృతిని రామాయణ, మహాభారతంలో వర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉన్న అంశాలను ఖండ ఖండాలుగా చీల్చి చెండాడేవారు. కానీ, మన సమాజంలోని వర్ణ కుల వ్యవస్థకు గ్రీస్ మరికొన్ని ప్రాచీన నాగరిక దేశాలకు చెందిన బానిస వ్యవస్థలకు మౌలిక తేడాలున్నవి. రెండింటిలో దోపిడీ చేసే వారికి దోపిడీ చేయబడే వారికి మధ్య వైరుధ్యమే ప్రధానమైనది. అయితే ప్రధాన తేడా ఏమిటంటే అక్కడ బానిస సల పేరిట దోపిడీ చేసేవారు. ఇక్కడ వర్ణం, కులం ముసుగులో దోపిడీ కొనసాగింది. ఈ వ్యవస్థలను నిలబెట్టడానికి, దీర్ఘకాలిక ప్రయోజనాలను బలపర్చుకోవడానికి ఒక సైద్ధాంతిక, తాత్విక మత చట్రం, నిర్మితమైనది. బయటి ప్రపంచ దేశాలలో కులవివక్ష, అంటరానితనం, మైల సిద్ధాంతం వగైరాల్లేవు. ఆర్థిక అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న తత్కాలిక నిర్బంధ చట్టాలవి.

దేవుడే అసమానతలు సృష్టించాడని, దేవుడి నోటి నుండి, బ్రాహ్మణులు బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని, హిందువులు పవిత్రంగా భావించే గ్రంథాలన్నీ చెపుతాయి. శూద్రుల పట్ల వివక్ష పాటించాలని, దళితులను అంటరానివారిగా చూడాలని, మహిళలను అణిచి ఉంచాలని చెపుతాయి. ఇతర వ్యవస్థల్లో ఇది మనకు కనపడదు. కానీ అరవిందరావు రెంటిని ఒకే గాట కట్టి మాయ చేస్తున్నారు. యూరప్‌లో కూడా కులవ్యవస్థ ఉన్నట్లు, అది పారిశ్రామిక విప్లవం ద్వారా అంతమయినట్లు ఆధారం లేని వాదనలు చేస్తున్నారు. ఇంగ్లీషు వారు రాకపోతే మన దేశంలోనూ పారిశ్రామిక విప్లవం వచ్చి కులవ్యవస్థ పటాపంచలయ్యేదని అన్నారు.

వారు చెప్పిన మరో అవాస్తవం ఏమిటంటే, హిందుమత గ్రంథాలు కులవ్యవస్థకు మూలమైన వర్ణవ్యవస్థ భారతీయ సమాజానికి ఏ నష్టం చేయలేదన్నది. పైగా లాభమే చేసిందని వాదిస్తున్నారు. కులగణన ద్వారా ప్రస్తుత ఆధిపత్య వర్ణాలకు ప్రయోజనకారిగా వున్న వర్ణ, కులవ్యవస్థలు నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. చదువు, సంపదలు కింది కులాలకు నిషేధించి తాము సమాజంపై పెత్తనం చేస్తూ సుఖ, సౌఖ్యాలు అనుభవించారు. ఇప్పటికి అనుభవిస్తున్నారు. వారు ఈ సౌకర్యాలు కొనసాగాలనుకోవడం సహజం. మన సమాజంలో కులం కొందరికి వరమైతే, కోట్లాను కోట్లమందికి శాపంలా దాపురించింది. సంపన్నులంతా ఎక్కువగా అగ్రకులాల నుండే వున్నారు. పేదలంతా దాదాపు ఎస్సీ, ఎస్టీ, బీసి కులాల నుండే వున్నారు. కులం ప్రభావితం చేయని రంగమంటూ లేదు. ఒక ఉదాహరణ చూస్తే ఇదెంత వాస్తవమో గమనించవచ్చు. ఈ ఏడాది జూన్ 30న దినపత్రికలలో ఈ వార్త వచ్చింది. ప్రపంచ అసమానతల నివేదిక వారు బహిర్గత పర్చారు. భారతదేశంలోని శతకోటీశ్వరులలో 88శాతం అగ్రకులస్తులే. జనాభాలో 15శాతం కూడా లేని అగ్రకులాలకు చెందినవారే సంపన్నుల్లో 88శాతం వున్నారు. మిగతా కులాలన్నింటి నుండి కేవలం 12శాతం



> కులగణన ద్వారా ఆ కుటుంబం ఆర్థిక, సామాజిక వివరాలన్ని సేకరించాలి. తరతరాలుగా చదువు,సంపద నిషేధించబడి, గత మూడు,నాలుగు తరాలు కొంత లబ్ధి పొందుతున్నారు. కింది కులాల్లోని వారు నూటికి నూరు శాతం ప్రయోజనం పొందుతున్నారన్న భావన కూడా సరైంది కాదు. కింది కులాల్లోనే నేడు నిరుద్యోగులు, చిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారు. ఆ వాస్తవాలు కూడా ఎక్కడ వెల్లడవుతాయోనని కొందరు మేధావులు తల్లడిల్లిపోతున్నారు. వెనుకబడిన కులాలు రిజర్వేషన్లను కొనసాగించవద్దని, తీసివేయాలని అగ్రకుల సంపన్న వర్ణాలు ఎప్పటి నుండో తమకున్న ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. కులగణనను ఆపడం ద్వారా కులాల వారి వివరాలు వారి పరిస్థితి తెలువకుండా చేయాలని వారి ప్రయత్నాలు ఉంటున్నాయి. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తిస్తున్నారు. అరవిందరావు డొల్ల మాటలను ఎవరూ విశ్వసించరు.

మాత్రమే. ఇదే పరిస్థితి, రాజకీయ, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసి, మీడియా అధిపతుల్లోనూ కనిపిస్తుంది.

గత మూడు, నాలుగు తరాల నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు వారు చదువుకొని విజ్ఞాన వంతులవుతున్నారు. ఆర్థికంగా మధ్య తరగతి వర్గాలలోకి చేరగలుగుతున్నారు. చైతన్యవంతులు కాగలుగుతున్నారు. తరతరాలుగా తమ పూర్వీకులకు జరిగిన అన్యాయాలు గుర్తిస్తున్నారు. ఇప్పటికీ తాము అన్నిరంగాల్లో వెనుకబడిన విషయాన్ని గమనించగలుగుతున్నారు. తమ భాగం తమకు కావాలంటున్నారు. అనేక రూపాల్లో ఆ ఉద్యమాలు సాగుతున్నాయి. కుల గణన జరిగితే వాస్తవాలు బయటికొస్తాయి. ఒక కుట్ర ప్రకారం వారు కులగణనను పలుచబరచాలని చూస్తున్నారు. ఏ కులం వారు ఎంత వున్నారు? ఎవరి దగ్గర ఎంతెంత మేరకు ఆస్తులున్నాయి. బహిర్గతమవుతాయి.అందుకే కింది కులాల వారు కులగణన కావాలని వివిధ రంగాల్లో కొంత కాలంగా ఉద్యమం చేస్తున్నారు. 1931లో బ్రిటీషు వారు కుల గణన చేశారు. కాని తర్వాత మళ్లీ జరుగలేదు. అప్పుడు జరిగిన కులగణన వలననే కింది కులాలకి రిజర్వేషన్ లాంటివి వచ్చాయి. వాటివలన దేశానికి నష్టం వాటిల్లిందని మతాంతీకరణలు జరిగాయని అరవిందరావు సిద్ధాంతీకరిస్తున్నారు.

సామాజిక న్యాయం కావాలని, కులగణన జరగాలని చేస్తున్న ఉద్యమాలు అరవిందరావు లాంటి వారిని కలవరపెడుతున్నాయి. ఎవరు కోరకున్నా పాలకులే ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం కుల గణన చేపడుతున్నారని ఆక్రోషిస్తున్నారు. ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల అందరూ సంతృప్తికరంగా వున్నారని అవాస్తవాలు చెపుతున్నారు. ఇది ఆయన స్థాయికి తగింది కాదు. పైగా సామాజిక న్యాయం, కులగణన లాంటి ఉద్యమాలను పాలకులు పట్టించుకోరాదని, దానివల్ల ప్రభుత్వం నిర్వీర్యం అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తుచేస్తున్నారు.

ఎంత చదివినా, ఎంత పెద్ద పదవులు నిర్వహించినా తాము పుట్టిన సామాజిక, ఆర్థిక పునాదులు వదులుకోవడం ఎంతో కష్టమని, అరవిందరావు వ్యాసం చూశాక ఎవరికైనా మరింత రూఢీ అవుతుంది. తమ నేపథ్యాల అస్తిత్వం నుండే భావనలు పుడుతాయని ఎంగెల్స్ చెప్పింది ఎంత వాస్తవమో అరవిందరావు వాదనలు చూస్తే అర్థమవుతుంది. కులగణన ద్వారా ఆ కుటుంబం ఆర్థిక, సామాజిక వివరాలన్ని సేకరించాలి. తరతరాలుగా చదువు,సంపద నిషేధించబడి, గత మూడు,నాలుగు తరాలు కొంత లబ్ధి పొందుతున్నారు. కింది కులాల్లోని వారు నూటికి నూరు శాతం ప్రయోజనం పొందుతున్నారన్న భావన కూడా సరైంది కాదు. కింది కులాల్లోనే నేడు నిరుద్యోగులు, చిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారు. ఆ వాస్తవాలు కూడా ఎక్కడ వెళ్లడవుతాయోనని కొందరు మేధావులు తల్లడిల్లిపోతున్నారు. వెనుకబడిన కులాలు రిజర్వేషన్లను కొనసాగించవద్దని, తీసివేయాలని అగ్రకుల సంపన్న వర్ణాలు ఎప్పటి నుండో తమకున్న ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. కులగణనను ఆపడం ద్వారా కులాల వారి వివరాలు వారి పరిస్థితి తెలువకుండా చేయాలని వారి ప్రయత్నాలు ఉంటున్నాయి. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తిస్తున్నారు. అరవిందరావు డొల్ల మాటలను ఎవరూ విశ్వసించరు.

టాస్క్‌ఫోర్స్ బడి భోజనాన్ని గట్టెక్కించేనా !?



కె.వేణుగోపాల్
9866514577

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించి, ఫుడ్ పాయిజన్ అయి తరచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో భోజనాన్ని నాణ్యంగా వండటం, ఆహారం కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విధివిధానాలను ప్రభుత్వం జారీచేసింది. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్సు లను ఏర్పాటు చేసి నిరంతరం పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంతకూ భోజనం కలుషితం కావడం కేవలం టాస్క్‌ఫోర్సు పర్యవేక్షణ లేకపోవడంతోనే జరుగుతుందా ? లేదా శుభ్రమైన, కలుషితం కాకుండా భోజనాన్ని వడ్డించడానికి కావలసిన క్షేత్రస్థాయి సౌకర్యాల మెరుగుకు ఏమైనా చర్యలు అవసరమా? అవేవీ లేకుండా కేవలం టాస్క్ ఫోర్సులను నియమించి, అదిరించి, బెదిరించి మంచి భోజనాన్ని వండి వడ్డించగలమా? సస్పెన్షన్లు చేస్తే సమస్యలు తీరిపోతాయనుకుంటే మాగనూరు పాఠశాలలో మూడోసారి కూడా మధ్యాహ్న భోజనం సమస్య ఏర్పడి ఉండేది కాదు. ప్రధానోపాధ్యాయున్ని, డీఇఓను సస్పెండ్ చేశారు. చివరకు మిడ్ డే మీల్స్ ఏజెన్సీ కూడా రద్దు చేశారు. అయినప్పటికీ వరుస ఘటనలు ఆగలేదంటే, కారణం మరేదో అని కదా ఆలోచించాలి. బడి భోజనం అమలులో ఉన్న ఇబ్బందులు, లోపాలను మూల కారణాలను అన్వేషిం చకుండా, పరిష్కరించకుండా కమిటీలను వేస్తేనో, భయభ్రాంతులకు గురిచేస్తేనో సమస్య పరిష్కరించబడదు, పైగా మరింత జటిలమవుతుంది.

మొదటగా చూడాల్సింది కుకింగ్ కాస్ట్. వాస్తవికంగా ఉన్న మార్కెట్ ధరలకు, వాటిలో వచ్చే హెచ్చుతగ్గులకు అనుగుణంగా కుకింగ్ కాస్ట్ పెంచబడాలి. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర ఆరు నుంచి ఏడు రూపాయలు పలుకుతుంటే 'నేను నీకు అయిదు రూపాయలు చెల్లిస్తాను,తప్పనిసరిగా కోడిగుడ్డు పెట్టాలి' అంటే ఏ నిర్వహకుడు పెట్టడానికి ఇష్టపడతాడు, ముందుకొస్తాడు? దానికి ప్రధానోపాధ్యాయున్ని నిందించడం, శిక్షించడం సరైనదేనా ? దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట ధరలను కేంద్రం పెంచింది. ఇప్పటివరకు వంట ఏజెన్సీ మహిళలు 1-5 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థికి రూ.5.45 చొప్పున చెల్లిస్తుండగా.. దాన్ని రూ.6.19కి పెంచారు. 6-8 తరగతుల పిల్లలకు రూ.8.17 చెల్లిస్తుండగా, రూ.9.29కు పెంచారు. కొత్త ధరలు డిసెంబరు ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. ఒక్కో విద్యార్థికయ్యే ఖర్చులో కేంద్రం 60, రాష్ట్రాలు 40 శాతం భరిస్తాయి. మధ్యాహ్న



భోజనం వండి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు బియ్యం అందజేస్తాయి. కూరల కోసం పప్పు, కూరగాయలు, నూనెలను వంట ఏజెన్సీ మహిళలు సమకూర్చుకుంటారు. కేంద్రం ఉత్తర్వుల కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు 9,10 తరగతులకు సొంత నిధులను వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

రెండోది, మధ్యాహ్న భోజనం ధరలను కేంద్ర ప్రభుత్వం 2022లో పెంచింది. వాస్తవానికి యేటా 7-8 శాతం పెంచాల్సి ఉండగా 2023లో పెంచలేదు. మధ్యాహ్న భోజనం నాణ్యత పెరగాలంటే కనీసం మరో 2శాతం అయినా పెంచాలి. గురుకులాల్లో ధరలకు సమానంగా ఉండేలా, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులను భరించాలి. రెండోది నిర్వాహకులకు బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలి. ప్రతి నెలా పదోతేదీ లోపల అంతకుముందు నెలకు సంబంధించిన బిల్లులు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఏనాడు చెల్లించిన దాఖలాలు లేవు. బిల్లులన్నీ నెలలు తరబడి పెండింగులో ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు అందరూ సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. రూ.వేలు, లక్షలు పెట్టుబడి పెట్టి వస్తువులు కూరగాయలు కొనుగోలు చేసి వంటచేసే శక్తి సామర్థ్యాలు వారికి ఉండవు. ఎస్సీ,ఎస్టీ, జనరల్‌లకు వేరువేరుగా బిల్లులు, కోడిగుడ్లకు మరో బిల్లు, 6-8 తరగతులకు ఒక బిల్లు, 9-10 తరగతులకు మరో బిల్లు, ఆనరోరియం పేరిట మరో బిల్లు ఇలా పదుల సంఖ్యలో బిల్లులు వస్తున్నాయి. ఇందులో ఏ బిల్లు వచ్చిందో, ఏ బిల్లు రాలేదో అర్థం కాక నిర్వాహకులు అయోమయానికి గురవుతున్నారు. వారిని సమన్వయం చేస్తూ, భోజనం సరిగా వుండేలా నిరంతరం ఆందోళనలో ప్రధానోపాధ్యాయులు ఉంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఒక్క బిల్లుతో ఏక మొత్తంగా ఎప్పటికప్పుడు చెల్లించడం ఉత్తమం.

మూడోది, చాలా పాఠశాలల్లో వారికి వంట చేయడానికి అవసరమైన సరైన వంట సామగ్రి కానీ, వంటగదులు కానీ, స్టోర్ రూమ్స్ కానీ లేనే లేవు. చాలా పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. వంట చెరుకుగా కట్టెలు వాడుతున్నది కూడా వాస్తవమే. కట్టెల పొయ్యి మీద వంట చేసినప్పుడు పొగరాకుండా ఎలా ఉంటుంది ? ఒకవేళ ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగించాలనుకుంటే ముందుగా వారికి అవసరమైన వంట సామగ్రి ఇవ్వడం, వంటగదులు నిర్మించడం, సిలిండర్లు అందించడం లాంటి వాటిపై చర్యలు తీసుకోవాలి.

నాల్గవది, పౌర సరఫరాల శాఖ ద్వారా వచ్చిన బియ్యాన్ని మాత్రమే పాఠశాలల్లో వినియోగిస్తారు. పలు సందర్భాలలో బియ్యం తూకం తక్కువ రావడం ఆ విషయాన్ని పలు సందర్భాల్లో, పలు సమావేశాలలో ప్రధానోపాధ్యాయులు పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతున్నదే. కొత్త బియ్యం పంపిణీ చేసినప్పుడు ఆ బియ్యంతో వంట చేసిన ప్రతిసారి, ప్రతిరోజు పాఠశాలల్లో ఇబ్బందే ఉంటుంది. కొంచెం పలుకు మీద దింపితే అన్నం గట్టిగా ఉండి పిల్లలకు కడుపు నొప్పి వస్తుంది. కొంచెం మెత్తగా ఉడికిస్తే అన్నం గుజ్జులాగా అయిపోయి మెత్తగా ఉండి పిల్లలు తినకుండా పారవేస్తారు. వండే అన్నంలో నూనె పోసినా కూడా ఈ సమస్య నుండి తప్పించుకోలేం. ఫోర్టిఫైడ్ రైస్ పంపించిన సందర్భంలో బియ్యం తొందరగా పాడైన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. బాగా పాత బియ్యం పంపించిన సందర్భాల్లో పురుగులతో కూడిన బియ్యం వచ్చిన సందర్భాలు లేకపోలేదు. బస్తా విప్పి చూస్తే కానీ లోపల బియ్యం ఎలా ఉంటాయోఎవరికి తెలియదు. కాబట్టి పాఠశాలలకు నాణ్యమైన బియ్యాన్ని పంపించాలి.

నిర్వాహకులకు చెల్లించే వేతనం గతంలో నెలకు రూ.వెయ్యి ఉంటే ఇప్పుడు 3 వేలకు పెంచారు. అంటే రోజుకు వంద రూపాయలు. బయట సాధారణ కూలీపనికి వెళ్తే రోజుకి 500 నుండి వెయ్యి వరకు చెల్లించబడుతుంది. మళ్లీ పాఠశాల పనిచేసే ఏ ఒక్కరోజు కూడా వారు సెలవు తీసుకోవడానికి వీల్లేదు. తప్పనిసరిగా వంట చేయాల్సిందే, విద్యార్థులకు భోజనం అందించాల్సిందే. కూలి పనికి ఇష్టముంటే వెళ్తారు, లేకపోతే మానేస్తారు.

> నిర్వాహకులకు చెల్లించే వేతనం గతంలో నెలకు రూ.వెయ్యి ఉంటే ఇప్పుడు 3 వేలకు పెంచారు. అంటే రోజుకు వంద రూపాయలు. బయట సాధారణ కూలీపనికి వెళ్తే రోజుకి 500 నుండి వెయ్యి వరకు చెల్లించబడుతుంది. మళ్లీ పాఠశాల పనిచేసే ఏ ఒక్కరోజు కూడా వారు సెలవు తీసుకోవడానికి వీల్లేదు. తప్పనిసరిగా వంట చేయాల్సిందే, విద్యార్థులకు భోజనం అందించాల్సిందే. కూలి పనికి ఇష్టముంటే వెళ్తారు, లేకపోతే మానేస్తారు. కానీ పాఠశాలలో వారికి ఆ అవకాశం కూడా ఉండదు. అయినా వారు పాఠశాలల్లో ఇంత తక్కువ మొత్తాలకు పని చేయడానికి ఏకైక కారణం 'ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్నాం గనుక ఏదైనా ఒక రోజు తమకు మేలు జరగకపోతుందా?' అన్న ఆశతో మాత్రమే. కాబట్టి వారికి కూడా గౌరవప్రదంగా వారి కుటుంబాన్ని పోషించుకోవడానికి సరిపడా కనీస వేతనాన్ని అందించాలి.

కానీ పాఠశాలలో వారికి ఆ అవకాశం కూడా ఉండదు. అయినా వారు పాఠశాలల్లో ఇంత తక్కువ మొత్తాలకు పని చేయడానికి ఏకైక కారణం 'ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్నాం గనుక ఏదైనా ఒక రోజు తమకు మేలు జరగకపోతుందా?' అన్న ఆశతో మాత్రమే. కాబట్టి వారికి కూడా గౌరవప్రదంగా వారి కుటుంబాన్ని పోషించుకోవడానికి సరిపడా కనీస వేతనాన్ని అందించాలి.

గురుకులాలు, కెజిబివి, ఆదర్శ పాఠశాలల్లో భోజనానికి చెల్లించే కుకింగ్ కాస్ట్ , భోజన వ్యవహారం వేరుగా ఉంటుంది. అక్కడ వంట చేయడానికి ప్రత్యేక వసతులు ఉంటాయి. వంట సరుకులు ప్రత్యేకంగా కాంట్రాక్టర్లు సరఫరా చేస్తారు. అయితే సుమారు 800 గురుకులాలకు శాశ్వత భవనాలు లేవు. అద్దె భవనాల్లో చాలా సమస్యలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందించడానికి ఒక సమాంతర వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం వల్ల ఎక్కువ మేలు జరిగే అవకాశం ఉంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల బాధ్యతలను భోజనం చేసే విద్యార్థుల సంఖ్య తెలపడం వరకు మాత్రమే పరిమితం చేస్తే బాగుంటుంది. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని డైరెక్ట్‌గా అందించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఉపాధ్యాయుల ప్రాథమిక విధి విద్యార్థులకు బోధన జరపడమే. ఈ ప్రాథమిక విధులకు విఘాతం కలిగించే బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి. వీటన్నింటిపై సర్కార్ స్పందిస్తేగానీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందుతుంది.

మావోయిస్టుల మృతదేహాలను భద్రపర్చండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పూలకొమ్మ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించిన ఘటనపై హైకోర్టు సోమవారం విచారణచేపట్టింది. వాళ్ల మృతదేహాలను మంగళవారం వరకు భద్రపరచాలని ఏటూరునాగారం ఎస్‌హెచ్‌ఓను ఆదేశించింది. మృతదేహాలను చూడటానికి పిటిషనర్‌తోపాటు బంధువులను అనుమతించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలన్న పిటిషనర్ వినతిని తోసిపుచ్చింది. ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమంటూ మృతుడు మల్లయ్య భార్య కె ఐలమ్మ అలియాస్ మీనా వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. ప్రాణాలతో తీసుకెళ్లి కాల్చేశారనీ, విషాహారం పెట్టి మత్తులోకి జారుకున్నాక తీసుకువెళ్లి నానా చిత్రహింసలు పెట్టారని ఆమె తరపు న్యాయవాది వాదించారు. ఆ తర్వాతే వాళ్ల శరీరంలోకి పోలీసుల బుల్లెట్‌లు దిగాయన్నారు. సుప్రీం, హైకోర్టు తీర్పుల ప్రకారం ఎన్‌కౌంటర్ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించాలన్నారు. రాత్రి పోస్టుమార్టం చేయించమే అది బూటకపు ఎన్‌కౌంటర్ అని అర్ధమవుతోందన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎఫ్‌ఎస్‌ఎల్ నిపుణుల మధ్య పోస్టుమార్టం చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

విశ్వబ్రాహ్మణులుగానే పరిగణిస్తాం : రాష్ట్ర ప్రభుత్వం

విశ్వబ్రాహ్మణ కులంలోని ఉప కులాలన్నింటినీ ఒకటిగానే పరిగణిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ సర్వేలో వేర్వేరు సబ్ కేటగిరీలుగా ఉన్నా వాటిని ఒకే కులంగా పరిగణిస్తామని చెప్పింది. విశ్వబ్రాహ్మణుల ఉప కులాలను వేర్వేరు కులాలుగా పరిగణిస్తూ సర్వే నిర్వహించడం అన్యాయమంటూ విశ్వబాహ్మిన్ అడ్వకేట్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా ప్రభుత్వం పై విధంగా హామీ ఇవ్వడంతో విచారణను ముగిస్తున్నట్టు న్యాయమూర్తి చెప్పారు.

చితికిన బతుకులు


(ఫైల్)

(మొదటిపేజీ తరువాయి)

దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉలిక్కిపడింది. వ్యాపారులపై నుం చి వెళ్లిన లారీ అంతే వేగంగా చెట్టును ఢీకొట్టడంతో చెట్టు కూలి పోయింది. ఈ ఘటనలో ఆలూరు గ్రామానికి చెందిన నక్కలపల్లి రాములు(45), విద్యార్థి దమరగిద్ద కృష్ణ(25), ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన సుజాత(38) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. వివరాలు తెలియాల్సి ఉంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బీభత్స వాతావరణం నెలకొంది. స్థానికులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, సీఐ భూపాల్, శ్రీధర్, 10 మంది ఎస్‌ఐలు, 10 మంది ఏఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భారీ బందోబస్తు నిర్వహించారు.

పనుల జాప్యంతోనే ప్రమాదాలు

అప్ప నుంచి మన్నెగూడ వరకు ఎన్‌హెచ్-163 హైదరాబాద్-బీజాపూర్ అంతర్ రాష్ట్ర రహదారి 2017లో మంజూరైంది. చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లోని 20 గ్రామాల మీదుగా రోడ్డు వేసేందుకు ప్రణాళికలు వేశారు. రూ.135 కోట్లతో భూ సేకరణ చేపట్టారు. అయితే ఎన్‌జీటీలో కేసులు ఉండటం వలన రోడ్డు పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో ఈ రహదారి ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన పలు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో చనిపోయారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో హైదరాబాద్-చేవెళ్ల వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. వికారాబాద్ సిద్దులూర్ మీదుగా, చిట్టెంపల్లి, అంతరం మీదుగా హైదరాబాద్ రాకపోకలను కొనసాగించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను ముడిమ్యాల్, చేవెళ్ల నుంచి డైవర్షన్ చేశారు. రోడ్డు క్లియర్ చేశాక.. యధావిధిగా వాహనాల రాకపోకలు సాగించాయి.

బాధిత కుటుంబాలకు నేతల పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను, క్షతగ్రాతులను పలువురు నాయకులు పరామర్శించారు. ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేన భీంభరత్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామన్నారు. గాయపడిన వారికి ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. సీఎంతో చర్చించి త్వరలో రోడ్డు పనులను ప్రారంభించేలా చూస్తామన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మృతులంతా రైతులు కావడం బాధాకరం అన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓలతో చర్చించినట్టు తెలిపారు.

అదానీ అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి

- సోలార్ కాంట్రాక్టుల కోసం నేతలకు లంచాలిచ్చారు
- అమెరికాలో అదానీతో పాటు పలువురిపై కేసు
- కార్పొరేట్లకు మేలు చేసేందుకే ఎస్‌ఈసీఐ ఏర్పాటు
- ఫలితంగా వినియోగదారులపై మోయలేని భారం : వెబినార్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదాని సంస్థలపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఏఎస్.శర్మ, ఢిల్లీ జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "విద్యుత్ విధానాలు- అదానీ అవినీతి" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో వారు ముఖ్యవక్తలుగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని మోడీ సర్కార్‌ను అండతో కాంట్రాక్టులు సాధించేందుకు అదాని సంస్థలు అక్రమ మార్గాల్లో నిధులు సేకరించి, దేశంలోని బ్యూరోకాట్లు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లంచాలిస్తున్నారని ఆరోపించారు. అమెరికా గ్రాండ్ జ్యూరి విచారణతో ఈ స్కాం బయట పడిందని గుర్తు చేశారు. అమెరికాలోని సెక్యూరిటీ సంస్థకు తప్పుడు సమాచారం ఇచ్చి అక్రమంగా నిధులు సమీకరించడం, వాటిని కప్పిపుచ్చేందుకు సాక్ష్యాలను తారుమారు చేయడం, న్యాయవ్యవస్థకు ఆటంకం కల్గించడం లాంటి ఐదు రకాల నేరాలకు పాల్పడినట్టు కేసు నమోదైందని పేర్కొన్నారు. అదానీ అవినీతి, అక్రమాలపై అమెరికాలో విచారణ జరుగుతున్నా కేంద్రంలోని మోడీ సర్కార్ చర్యలు తీసుకోకపోగా వారికే మద్దతిస్తోందని ఆరోపించారు. దేశంలోని కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు సోలార్ విద్యుత్ విధానాన్ని మోడీ సర్కార్ తీసుకొచ్చిందని విమర్శించారు. గుజరాత్‌లోని అదాని సౌరవిద్యుత్ గ్రిడ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను నేరుగా అమ్మితే కొనరనీ, 'సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'(ఎస్‌ఈసీఐ)ను కేంద్రం స్థాపించిందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను ఎస్‌ఈసీఐకి సరఫరా చేస్తే, అక్కడి నుంచి దేశంలోని రాష్ట్రాలు తమకు కావాల్సిన విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ ధరలతో పోల్చితే ఈ విద్యుత్ ఖరీదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రాలు ముందుకు రాలేదని అన్నారు. ఈ క్రమంలో అదానీ సంస్థలు బ్యూరోకాట్లు, సీఎంలకు తాయిలాలిచ్చి 25 ఏండ్ల దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నాయని ఆరోపించారు.

వీటికోసం నిధులు సమీకరించే సందర్భంలోనే అమెరికాలో అదానీ సంస్థ దొరికిపోయి గ్రాండ్ జ్యూరీ విచారణ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఇన్ని జరుగుతున్నా దేశంలోని సెబీ, సీబీఐ లాంటి సంస్థలు మౌనంగా ఎందుకున్నాయని ప్రశ్నించారు. అదానీ అవినీతి బాగోతం బయటకు రావాలంటే జ్యూడిషియల్ విచారణతో పాటు ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో కొండూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి బజార్ సిద్ధం

- శిల్పారామంలో 106 షాపుల షాపింగ్ కాంప్లెక్స్
- నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలదే
- ఈనెల ఐదో తేదీన ప్రారంభించనున్న మంత్రి సీతక్క !



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలు ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడేందుకు ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. కానీ, వారు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన వేదికలు లేకపోవడం, బిజినెస్ స్కిల్స్‌పై దృష్టిపెట్టకపోవడంతో పూర్తి స్థాయిలో ఉత్పత్తులు అమ్మలేని పరిస్థితి. మేళాలు, ఎగ్జిబిషన్లు పెట్టినప్పుడు ఏదో పదిరోజులు తమ ఉత్పత్తులను అమ్ముకుని పోవడం, ఆ తర్వాత అలాంటి అవకాశాల కోసం ఎదురుచూడటం పరిపాటిగా మారింది. దీంతో పూర్తిస్థాయిలో వ్యాపారాలపై కేంద్రీకరించని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు, వారికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నియోజకవర్గాలతో పాటు హైదరాబాద్‌లోనూ మహిళా సంఘాలు తమ వ్యాపారాలను విస్తరించేందుకు ప్రత్యేక వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోగల శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తున్నది. ఏదో మొక్కుబడిగా పదిరోజులు పాటు కాకుండా ఏడాది పాటూ మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకునేందుకు శాశ్వతంగా 106 షాపులతో కూడిన కాంప్లెక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్నది. రూ.9 కోట్ల రూపాయలతో మొదలు పెట్టిన పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ నెల ఐదో తేదీన ఇందిరా మహిళా శక్తి బజార్‌ను మంత్రి సీతక్క ప్రారంభించే అవకాశముంది.

హైటెక్ సిటీ సమీపంలో వ్యూహాత్మకంగా ఈ కాంప్లెక్స్ ఏర్పాటు మహిళా సంఘాలకు దోహదపడే అవకాశముంది. గ్రామీణ నేపథ్యంతో కూడిన ఉత్పత్తులు పట్టణ ప్రాంత, విదేశీ వినియోగదారులను ఆకట్టుకునే అవకాశముంది. ఐటీ ఉద్యోగులు పని ముగించుకుని వెళ్లే సమయంలో ప్రారంభమై రాత్రి వరకూ ఈ షాపింగ్ కాంప్లెక్స్ పనిచేయనున్నది. అయితే, శిల్పారామం వేదికలో 106 షాపులను మహిళా సంఘాలకు రొటేషన్ పద్ధతిలో ఉత్పత్తులను అమ్ముకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించనున్నది. మహిళా సంఘాల సభ్యులతోని ఫుడ్ కోర్టులను కూడా నిర్వహించనున్నది. ఎస్‌హెచ్‌జీలు తయారుచేసే చేనేత వస్త్రాలు, హస్తకళలు, సాంప్రదాయ, ఇతర ఉత్పత్తులను అమ్ముకునేందుకు నైట్ బజార్ వేదికగా నిలువనున్నది. మహిళల ఆదాయాలను పెంచడంతో పాటు వారిలో మానసికస్థైర్యాన్ని కల్పించేందుకు ఈ ఇందిరాశక్తి బజార్ దోహదపడే అవకాశముంది. సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల కోసం మహిళలకు ఆర్థికంగా సహాయం చేయడంలో ఐటీ కంపెనీలు, ఇతర వ్యాపార సంస్థల సలహాలు, సూచనలను వాడుకునే అవకాశముంది. సామాజిక, ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో రాష్ట్రంలో వచ్చే ఎనిమిది నెలల్లో 20కిపైగా ఇందిరా మహిళా శక్తి భవన్‌లను నిర్మించే దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది.

మావోయిస్టులపై విషప్రయోగం నిజం కాదు

- డీజీపీ జితేందర్ స్పష్టీకరణ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సీపీఐ మావోయిస్టులు మృతి చెందటం వెనక విషప్రయోగం చేశామన్నది దుష్ప్రచారమేనని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. మొదట మావోయిస్టులపై విష ప్రయోగం చేసి, తర్వాత వారిపై కాల్పులు జరిపి హత్య చేశారంటూ పౌరహక్కుల సంఘం చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రమూ నిజం లేదని ఆయన తెలిపారు. గత నెలలోనే వాజేడు ప్రాంతంలో ఇద్దరు ఆదివాసీలను ఇన్‌ఫార్మర్లంటూ మావోయిస్టులు పొడిచి చంపారనీ, ఆనాటి నుంచి ఈ హత్యలో పాల్గొన్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను మా ప్రత్యేక సాయుధ పోలీసు టీంలు చేపట్టాయని డీజీపీ చెప్పారు. ఈ క్రమంలోనే ములుగు జిల్లాల్లో ఆదివారం ఉదయం మావోయిస్టులు తారసపడగా.. వారిని లొంగిపోవాలని సాయుధ పోలీసులు మొదట హెచ్చరించారనీ, అందుకు విరుద్ధంగా మావోయిస్టులు తమ వద్ద ఉన్న ఆధునిక ఆయుధాలతో పోలీసులపై కాల్పులు ప్రారంభించారని ఆయన అన్నారు. ఆత్మరక్షణలో భాగంగా సాయుధ పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారని తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల పోస్టుమార్టం, దాని వీడియో చిత్రీకరణలు గతంలో కేంద్ర జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి నిర్వహించటం జరిగిందని ఆయన వివరించారు.

రాజీపడం...నిర్లక్ష్యాన్ని సహించం

- పేదలను దోచుకోవద్దు
- ప్రయివేటు ఆస్పత్రులు చట్టాలు పాటించాల్సిందే :

దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు ఆస్పత్రుల్లో చట్టాల అమలుపై రాజీపడేది లేదనీ, నిర్లక్ష్యాన్ని సహించబోమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వారికి సంబంధించి ఉన్న చట్టాలను అమలు చేసి తీరాల్సిందేననీ, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ యాక్ట్‌ను ఆడాప్ట్ చేసుకుంటున్నట్టు తెలిపారు. ఎన్సీడీ క్లినిక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్‌పై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మరో 300 సబ్‌సెంటర్లు, 125 వరకు ప్రాథమిక కేంద్రాలు అవసరమున్నాయని తెలిపారు. ప్రతి నెలా మందుల కోసం రూ.50 కోట్లు విడుదల చేస్తున్నామనీ, సెంట్రల్ మెడిసిన్ సెంటర్లను ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసి, నిర్వహణకు రూ.4 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. మందులు, ఆహార నాణ్యత విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందనీ, టెస్టింగ్ కెపాసిటీని పెంచుతున్నట్టు చెప్పారు. ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరిగినందున రాష్ట్రంలో మరో 7 వేల బెడ్లు అవసరమున్నాయన్నారు. హైదరాబాద్ నాలుగు వైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు మరో ఏడాదిన్నరలోపు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. గచ్చిబౌలి టిమ్స్ కరోనా కాలం కోసం ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. జర్నలిస్టులు, ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య బీమా విషయానికి సంబంధించి నాలుగైదు అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

తెలంగాణను ఆయిల్ పామ్ సాగు హబ్‌గా మార్చడమే నా జీవిత లక్ష్యం

రైతులకు లాభాలు తెచ్చిపెట్టే పంట ఆయిల్‌పామ్ • విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణను ఆయిల్‌పామ్ సాగు హబ్‌గా మార్చడమే తన జీవిత లక్ష్యం అని, తద్వారా పామాయిల్ సాగుతో రైతులు పేదరికం నుంచి రాజులుగా మారాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో నూతనంగా నిర్మించబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా ఆయిల్ పామ్ సాగును చేయించే విధంగా చూడాలన్నారు. ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచడం వల్ల దేశీయంగా ఆయిల్ పామ్ రైతాంగంకు లాభాలు వస్తున్నాయని, ఏడాదికి లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. తన చిరకాల కోరిక సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడమన్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్ట్‌తో సాగు నీళ్ళు అందిస్తామని చెప్పారు. రఘునాథపాలెం మండలంలో రూ.66 కోట్లతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంక్రాంతి నాటికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇప్పటికే జాతీయ రహదారులు ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి బాట పట్టిందన్నారు. ఉద్యాన పంటల సాగుతో రైతాంగానికి మేలు జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఏడో తేదీన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. విద్యా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన స్వామి నారాయణ ట్రస్ట్, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటుకు క్యాబినెట్ అనుమతి తెలిపిందని అన్నారు. ఖమ్మం ఎమ్మెల్యేగా క్యాబినెట్‌లో ఉండే అవకాశం ఖమ్మం ప్రజానీకం ఆశీర్వాదంతో తనకు దక్కిందన్నారు. అరాచకం, అక్రమాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోరినట్టు ఖమ్మం ప్రగతి బాటలు వేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జడ్పీ సీఈవో దీక్ష రైనా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మానుకొండ రాధా కిషోర్, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఏడాది పాలన..విజయాలు

నివేదిక విడుదల


(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు తొలి ఏడాది పాలనలో సాధించిన విజయాలను సర్కారు నివేదిక రూపంలో విడుదల చేసింది. ఆయా పథకాలు, ప్రాజెక్టులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను ఇందులో పొందుపర్చింది. స్వతంత్ర భారతదేశంలోనే భారీగా వ్యవసాయ రుణమాఫీ కార్యక్రమాన్ని రేవంత్ సర్కారు అమలు చేసింది. దేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వలేనన్ని అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్టు నివేదికలో పేర్కొంది.

సన్నాలకు బోనస్, చెరువుల పునరుద్ధరణ

రైతులు పండించిన సన్నాలకు అత్యధికంగా రూ. 500 బోనస్ ప్రకటించింది. 1947 నుంచి ఏ రాష్ట్రానికి సాధ్యం కాని విధంగా అధికంగా వరిని పండించింది. చెరువుల పునరుద్ధరణతో ఆయకట్టు పెరిగేందుకు దోహదపడింది. 40 సంవత్సరాల తరువాత ఆక్రమణలు పూర్తిగా తొలగించినట్టు నివేదికలో పేర్కొన్నది. 50 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన మూసీ నది పునరుద్ధరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

హైదరాబాద్ - వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేలా 50 ఏండ్ల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతుల రూపకల్పన చేసిన దేశంలోని తొలి నగరంగా పేరుగాంచింది. దేశంలో మొదటి పరిశ్రమ ఆధారిత నైపుణ్య విశ్వవిద్యాలయ నిర్మాణాన్ని చేపట్టింది. దక్షిణ భారతంలో అతిపెద్ద క్రీడల విశ్వవిద్యాలయ నిర్మాణానికి పూనుకుంది.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నది. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సైతం పేదలకు అందజేస్తోంది. తద్వారా నెలకు దాదాపు రూ.10,000 ఆదా కావడానికి చర్యలు తీసుకుంది. రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా అమలు చేస్తున్నది.

హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించి 3,000 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టేందుకు పరిపాలనాపరమైన చర్యలకు పూనుకుంది. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు 200 ఎకరాలలో గాంధీ స్మారక నిర్మాణం చేయనుంది. హైదరాబాద్ ప్రజల అవసరాల కోసం గోదావరి జలాలను తాగునీటి సరఫరాకు ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకుంది.

సమగ్ర కుల జనగణన ద్వారా విధానాలు, కేటాయింపులపై సమీక్ష చేయ నుంది. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రపంచ స్థాయి రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించేందుకు క్యాబినెట్ తీర్మానించింది. అవినీతితో కూడిన ధరణి పోర్టల్‌ను పూర్తిగా జాతీయ సంస్థ ఎన్‌ఐసీకి అప్పగించింది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను కలుసుకునే అవకాశం కల్పించింది. అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది.

మీడియా స్వేచ్ఛ పునరుద్ధరణ ద్వారా విమర్శలను అణచివేసే ప్రయత్నాలు నిలిపి వేసినట్టు నివేదికలో పేర్కొన్నది. భవిష్యత్ తరాలకు హానికరం కాకుండా మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు సీఎం కంకణం కట్టుకున్నారు. ఈ విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేకంగా బాలల దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని పెట్టుబడులధామంగా నిలిపేందుకు రేవంత్ సర్కారు చర్యలు తీసుకుంటు న్నది. తొలి సంవత్సరంలోనే గరిష్ట పెట్టుబడులను ఆకర్షించింది. విదేశీ, దేశీయ, ప్రజా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది. ప్రాంతీయ రింగ్‌రోడ్, రింగ్ రైలు ప్రాజెక్టుల ప్రారంభానికి చర్యలు చేపట్టింది. మెట్రోరైలు విస్తరించాలని నిర్ణయించింది. టయర్-2 పట్టణాల్లో పారిశ్రామికాభివద్ధి జరిగేలా ప్రణాళికలు తయారు చేస్తున్నది. రెండో రాజధానిగా వరంగల్‌ను రూపుదిద్దాలని భావిస్తున్నది. అక్కడ భారీగా అభివద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఇండ్లను నాలుగు లక్షల మంది పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తికి రూ.10 లక్షల విలువైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ప్రజావాణిలో ఐదు లక్షల ప్రజా సమస్యలను పరిష్కరించింది. ప్రతినెలా మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లను చెల్లిస్తున్నది.

తెలంగాణకు ప్రత్యేక గీతం

తెలంగాణ రాష్ట్ర స్ఫూర్తిని, గొప్పతనాన్ని, ప్రజల ఐక్యతను పునరుద్ఘాటించేలా కొత్త తెలంగాణ గీతాన్ని రూపొందించారు. ఈ గీతం ద్వారా రాష్ట్ర స్వాభిమానాన్ని ప్రోత్సహించ డమే లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.తెలంగాణ రాష్ట్ర శోభకి, గౌరవానికి ప్రతీకగా 'టీజీ' అనే సంక్షిప్త రూపాన్ని చిహ్నంగా ఎంపిక చేసింది. ఇది రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ప్రత్యేకతను ప్రతిబింబిస్తుంది. ప్రతి రోజూ 18 గంటలు పని చేసే ముఖ్యమంత్రి, ప్రజల సమస్యలను వినేందుకు శ్రద్ధ, పరిపాలనలో మెరుగుదల కోసం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. నిజమైన భవిష్యత్ రాష్ట్రం దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళుతున్నారు.

ఫోర్త్ సిటీ

భవిష్యత్ అవసరాల మేరకు హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం రూపొందించే పనిలో ఉంది. భారత్‌లోనే అత్యాధునిక నగరంగా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తో పాటు నాలుగో నగరాన్ని(ఫోర్త్ సిటీ) నిర్మించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నది. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా విద్యాకమిషన్‌ను నియమించింది. రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల కోసం ఆహార, కాస్మోటిక్ చార్జీలు 10 ఏండ్ల తర్వాత పెంచింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు, పారిశ్రామికవేత్తలకు రుణాలు - లక్ష మంది మహిళా కోటీశ్వరులను తయారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

సచివాలయంలో ప్రత్యేక విగ్రహం ఏర్పాటు

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ విగ్రహ ఆవిష్కరణ జరగనుంది. రాష్ట్ర గౌరవం, సంస్కృతి , సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని తయారు చేయించారు.

ఆశాలకు లెప్రసీ, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులివ్వాలి
ఆ తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలి

- నేడు పీహెచ్‌సీలు, రేపు కలెక్టరేట్ల ముందు ఆందోళనలు : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి
- వైద్యారోగ్య శాఖ కమిషనరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశాలకు లెప్రసీ సర్వే, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలనీ, ఆ తర్వాతనే వారితో కొత్త సర్వేలు చేయించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీల ఎదుట ధర్నాలు చేయాలనీ, బుధవారం కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు చేయాలని ఆశావర్కర్లకు పిలుపునిచ్చారు. పెండింగ్ డబ్బులను ఇచ్చేదాకా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కోఠిలో గల వైద్యారోగ్య శాఖ కమిషనరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. తమకు పెండింగ్ పారితోషికాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశాలు 2023, 2024లో లెప్రసీ సర్వే 2024లో పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారనీ, వాటికి సంబంధించి ఇప్పటివరకూ డబ్బులు ఇవ్వలేదని వాపోయారు. రాష్ట్ర కేంద్రంలోని అధికారులేమో సర్వేల డబ్బులు విడుదల చేశామని చెబుతున్నారనీ, ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చినంత మాత్రాన డబ్బులు చెల్లించినట్టు కాదనీ, ఇంకా రాలేదని జిల్లా అధికారులు చెబుతున్నారని చెప్పారు. అంతిమంగా రాష్ట్ర, జిల్లా అధికారుల మధ్య ఆశాలు నలిగిపోతున్నారని వాపోయారు. పాత సర్వేలు, పల్స్‌పోలియో డబ్బులే ఇవ్వలేదుగానీ కొత్తగా మళ్లీ లెప్రసీ సర్వే చేయాలని ఆశాలపై ఒత్తిడి చేయడమేంటి? వారికి ట్రెనింగ్ ఇవ్వడమేంటి? అని ప్రశ్నించారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్, తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.యాదమ్మ, రాష్ట్ర నాయకులు మీనా, హైదరాబాద్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.అనిత, సంయుక్త కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దత్ ఆశయాల సాధనే నిజమైన నివాళి

- ప్రథమ వర్ధంతి సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) వ్యవస్థాపక సలహాదారు ఎంఎకె దత్ ఆశయాలను సాధించడం, వాటిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని టీపీఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో టీపీఎస్వీ ఆధ్వర్యంలో దత్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. దత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ నాయకులుగా, పౌర స్పందన వేదిక సలహాదారుగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా దత్, ఆయన కుటుంబంతో ప్రత్యేక అనుబంధముందని చెప్పారు. ఇద్దరి అభిప్రాయాల్లో సారూప్యత ఉండటమే దీనికి కారణమన్నారు. మంచి మిత్రున్ని, మార్గదర్శిని కోల్పోయామని అన్నారు. టీపీఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం మాట్లాడుతూ సంఘపరంగా, వ్యక్తిగతంగా తనకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన దత్ మరణం అన్ని విధాలుగా తీరనిలోటన్నారు. పౌర స్పందన వేదిక ఆశయం కోసం ఏర్పడిందో వాటి కోసం కృషి చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. దత్ సన్నిహిత మిత్రులు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆయనతో ఉన్న అనుబంధం సుదీర్ఘమైందని చెప్పారు. యూటీఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించామనీ, అనేక విషయాలను పరస్పరం చర్చించుకునేవారమనీ, తమ మధ్య సాన్నిహిత్యం మరింత కొనసాగిందని వివరించారు. ఆయన మరణంతో మంచి మిత్రున్ని కోల్పోయానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కె లక్ష్మణరావు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎ సమద్, కోశాధికారి ఎస్వి రామకృష్ణ, సభ్యులు జి రాములు, జలిన్, పాపారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి సురేష్‌కుమార్, కోశాధికారి ఆర్ సుధాకర్, యూటీఎఫ్ నాయకులు కొండల్‌రావు, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

10న వికలాంగుల చలో హైదరాబాద్

- ప్రభుత్వ వాగ్దానాలు అమలు చేయాలి
- ఎన్‌పీఆర్‌డీ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలనీ, ప్రభుత్వం వారికిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 10న వికలాంగుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు వికలాంగుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఆర్ వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శశికళ, చంద్రమోహన్, జగదీశ్, నాయకులు శివతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ పింఛన్‌ను రూ.ఆరువేలకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి ఏడాది పూర్తవుతున్నా వికలాంగులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సకలాంగులకిచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం వికలాంగులకిచ్చిన హామీలను అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. పెన్షన్ కోసం 44.44 లక్షల మంది ఆసరా లబ్దిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, వికలాంగుల చట్టాల అమలు వంటి వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 10న జరిగే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష తేదీ ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. 2025 మే 18 రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. మే 18 ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. ఐఐటీల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థులు రెండు పరీక్షలు తప్పనిసరిగా రాయాల్సిందే. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) మోడ్‌లో పరీక్ష జరుగుతుంది. ఒక అభ్యర్థి రెండేండ్లలో గరిష్టంగా రెండు సార్లు ఈ పరీక్షకు హాజరు కావచ్చు.జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 2000 అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఐదేండ్ల వరకూ సడలింపు ఉంటుంది. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 1995 అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలి.

జేఈఈ మెయిన్ 2025 పరీక్షల్లో ఉత్తీర్ణులైన (అన్ని క్యాటగిరీల విద్యార్థుల్లో) 2.50 లక్షల మంది మాత్రమే జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హులు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా 2024,2025 విద్యా సంవత్సరాల్లో 12వ తరగతి తత్సమాన పరీక్ష తొలిసారి పాస్ అయి ఉండాలి.

జేఈఈ అడ్వాన్స్డ్ రిజిస్ట్రేషన్ ఫీజు

జేఈఈ అడ్వాన్సడ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు క్యాటగిరీల వారీగా వేర్వేరుగా ఉంటుంది. అన్ని క్యాటగిరీల్లో బాలికలతోపాటు ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.1,450, ఇతర అభ్యర్థులు రూ.2,900 చెల్లించాలి. సార్క్ దేశాల్లో నివసిస్తున్న పీఐఓ / ఓసీఐలతోపాటు విదేశీ విద్యార్థులు 90 డాలర్లు, సార్క్‌యేతర దేశాల్లో నివసిస్తున్న విద్యార్థులు 180 డాలర్లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.

కొడంగల్ కోర్టులో లొంగిపోయిన మరో నలుగురు నిందితులు

- 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- పోలీస్ కస్టడీకి భోగమోని సురేశ్

నవతెలంగాణ-కొడంగల్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర ఉన్నత అధికారులపై దాడి కేసులో మరో నలుగురు నిందితులు కొడంగల్ కోర్టు ఎదుట లొంగిపోయారు. ఈ దాడి ఘటనలో నిందితులుగా ఉన్న శివకుమార్, హనుమంతు, రామచందర్, లోక్యనాయక్ సోమవారం లొంగిపోగా.. వీరికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

లగచర్లలో ఘటనలో ప్రధాన నిందితుడు సంగారెడ్డి జిల్లా కంది జైల్‌లో ఉన్న భోగమొని సురేష్‌ను పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. సురేష్‌ను రెండు రోజులపాటు విచారణకు అనుమతిస్తూ కొడంగల్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నవంబరు 19వ తేదీన కొడంగల్ కోర్టులో లొంగిపోయిన ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. ప్రస్తుతం ఆయన సంగారెడ్డి జిల్లా కంది జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ క్రమంలో పోలీసులు కస్టడీకి కోరుతూ పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు సురేష్‌ను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది.

ఉద్యమాల కాలం

తదనుగుణంగా రేవంత్ సర్కార్ నిర్ణయాలు



(ఫైల్)

నవతెలంగాణ -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారు. కనీసం తమ సమస్యల్ని సర్కారుకు చెప్పుకొనేందుకూ నానా అవస్థలు పడ్డారు. ఆనాటి ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ ఆర్టీసీ కార్మికులు చేసిన 55 రోజుల సమ్మె, దానిపై ప్రభుత్వం విధించిన నిర్బంధం కార్మిక, ఉద్యోగ, ప్రజా ఉద్యమాల తీరును సమీక్షించుకొనేలా చేసింది. ముఖ్యంగా ప్రజల పక్షాన పోరాడే వామపక్షపార్టీల కార్యకర్తలపై లెక్కకు మించి పోలీసు కేసులు పెట్టి నిర్బంధాన్ని కొనసాగించారు. ఆ వ్యతిరేకతే బీఆర్‌ఎస్‌ను ప్రతిపక్షానికి పరిమితం చేసింది. అనేక ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పట్లో మల్లన్నసాగర్‌పై ప్రజా ఉద్యమం, నిర్బంధం ఎలాగైతే కొనసాగిందో...అదే పద్ధతిలో లగచర్లలోనూ ప్రస్తుత ప్రభుత్వం నిర్బంధాన్ని విధించింది. దీంతో ప్రజల్లో నిరసన పెల్లుబికింది. ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. చివరకు సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకొని సర్కారుకు అల్టిమేటం జారీ చేసి, ఘటనా స్థలికి వెళ్లి, వాస్తవ పరిస్థితుల్ని నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. సమస్యతో పాటు ప్రత్యామ్నాయాలనూ సూచించింది. దానితో రేవంత్‌సర్కారు వెనక్కి తగ్గక తప్పలేదు. లగచర్ల భూసేకరణను నిలిపివేస్తున్నట్టు స్వయంగా ప్రకటించింది. మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో హైడ్రాను ఏర్పాటు చేసి హడావిడి చేస్తే, అప్పుడూ వామపక్షనేతలే బాధితుల పక్షాన నిలిచి, సర్కారుకు నేరుగా వాస్తవాలను వివరించే ప్రయత్నాలు చేశారు. చివరకు న్యాయస్థానాల జోక్యంతో హైడ్రా వెనకడుగువేయక తప్పలేదు. ఆదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును అక్కడి స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. పంటలు పండే తమ భూములు కాలుష్య కూపాలుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. పదోతరగతి విద్యార్థులకు ఇప్పటి వరకు 80 మార్కులకే పరీక్షలు నిర్వహించేవారు. 20 మార్కుల్ని విద్యార్థుల అంతర్గత సామర్థ్యం ఆధారంగా హైస్కూల్ యాజమాన్యాలు వేసేవి. ఈ విధానాన్ని మార్చేసి, వంద మార్కులకే పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపైనా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఫలితంగా ఇప్పుడున్న పద్ధతినే యథావిధిగా అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం

- ప్రజాభిప్రాయాలకు తలొగ్గుతున్న పాలకులు
- వ్యక్తిగత సమస్యల పరిష్కారాలకు తొలి ప్రాధాన్యత
- దానిలో భాగంగానే ముఖాముఖి, ప్రజావాణి



అదే సందర్భంలో అనేక సమస్యలపై ప్రతిపక్షపార్టీలు చేస్తున్న ప్రత్యక్ష ఆందోళనలపై సర్కారు ఉక్కుపాదం మోపుతూనే ఉంది. ఉద్యమాల తీవ్రత, ప్రజా వ్యతిరేకతను బట్టి తన నిర్ణయాలను తానే పునస్సమీక్షించుకుంటూ పరిపాలన సాగిస్తున్నది. ప్రజాభిప్రాయాలను పాలకులు గౌరవిస్తున్నట్టు కనిపిస్తున్నా, అనేక వర్గాల ప్రజల్లో ఇంకా ఆశలు, ఆకాంక్షలు, నిరసనలు, నిష్ఠూరాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం బూర్జువాపార్టీలు దీన్ని అందిపుచ్చుకోవాలని పడుతున్న తపన క్షేత్రస్థాయిలో కనిపిస్తూనే ఉంది. మావల్లే సమస్య పరిష్కారం అయ్యిందంటే...కాదు మావల్లే అని క్రెడిట్ కోసం వెంపర్లాడుతున్నారు. కానీ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి, పేదలకు అండగా ఉండే వామపక్షాలు మాత్రం అవన్నీ ప్రజా విజయాలే అని ప్రకటిస్తూ, హుందాగా వ్యవహరిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కాంగ్రెస్ పార్టీపరంగా గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి పేరుతో అర్జీలను స్వీకరిస్తుంది. ప్రభుత్వపరంగా ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ వేదికలు ప్రజలకు తమ సమస్యల్ని చెప్పుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నాయి తప్ప సమస్యల్లో ఎన్ని పరిష్కారమవుతున్నాయనే గ్యారెంటీ ప్రశ్నార్థకమే. దీనిపై ప్రభుత్వమే శ్వేతపత్రం విడుదల చేయాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రాజకీయాలకు అతీతంగా, ప్రజాసమస్యలే ప్రధాన అజెండాగా ఉండి, చర్చలు జరగాలనేది అన్ని వర్గాల ప్రజల ఆకాంక్ష!! ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కదిలినపుడే ప్రజల విశ్వాసం పొందుతారు.

అన్నదాత ఆగ్రహం

గ్రేటర్ నోయిడాలో మళ్లీ మొదలైన రైతుల ఆందోళన

- ఢిల్లీ మార్చ్ ప్రారంభం
- బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు
- దిగొచ్చిన యూపీ ప్రభుత్వం
- రైతులతో చర్చలకు సీఎస్ హామీ
- లిఖితపూర్వక హామీ ఇస్తేనే సమ్మె విరమణ : ఎస్కేఎం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో భారీ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన వారికి పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల ఆందోళన మళ్లీ మొదలైంది. ఏఐకేఎస్‌తో సహా పది రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో రైతులు తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను యూపీ-ఢిల్లీ సరిహద్దులో పోలీసులు అడ్డుకున్నారు. వారు పార్లమెంటు మార్చ్‌ను ప్రకటించారు. ప్రభుత్వం తమ దగ్గరకు వచ్చి చర్చించాలని, లేకపోతే వెనక్కి తగ్గేది లేదని ఎస్కేఎం నేతలు స్పష్టం చేశారు. దీంతో ఆదిత్యనాథ్ ప్రభుత్వం చర్చకు హామీ ఇచ్చింది. త్వరలో నేరుగా వచ్చి చర్చలు జరుపుతామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అన్ని డిమాండ్లను ఆమోదించి లిఖితపూర్వక హామీ ఇస్తే తప్ప సమ్మె విరమించేది లేదని ఎస్కేఎం ప్రకటించింది. ఈ ఆందోళనలో యమునా ఎక్స్‌ప్రెస్‌వే అథారిటీ, యూపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ, పెద్ద ప్రాజెక్టుల కోసం భూమిని ఇచ్చిన రైతులు పాల్గొన్నారు.

తమ సమస్యలు పరిష్కరించాలని 14 ఏండ్లుగా నిరంతరం ఆందోళన చేస్తున్నా యూపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శించారు. అభివృద్ధి చేసిన భూమిలో 10 శాతం, తగిన పరిహారం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ నోయిడాలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనను ముగించి సోమవారం ఢిల్లీ మార్చ్‌కు సిద్ధమయ్యారు. ఈ మార్చ్‌ను ఆపడానికి యూపీ పోలీసులు చేసిన ప్రయత్నాలను మహిళలతో సహా రైతులు ప్రతిఘటించారు. పోలీసు వలయాలు, బారికేడ్లు, ముళ్ల కంచెలు, ఇసుకతో నింపిన కంటైనర్లను నెట్టుకుంటూ రాష్ట్ర సరిహద్దుకు చేరుకున్నారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయగా సరిహద్దు వద్ద జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. గౌతమ్ బుద్ధనగర్ వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వస్తారన్న ప్రభుత్వ సందేశాన్ని ఎస్కేఎం నాయకత్వానికి అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, అదనపు పోలీసు కమిషనర్ తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వచ్చే వరకు రహదారి దిగ్బంధనాన్ని విరమిస్తున్నట్టు నేతలు ప్రకటించారు.

గ్రేటర్ నోయిడా భూసేకరణ బాధితులకు ఏఐకేఎస్ అభినందనలు

గ్రేటర్ నోయిడా, నోయిడా, యమునా ఎక్స్‌ప్రెస్‌వే, యూపీఎస్ఐడీసీ, ఇతర ప్రాజెక్టుల నుంచి భూసేకరణ బాధిత రైతులు ప్రారంభించిన మిలిటెంట్ పోరాటాన్ని ఏఐకేఎస్ స్వాగతించింది. రైతులకు అభినందనలు తెలిపింది. ఈమేరకు ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు. ఐదు రోజుల పాటు సంబంధిత ప్రాంతంలో ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పార్లమెంట్‌కు తమ నిరసనను తెలిపేందుకు సోమవారం ఢిల్లీ కూచ్ (మార్చ్ టు ఢిల్లీ) నిర్వహించారు. మహామాయ ఫ్లైఓవర్ నుంచి వీరి మార్చ్ ప్రారంభం కాగా మూడు గంటల పాటు పోలీసులతో రైతులు పోరాడారని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లే మార్గంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, ముళ్ల వైర్లు, ట్రక్కులు, షిప్పింగ్ కంటైనర్లు మొదలైన బహుళ అడ్డంకులను తొలగించుకుని ముందుకు సాగారని తెలిపారు. ఢిల్లీ-నోయిడా సరిహద్దులో శాశ్వత ఫ్రంట్ ఏర్పాటు చేయాలని రైతులు నిర్ణయించారు. వేలాది మంది రైతులు ఎక్స్‌ప్రెస్‌వేను అడ్డుకోవడాన్ని చూసి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం దిగొచ్చిందని తెలిపారు.

డిసెంబర్ 5 నుంచి పేపర్ ఎక్స్‌సౌత్ ఇండియా ఎక్స్‌పో

paperex SOUTH INDIA

హైదరాబాద్ : దక్షిణాది ప్రాధాన్యంగా డిసెంబర్ 5 నుంచి 7వరకు చెన్నయ్‌లో 7వ పేపర్ ఎక్స్ సౌత్ ఇండియా సదస్సు, ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోనే పల్ప్, పేపర్ ఇతర అనుబంధ సంస్థలకు సంబంధించిన అతి పెద్ద ట్రేడ్ షో జరుగనుందని హైవె ఇండియా పోర్టుపోలియో డైరెక్టర్ గగన్ సాహ్ని తెలిపారు. రానున్న పదేండ్లలో భారతీయ పేపర్ పరిశ్రమకు చెందిన మిషనరీ, నిపుణులైన మానవ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, అవసరాలు తీర్చడానికి ఈ రంగంలో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రావొచ్చన్నారు. దీన్ని ఇండియన్ ఆగ్రో అండ్ రీసైకిల్డ్ పేపర్ మిల్స్ అసోసియేషన్‌లతో కలిసి హైవ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. దీనికి విదేశాల నుంచి 8000 మంది పైగా వాణిజ్య ప్రతినిధులు రానున్నారని తెలిపారు.

ఖమ్మంలో సీపీఐ వందేండ్ల ముగింపు ఉత్సవాలు

- వచ్చే ఏడాది డిసెంబర్ 26న భారీ ర్యాలీ
- పబ్లిక్ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయం : సీపీఐ నేషనల్ జనరల్ సెక్రెటరీ డి రాజా



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ వందేండ్ల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ ర్యాలీ, పబ్లిక్ మీటింగ్ నిర్వహించనుంది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మీడియాతో మాట్లా డారు. గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన పార్టీ నేషనల్ కౌన్సిల్ మీటింగ్ లో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. ఇందులో భాగంగా పార్టీ వందేండ్ల సెలబ్రేషన్స్‌కు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ విజయోత్స వాలను యూపీలోని కాన్పూర్‌లో ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే తర్వాతి పార్టీ కాంగ్రెస్ మీటింగ్‌ను చండీఘర్‌లో వచ్చే ఏడాది సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అలాగే డిసెంబర్ 10న వరల్డ్ హ్యూమన్ రైట్స్ డేను పురస్కరించుకుని అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంట్ జాయింట్ కమిటీ(జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. మణిపూర్ అల్లర్లపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి, వెంటనే అక్కడ మోహరించిన బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లర్లకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం రాజీనామా చేయాలన్నారు. ఢిల్లీ లో కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాల న్నారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది మీ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)



విమర్శించారు. చిరుద్యోగులతో నింపి ఆఫీసర్ల నియామకం చేపట్టేంత తెలివితక్కువ నిర్ణయాలు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి దేశ చరిత్రలోనే ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిన చరిత్ర తమ ప్రభుత్వానిదని తెలిపారు. మండలానికి 30 పడకల ఆస్పత్రి, నియోజకవర్గానికి వంద పడకల ఆస్పత్రి అంటూ హామీలే తప్ప బీఆర్ఎస్ నెరవేర్చలేదని గుర్తుచేశారు. సమాజమే కుటుంబంగా పని చేస్తున్న తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వంగా ప్రజల కోసం పని చేస్తూనే ఉంటామనీ, ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. సంక్రాంతికి రైతుభరోసా ఇచ్చి తీరుతామని ప్రకటించారు. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో భాగమేననీ, వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు 32 క్లినిక్స్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. తన వెంట, ఆర్థికశాఖ వెంటబడి వైద్యారోగ్యశాఖను పనులు చేయించుకుంటూ మెరుగ్గా నిర్వహిస్తున్నారని అభినందించారు.

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల పెంచి ఆ గ్యారంటీని అమలు చేసినట్టు తెలిపారు. 2013లో, తిరిగి 2024లో రెండు సార్లు ఆరోగ్యశ్రీ ప్యాకేజీ రేట్లను కాంగ్రెస్ ప్రభుత్వమే పెంచిందని తెలిపారు. ఇందు కోసం రూ.487.29 కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. 7,774 పోస్టుల భర్తీ, 6,470 పోస్టులకు నోటిఫికేషన్ల విడుదల, ఎనిమిది నెలల్లో ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ప్రారంభించినట్టు తెలిపారు. రూ.2 వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణానికి నిర్ణయం, ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం కొత్త హాస్టల్ భవనాల నిర్మాణం కోసం రూ.204.85 కోట్లను కేటాయించడం, డయాలసిస్ పేషెంట్లకు అవసరమైన సర్జరీలు చేయడానికి, సుమారు రూ.33 కోట్లతో 7 వాస్క్యులర్ సెంటర్ల మంజూరు, కొత్తగా 18 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేసినట్టు తెలిపారు.

కొత్త అంబులెన్సులతో కలుపుకుని రాష్ట్రంలో వాటి సంఖ్య 1,003కు పెరిగిందనీ, అంబులెన్స్ రెస్పాన్స్ టైమ్ 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గుతుందని చెప్పారు. రాబోయే కాలంలో దీన్ని 10 నిమిషాలకు తగ్గించే లక్ష్యంతో ఉన్నట్టు వివరించారు. రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. పేట్లబుర్జు దవాఖానలో 4.15 కోట్లతో ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ట్రాన్స్ జెండర్లకు మెరుగైన వైద్యం అందించేందుకు మైత్రి క్లినిక్స్‌ను పని చేస్తాయని చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రులు నిబంధనల ప్రకారం లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిం చారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. ఆర్థికశాఖ నుంచి ప్రతి నెలా సమయానికి నిధులు విడుదల య్యేలా చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా తెలంగాణ

- బండ తిమ్మాపూర్‌లో హెచ్‌సీసీబీ పెట్టుబడులే అందుకు నిదర్శనం
- వ్యాపార వృద్ధికి పూర్తి సహకారం
- అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హిందూస్తాన్ లీవర్ కోకాకోలా బేవరేజేస్ (హెచ్‌సీసీబీ) కంపెనీ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ములుగు, మర్కుక్

'వ్యాపార వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి మేము కట్టుబడి ఉన్నాం. బండ తిమ్మాపూర్‌లో హెచ్‌సీసీబీ పెట్టుబడులు.. ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా వెలుగొందుతున్న తెలంగాణ ఖ్యాతిని నొక్కి చెబుతుంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన హిందూస్తాన్ లీవర్ కోకాకోలా బేవరేజేస్ (హెచ్‌సీసీబీ) కంపెనీని సోమవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, కలెక్టర్ ఎం.మను చౌదరి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, హెచ్‌సీసీబీ సీఈఓ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్‌తో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో మొత్తం రూ.3,798 కోట్లు (యూఎస్ 455.5 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టడంతో పాటు 1000 మందికి ఉపాధి అవకాశాలను హెచ్‌సీసీబీ కల్పించిందన్నారు. భారతదేశంలోని ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీసీబీకి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఇప్పటికే ఉన్న కర్మాగారానికి అనుబంధంగా తెలంగాణలో హెచ్‌సీసీబీకి ఇది రెండవ ఫ్యాక్టరీ కావడం గమనార్హమన్నారు. బండ తిమ్మాపూర్‌లోని కొత్త ఫ్యాక్టరీ అధునాతన సాంకేతికతలు, పర్యావరణ స్పృహతో రూపొందించబడిందని తెలిపారు. పర్యావరణ అనుకూలమైన శీతలీకరణ వ్యవస్థలు, నీటి పునర్వినియోగ పద్ధతులు, క్లీనర్ ఎనర్జీ సొల్యూషన్‌లతో సహా అదనపు చర్యలు, బాధ్యతా యుతంగా నిర్వహించడంలో హెచ్‌సీసీబీ అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధిని సృష్టించడంతో యువత, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ తెలంగాణలో పర్యావరణ అనుకూల పారిశ్రామిక వృద్ధికి గొప్ప ఉదాహరణ అని అన్నారు. హెచ్‌సీసీబీ సీఈఓ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్ మాట్లాడుతూ.. హెచ్‌సీసీబీ వృద్ధిలో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని, తెలంగాణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని అన్నారు. ఈ అత్యాధునిక ఫ్యాక్టరీ అధునాతన తయారీ, పర్యావరణ అనుకూల సాంకేతికతతో మిళితం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రత్యేకించి సీఎం, పరిశ్రమల శాఖ మంత్రి చొరవ తీసుకుని ట్యాపింగ్ పాయింట్ కనెక్షన్, మిషన్ భగీరథ ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపరితల నీటి పైప్‌లైన్‌ను పూర్తి చేయటం, తమ ఫ్యాక్టరీ కార్యకలాపాలకు విద్యుత్ లభ్యత కోసం త్వరితగతిన అనుమతి ఇచ్చారని తెలిపారు. అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, ఈ నూతన గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీలో తమ ఉత్పత్తిని ప్రారంభించటానికి అవి తోడ్పడ్డాయన్నారు. యువతకు సేల్స్, మార్కెటింగ్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం, డిజిటల్, ఆర్థిక, అక్షరాస్యతా కార్యక్రమాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించటం వంటివి చేయనున్నట్టు తెలిపారు. హెచ్‌సీసీబీ పలు పాఠశాలల్లో వాటర్ ఏటీఎంలు, స్మార్ట్ బోర్డ్‌లను ఏర్పాటు చేయడంతో స్వచ్ఛమైన నీరు, విద్యకు అవకాశాలను మెరుగుపరచనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకీదేవి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, డీపీఆర్ఓ రవికుమార్, టీజీఐఐసీ జోనల్ అధికారి అనురాధ, డిప్యూటీ జోనల్ అధికారి జ్యోతి, ములుగు తహసీల్దార్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి చాటుకునేందుకే బీజేపీ చార్జిషీట్

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తన ఉనికి చాటుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ చార్జిషీట్ పేరిట కొత్త డ్రామాకు తెరతీసిందని ఆ పార్టీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాల్లో ఎన్నింటిని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే ఉచిత బస్సు సౌకర్యం అమలు చేశామనీ, ఇప్పటి వరకు కోటి 10 లక్షల మంది మహిళలు ప్రయాణించారని చెప్పారు. ఏక కాలంలో రూ.20 వేల కోట్ల రుణమాఫీ, రూ.500 లకే వంటగ్యాస్, సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించిన సర్కార్ దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమేనని గుర్తు చేశారు. బీజేపీ పదేండ్ల పాలనలో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి పేదవారి లకౌంట్లల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అలాగే ఏటా రెండు కోట్ల చొప్పున పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఎవరికిచ్చారో చెప్పాలని నిలదీశారు. దేశ ప్రజలకు బీజేపీ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పిన తర్వాతే కాంగ్రెస్‌పై మాట్లాడాలని హితవు పలికారు.

జలమండలిలో ఐదుగురు ఉద్యోగులు పదవీ విరమణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు పదవీ విరమణ పొందారు. వీరిలో టెక్నికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రవి కుమార్‌తో సహా పలు స్థాయిల్లో పనిచేసిన ఉద్యోగులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ టెక్నికల్ సుదర్శన్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నవతెలంగాణ-హాయత్‌నగర్



తాగిన మత్తులో తోటి భవన నిర్మాణ కార్మికుడితో గొడవ పెట్టుకుని, కర్రతో విచక్షణా రహితంగా కొట్టి సదరు వ్యక్తిని చంపిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడింది. పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో తుక్కుగుడాకు చెందిన రెంట హెమ్రోమ్ అతడి స్వస్థలం వెస్ట్ బెంగాల్ అని పోలీసులు తెలిపారు. పూర్వ పరాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కోర్ట్ నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్ష విధించినట్టు సోమవారం పహాడి షరీఫ్ పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్టు తెలిపారు.



పహాడిషరీఫ్‌లో ఆస్పత్రిని నిర్మించాలని వినతి

- బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహడి షరీఫ్‌లో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలంలో ప్రభుత్వ ఆస్పత్రికి అనుమతి ఇప్పించాలని కోరుతు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ్ రెడ్డికి జల్ పల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జల్ పల్లి మున్సిపాలిటిలో అధిక మొత్తంలో పేద బడుగు బలహీన వర్గాల, మైనార్టీ ప్రజలు ఉన్నారని అందుకోసం మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంజూరు చేయించిన 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించటం జరిగిందని ఆ ఆస్పత్రిని పహాడిషరీఫ్‌లో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మాణం చేయుటకు అనుమతి ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశామని తెలిపారు.అనంతరం స్పందించిన కలెక్టర్ వక్ఫ్ అధికారులతో మాట్లాడి ఆస్పత్రి కోసం స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ బదర్, బర్కత్ అలీ, ఆరిఫ్, అజీమ్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.



కాలనీకి కృష్ణ వాటర్ పునరుద్ధరించాలి

- డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి

నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనప్రియ మహానగర్ కాలనీకి కృష్ణ వాటర్ మంచినీటిని పునరుద్ధరించాలని డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి అన్నారు. గత కొన్ని రోజులుగా జనప్రియ మహానగర్ కాలనీకి కృష్ణ మంచి నీటిని బందు చేయటం గురించి కాలనివాసులతో మాజీ ఎంపీటీసీ లలిత జగన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా జనప్రియ మహానగర్‌లో కృష్ణ మంచినీరు సరిగా కాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటర్ బిల్లులు కట్టలేదు అన్న కారణంతో ప్రజలకు మంచినీరు బందు చేయడం దారుణం అన్నారు. గత 15 రోజుల నుంచి ప్రజలు మంచినీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధం లేకుండా మంచినీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం అయ్యేందుకు పూజ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనప్రీయ మహా నగర్ అన్ని బ్లాక్స్ కమిటీ అధ్యక్షులు, సీనియర్ సిటిజన్స్, మహిళలు పాల్గొన్నారు.



పార్కు స్థలాలను కాపాడాలి

- రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ ఎంసీఆర్ కాలనీలోని సర్వే నంబర్ 139లో సుమారు 2000 గజాలకు పైగా పార్కు స్థలాలను కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి సోమవారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అదే విధంగా కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రహదారి కూడలి వద్ద ప్లాట్ నెంబర్ 73,74 తూర్పు దశలో షాడో కార్పొరేటర్ కబ్జా చేసిన నాలుగు షెటర్లను వ్యాపార సముదాయం కొరకు నిర్మించారని, ఆ స్థలాన్ని కూడా కార్పొరేషన్ అధికారులు ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక ప్రభుత్వ పార్కు స్థలాలను కొందరు నాయకులు అక్రమంగా ఆక్రమించుకొని కోట్లాది రూపాయలు గడిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సతీష్ నంద, ప్రవీణ్ కుమార్ గౌడ్, పవన్ కుమార్, మల్లెల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



అక్షర జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్ రోడ్ సమీపంలో ఉన్న అక్షర జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను సోమవారం ఈదులకంటి రామ్ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్, ప్రిన్సిపాల్ సి.లవ కుమార్ రావు మాట్లాడుతూ.. కొత్త విద్యార్థులు పాత విద్యార్థులతో కలిసి పోవడానికి ఈ ఫ్రెషర్స్ డే వేడుకలు దోహద పడతాయన్నారు. తమ కళాశాల విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ఆయా రంగాలలో ప్రోత్సహించేలా యాజమాన్యం చొరవ చూపుతుందన్నారు. అక్షర జూనియర్ కాలేజ్‌లో విద్యా బోధనతో పాటు సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించే విధంగా సాంస్కృతిక ఏర్పాట్లు చేస్తున్నామని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ఎస్.నరేష్ రెడ్డి, కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ బి.నర్సింహ, డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీశైలంతో పాటు అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిక యాదయ్య సేవలు అభినందనీయం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఎస్సీ వసతి గృహల్లో చదువుతున్న పేద పిల్లల ఉన్నతికి మెరుగైన సేవలదించిన జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పెరిక యాదయ్య సేవలు స్ఫూర్తిదయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టర్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన పెరిక యాదయ్య పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యాదయ్య తన 34 ఏండ్ల సర్వీస్‌లో ఎస్సీ సంక్షేమ శాఖలో ఎన్నో హోదాలలో మారుమూల జిల్లాలలోని పేద పిల్లల ఉన్నతికీ స్ఫూర్తిదాయకమైన సేవలదించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అనుబంధ శాఖల అధికారులు మెరుగైన సేవలాందించాలని సూచించారు. జిల్లాలో బదిలీలు, పదోన్నతులు, పదవి విరమణ జరిగే ప్రతి ఒక్కరికి సత్ సాంప్రదాయంతో సన్మానించుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖాల అధికారులు పూల బొకేలు, శాలువాలతో, మెమంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పి, ముకుంద రెడ్డి, ఈ.వెంకట చారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఐ(ఎం) సరూర్ నగర్ సర్కిల్ మహాసభ

- నూతన కార్యదర్శిగా సీహెచ్ వెంకన్న

నవతెలంగాణ-ఎల్బీనగర్



రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ సర్కిల్ సీపీఐ(ఎం) మహాసభ దిల్‌సుఖ్ నగర్ బోడెపూడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రంలో గంధం మనోహర్, మల్లెపాక వీరయ్య, అధ్యక్షతన మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్, కవితా హాజరై మూడు సంవత్సరాల ఉద్యమ చరిత్రను సమీక్షించుకొని సభను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై జరిగే ప్రజా ఉద్యమాలను, ఒక ప్రణాళికను రూపొందించుకున్నారు. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుందని సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలు పొందుతున్న ప్రాథమిక హక్కులు లేకుండా కుట్రపూరితంగా రాజ్యాంగాన్ని మార్చు, మనుధర్మ శాస్త్రాన్ని స్థాపించాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇది శ్రామిక ప్రజలకు తీరని నష్టాన్ని చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి మతం వారికి పవిత్రంగా భావిస్తారు. రాజ్యాంగంలో లౌకికవాదం, సామాజిక న్యాయం, సమైక్యవాదం సోషలిజం, అనే ఐదు మౌలికమైన హక్కుల్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగం ద్వారానే ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు కల్పించబడ్డాయని గుర్తు చేశారు. సామాన్య ప్రజల సంక్షేమం వారి శ్రేయస్సు కొరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోవుటకు నూతనంగా తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సర్కిల్ కార్యదర్శిగా సీహెచ్ వెంకన్నను కార్యదర్శి వర్గ సభ్యులుగా గంధం మనోహర్, మల్లెపాక వీరయ్య, కట్టా శ్రీనివాస్, ఎం.గోపి నాయక్, కడారి రాములు, కృష్ణ, చైతన్య, పరుశరాములును ఎన్నుకోవడం జరిగింది.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



- సీపీఐ నాయకులు

నవతెలంగాణ-ఎల్బీనగర్

అక్రమంగా నిర్మిస్తున్న వ్యాపార భవనాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎల్బీనగర్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో అక్రమ వ్యాపార సముదాయలను తొలగించాలని వారిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు వినతిపత్రంను సీపీఐ నాయకులు ఇచ్చారు. ధర్నా కార్యక్రమం నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి విచ్చేసి మహాధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. జీహెచ్ఎంసీలో టౌన్ ప్లానింగ్ డీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు డివిజన్‌లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు అన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్ డీసీ, ఏసీపీకి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. శివగంగ కాలనీలో సర్వే నెంబర్ 66/8లో అక్రమంగా నిర్మాణం జరుగుతున్న దానిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బొమ్మల గుడి నుంచి వీరన్న గుట్ట పోయే దారిలో అనేక అక్రమ వ్యాపార సముదాయాలు రేకుల షెడ్డు నిర్మిస్తున్నా, దానిపైన ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవట్లే.. అని జోనల్ కమిషనర్‌కు తెలిపారు. సర్వేనెంబర్ 199/1లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉన్నటువంటి ఒక ఎకరం తొమ్మిది గుంటల భూమిని కూడా గతంలో ఫినిషింగ్ చేసిన ఆ బిల్డర్ ఆ ఫినిషింగ్ తొలగించి మళ్లీ రోడ్డు నిర్మాణం చేసిన పట్టించు కోవడం లేదని వాపోయారు. వీటిపై వెంటనే జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఫైమిద, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, మర్రి శోభన్, బి.అరుణ్ కుమార్ గౌడ్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రామావత్ సక్రు నాయక్, శాఖా కార్యదర్శులు సరిత, అనిత, సౌజన్య, జ్యోతి, సౌజన్య, నాగరాజు, చెంది వెంకట్, పార్టీ శ్రేణులు వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.



కార్మికులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగించుకోవాలి

- సీఐటీయూ రామోహన్ గౌడ్

నవతెలంగాణ-బడంగ్‌పేట్



భావన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ గౌడ్ అన్నారు. ఆదివారం బాలాపూర్ మండల సీఐటీయూ కన్వీనర్ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల బడంగ్ పేట్ భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామోహన్ గౌడ్, శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. భావన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'జక్కిడి సంజీవ రెడ్డి బారి నుంచి కాపాడండి'

నవతెలంగాణ-హాయత్ నగర్



జక్కిడి సంజీవ రెడ్డి బారి నుంచి కాపాడాలని శ్రీ వెంకటేశ్వర కాలనీవాసులు సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో హాయత్ నగర్ తహశీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. శ్రీవెంకటేశ్వర కాలనీ సాహెబ్ నగర్ సర్వే నెంబర్ 71/1 ప్రభుత్వ భూమిలో 1989 సంవత్సరంలో ప్రభుత్వం ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇస్తే, అందులో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, దానికి అనుకుని ఉన్న జక్కిడి రామిరెడ్డి కాలనీ సర్వేనెంబర్ 132 పట్టా భూమి ఉందన్నారు. జక్కిడి సంజీవరెడ్డి వెంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీకి ఆనుకొని నా పట్టా భూమి ఉందని గత 20 సంవత్సరాలుగా వీకర్ సెక్షన్ కాలనీ వాసులను బెదిరిస్తూ, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడం కోసం విశ్వ ప్రయాత్నలు చేస్తున్నారని, కొంతమంది గుంపులుగా వచ్చి ఇల్లు కట్టడం కోసం ప్రయత్నం చేస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తురని కాలనీ వాసులు వాపోయారు. దాదాపు 20 ఏండ్ల నుంచి ఈ గొడవ కొనసాగుతుందని, కాలనీవాసులు న్యాయంగా సర్వే చేయించుకోని, మీదని తెలితే మీరే తీసుకోండి అంటే సిద్ధంగా లేకుండా అడ్డదారిన అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇల్లు కట్టాలని చూస్తున్నారిని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ భూమిని రక్షించి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల దాడుల నుంచి మమ్ములను కాపాడి మాకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు పి.కృష్ణ, బిక్షమయ్య, మనోహరా చారి, నరసింహ, కృష్ణ, అంజయ్య, కోటేష్, గణేష్, రాజు, శారద సుజాత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో శనివారం రాష్ట్ర ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాస్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మిధాని డిపో, ఇన్నర్ రింగ్ రోడ్డు నుండి వయా బాలాపూర్ ఎక్స్ రోడ్, నాదర్గుల్, ఆదిభట్ల మీదుగా అవుటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్డు గత 15 సంవత్సరాల క్రితమే మంజూరు కావటం జరిగిందని ఇప్పటి వరకు పురోగతి సాధించలేకపోయిందని ఆయనకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాస్ యాదవ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా రోడ్డు సరిపోవడం లేదని మంత్రిని రేడియల్ రోడ్డును తక్షణమే మంజూరు చేసినట్లు అయితే కార్పొరేషన్‌లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాదర్గుల్ గ్రామ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కందడి శ్రీరామ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు క్యారగారి శ్రీధర్, మామిడిపల్లి భాస్కర్, నాదర్గుల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి బంగారు మురళి, 19వ డివిజన్ అధ్యక్షులు భాను, యువ నాయకులు మరాటి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'అలైన్‌మెంట్‌లో తారామతి పేటను చేర్చాలి'

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్



భావ్య వలయం ఎగ్జిట్ 10 నుంచి భద్రాచలం వరకు చేపట్టనున్న రోడ్డు అలైన్‌మెంట్‌లో తారామతి పేట గ్రామం పేరును చేర్చాలని అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌరెల్లి గ్రామం నుంచి భద్రాచలం వరకు చేప డుతున్న రోడ్డు తారామతి పేట రెవిన్యూ పరిధిలో ఉందని, గౌరెల్లి గ్రామానికి ఏలాంటి రెవిన్యూ సంబంధం లేదన్నారు. అందుకే గౌరెల్లి భద్రాచలం రోడ్డుకు బదులుగా తారామతి పేట.. భద్రాచలం రోడ్డు అంటూ అలైన్ మెంట్‌లో పొందు పార్చాలని తహశీల్దార్‌ను కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం చేపట్టనున్న రోడ్డు బోర్డులో తారామతి పేట గ్రామం పేరును నమోదు చేయాలన్నారు. ఈ విషయం తహశీల్దార్ సుదర్శన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా అయన సానుకూలంగా స్పందిస్తూ విషయం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

ఏడాది పాలనలో రూ. 21 వేలకోట్ల రుణమాఫీ ఘనత రేవంత్ రెడ్డిదే



- బొంగు వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-హాయత్‌నగర్

ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు గ్రామాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 21 వేలకోట్ల రుణమాఫీ ఘనత దేశంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించిందన్నారు. ముఖ్యమంత్రి దూరచూపుతో ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెలుతున్నదని తెలిపారు. సోమవారం గణేష్ టెంపుల్లోని శివాలయంలో డీసీసీ అధికార ప్రతినిధి నేతృత్వంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎల్బీనగరగ నియోజకవర్గం ఇన్‌చార్జి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మదు యాష్కిట గౌడ్‌కి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని లేని యెడల గాంధీభవన్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మదు యాష్కి గౌడ్ అభిమానులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బత్తుల అంజయ్య, వట్టెపల్లి జానయ్య వెంకట్ రెడ్డి, యోగిశ్వర్ రెడ్డి, శోభన్, సీతారాం నాయక్ మహేందర్ గౌడ్, మల్క్యాపూర్ వెంకటేష్ రజక మహిళా కాంగ్రెస్ నాయకురాలు మహిళా జనరల్ సెక్రటరీ స్వర్ణ గౌడ్, సెక్రటరి క్రుపా రెడ్డి, మహిళా సెక్రటరీ రత్నా కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మీర్‌పేట్

మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగుడ చల్లా లింగారెడ్డి పాఠశాలలో గత ప్రభుత్వ హయంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి చాలా నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేశారని చెప్పారు. మధ్యాహ్నం భోజనం, ఇతర సౌకర్యాలు మంచిగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కాల కామేష్ రెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్ రెడ్డి, కో అప్షన్ సభ్యులు రజాక్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జమాల్ పూర్ సునీత బాల్ రాజ్, బీఆర్ఎస్ నాయకులు సిద్దాల బీరప్ప, రాజ్ కుమార్, సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లోని న్యూ తిరుమల నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు మరణించారు. వారి అంతిమయాత్రలో ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంతిమ యాత్రలో వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బడంగ్‌పేట్

జీహెచ్ఎంసీ ప్రజావాణికి 132 ధరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెడ్ ఆఫీస్, ఆరు జోన్లలో మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి. జీహెచ్ఎంసీ హెడ్‌ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా ఆరు విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 38 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఎ.సి రెవెన్యూ, ఏ.సి అడ్మిన్‌లకు నాలుగు చొప్పున, సి.ఇ మెయింటెనెన్స్, వెటర్నరి, ఎల్.ఏ.ఓ మూడు చొప్పున, శానిటేషన్, హెల్త్, యు.బి.డి సి.ఇ ప్రాజెక్ట్ ఒకటి చెప్పున విన్నపాలు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 65, ఎల్బీనగర్ జోన్ లో 10, సికింద్రాబాద్ జోన్ లో 8, శేరిలింగంపల్లి జోన్ లో 7, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలో రెండు చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ ప్రదీప్ కుమార్ ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పబ్బులల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని సహించం

● ఏసీపీ మహేష్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ రాణా పరిధిలో నిర్వహిస్తున్న కైరో, అర్బన్ హౌస్ పార్టీ, 10డీ, హీరో జో రాత్రి సమయి హమ్‌లో పబ్బులను ఏసీపీ మహేష్, నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ బృందంతో కలిసి ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాదకద్రవ్యాల వినియోగంపై నిర్వాహకులను ఆరా తీశారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని పసిగట్టే నార్కోటిక్ డాగ్ (శునకం) తో ముమ్మర తనిఖీ చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించి చట్టరీత్యా శిక్షించే చర్యలపై పబ్బుల యజమానులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ సంస్కృతిని ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదని హెచ్చరించారు. పబ్బులకు వచ్చే కొత్త వారిపై నిఘా ఉంచాలని, రాత్రిల్లో నిర్ణీత సమయానికి పబ్బులను మూసి వేయాలని కోరారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి : శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ - చర్లపల్లి

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. సోమవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్‌కు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు నవనీత సంపత్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న పిండి గిర్ని, అల్లం ఎల్లిగడ్డ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం కృషితో తమ కాళ్లపై తాము నిలబడి, ఆర్థికంగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మేడ్చల్ మల్కాజ్గిరి డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొడిగె ప్రభుగౌడ్, రాజుగౌడ్, గోపాల్ యాదవ్, హిరాలాల్ నాయక్, ఎల్‌ఐసి శ్రీను, మురళి గౌడ్, వెంకట్ రెడ్డి, సదానంద్, శంకర్, రెహమాన్, మహిళా అధ్యక్షురాలు సత్యమ్మ, అరుణ, రామారెడ్డి, మున్ని, సంధ్య, గిరిజ, ధనలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాలికలు, స్త్రీ సంరక్షణకు అందరూ పోరాడాలి

● ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకురాలు చల్లా లీలావతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

స్త్రీ, పురుష సమానత్వానికి, బాల బాలికల రక్షణకు స్త్రీలతో పాటు పురుషులు కూడా ముందుకు రావాలని, అప్పుడే సమాజం పురోగమిస్తుందని ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకురాలు చల్లా లీలావతి అన్నారు. భవిష్యత్తు తరాలైన బాలికల సంరక్షణ కోసం, స్త్రీ రక్షణ కోసం అందరూ నడుంకట్టి పోరాడాలన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ డివిజన్ అంతయ్య కాలనీలో ఐద్వా (ఏఐడిడబ్ల్యూ) కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా డి. శోభ, అధ్యక్షురాలిగా శాంత కుమారిని ఎన్నుకున్నారు. అనంతరం చల్లా లీలావతి మాట్లాడుతూ..1981లో యునెస్కో ప్రపంచ దేశాలకు స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా నవంబర్ 25 నుండి మానవ హక్కులు దినోత్సవం డిసెంబర్ 10 వరకు సదస్సులు, సెమినార్లు నిర్వహించాలని పిలుపునిందన్నారు. 2030 కల్లా స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రపంచ దేశాలు కలిగి ఉండాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందన్నారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలు తీసుకువచ్చినా అవి పూర్తిగా తుంగలో తొక్కిపడుతున్నాయన్నారు. చట్టాలను పాలకులు అధికారం చేతిలో పెట్టుకుని నీరుగారుస్తున్నారని, ఒక రోజుకు 140 మంది బాలికలు మహిళలపై అత్యాచారాలు చేస్తూ హత్యలు చేస్తున్నారన్నారు. మరోపక్క రాజ్యాధికారాన్ని చేతిలో పెట్టుకుని మహిళను రెండో పౌరురాలిగా చూస్తున్నారని అన్నారు. పార్లమెంటులో 33% రిజర్వేషను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. 543 మంది పార్లమెంటుకు ఉంటే అందులో 74 మంది మాత్రమే మహిళలు ఉన్నారని అన్నారు. 1948 అక్టోబర్ 10 మానవ హక్కుల ప్రకటన జరిగితే దానిని ఇప్పుడు డిసెంబర్ 10 వరకు జరుపుతున్నారని, మహిళా హక్కులే మానవ హక్కులను ప్రకటిస్తూ నవంబర్ 25 నుండి స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవాలు సెమినార్లు, సదస్సులు నడుపుతూ 16 రోజులు మానవ హక్కుల దినోత్సవం వరకు జరపాలని కోరారు. ప్రపంచ దేశాల్లో అన్నీ మహిళా సంస్థలు కూడా ఈ 16 రోజులు స్త్రీ రక్షణ కోసం బాలికల సంరక్షణ కోసం పిలుపునిస్తూ, మహిళా హక్కులే మానవ హక్కులు అని ఎలుగెత్తి చాటాలని తెలిపారు. అంతముందు మహిళా హక్కులే మానవ హక్కులు అని మల్కాజిగిరి మండల కార్యదర్శి పిట్టల మంగా మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఐద్వా మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

గురుకులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి



● కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర

గురుకులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.సోమవారం నాగారంలోని మైనారిటీ గురుకుల పాఠశాల ను తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బంద్రూ శోభారాణి తో కలిసి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మైనారిటీ గురుకులాల పాఠశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నాగారం మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు పంగ హరిబాబు,వెంకట్ రెడ్డి,అన్నం రాజ్ సురేష్, ముక్క శ్రీనివాస్ యాదవ్, సత్యం సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు తయారీ కేంద్రం పరిశీలన



● మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి

నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడలో చెత్తతో ఎరువు తయారు చేసే కేంద్రాన్ని, కొర్రెముల బాలాజీ నగర్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కమిషనర్ వీరారెడ్డి, మేనేజర్ ఆంజన్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్, మహేష్, చంద్రమౌళి తదితరులున్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ ఏ.నాగమణి ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్ ఆఫీస్ నుంచి పీఎస్‌రావు కమాన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, డీఈఈ బాల మురళి, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు మంగళ్ పురి వెంకటేష్, రామారం శ్రీహరి గౌడ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, స్నేహ మహిళా సంఘాల టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ ఇంచార్జ్ నరసింహ, స్నేహ మహిళా సంఘాల ఆర్పీలు, స్నేహ మహిళా సంఘాల మహిళలు, అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాగారంలో అభివృద్ధి పనులకు పెద్ద పీట



● మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని రామలింగేశ్వర కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షలతో చేపట్టుతున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరం ఉన్న చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ గోక కళావతి యాదగిరి,తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నిర్వాకులు శివ కుమార్, శ్రీరాములు, శ్రీకాంత్, నరేష్, శ్రీనివాస్, రాజేష్, నరేష్, పుణ్యవతి, సుదమై, స్వాతి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 16 ఏండ్ల తర్వాత కలుసుకున్న వారంతా, ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం భవిష్యత్తులో ఎప్పుడు కలుసుకోవాలో కార్యాచరణను అందరూ కలిసి నిర్ణయించుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగారెడ్డి, నర్సింహా, విమల, దేవి, సాయికుమారి, స్వరూప, సునదా, గీత, మంజుల, ఇబ్రహీం, మురళికృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉర్స్ ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని హజరత్ బదిరుద్దీన్ అహ్మద్ కబూల్ మదర్, హజరత్ జిందా షా మదర్ దర్గాలో ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉర్స్ కార్యక్రమానికి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా ఆశీస్సులు అందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహమూద్, అశోక్ చారి, షఫీ, గౌస్, నర్సింగరావు, హమీద్ , శ్యామ్, ఉన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

● పార్టీ మండల కార్యదర్శి ఎం.నరేష్



నవతెలంగాణ- మేడ్చల్

ఈ నెల 7,8 తేదీల్లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో నిర్వహించే సీపీఐ (ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి మందాపురం నరేష్ పిలుపునిచ్చారు. సోమవారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మేడ్చల్ పారిశ్రామిక వాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో జిల్లాల్లో ఉన్న సమస్యలపైన, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించటం జరుగుతుందని తెలిపారు. సీపీఐ (ఎం) పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నర్సింగ్ రావ్, ప్రశాంత్, నాయకులు చంద్రశేఖర్, నర్సింహా, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో మర్రి చెన్నారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండలానికి మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలను గుర్తిస్తూ మేడ్చల్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఎర్ర విజయ్ రావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచి సీఎంగా పనిచేశారని తెలిపారు. ఆ సమయంలోనే మేడ్చల్ చెక్ పోస్ట్‌లో పారిశ్రామిక వాడను నెలకొల్పారన్నారు. అంతే కాకుండా గవర్నర్‌గా నియమకమైన తర్వాత 30పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారని గుర్తు చేశారు. నేడు మేడ్చల్ పట్టణం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లడానికి మర్రి చెన్నారెడ్డి చేసిన కృషి ఫలితమేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున్న మేడ్చల్ పట్టణంలో వారి విగ్రహం ఏర్పాటుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు చొరవ చూపాలని సూచించారు.

ఏడాదిలో చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

● ఎమ్మెల్యే కోటా కింద అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించుకోలేని అసమర్థుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

● కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యేగా మర్రి రాజశేఖర్ రెడ్డి గెలుపొంది ఏడాది అయ్యిందని, ఏడాదిలో ఆయన చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నిధుల నుండి నయా పైసా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే కోటా కింద అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించుకోలేని అసమర్థ ఎమ్మెల్యే అని, కేవలం అధికారులకు ఇచ్చే వినతిపత్రాలకు పరిమితమయ్యారని విమర్శించారు. సోమవారం మల్కాజిగిరి డివిజన్ ఆనంద్ బాగ్‌లోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్పొరేటర్లు, మల్కాజిగిరి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులతోనే కొబ్బరికాయలు కొడుతూ తానే చేస్తున్నానని చెప్పుకుంటూ, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుండి ఒక్క రూపాయి శాంక్షన్ చేయించలేదన్నారు. మైనంపల్లి హనుమంతరావు మౌలాలి కమాన్, ఆర్‌యూబీ పనులు ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులతో చేశారని తెలిపారు. ఇప్పుడు ఎమ్మెల్యే కాకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సంవత్సర కాలంలో సుమారు రూ.21 కోట్లు అభివృద్ధి పనులకు శాంక్షన్ చేయించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, మచ్చ బొల్లారం డివిజన్ జితేంద్రనాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, జీఎస్‌వీ సతీష్ కుమార్, ఎస్‌ఆర్ ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, బీకే శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, బాబు, సత్యనారాయణ, రాందాస్ సంతోష్, నరేందర్ గౌడ్, సయ్యద్ మబ్బు, ఫరీద్, అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, ఇందిరా ప్రియదర్శిని, ఆశ, చెన్నారెడ్డి, శంకర్, రామచందర్, సత్యనారాయణ, చంద్రకాంత్, ఇస్తారి, కన్న, శిరిగిరి రాజు, బాలరాజు, ఆగమయ్య, వెంకటేశ్వరరావు, ఫారుక్, మంద భాస్కర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పని చేయాలి



● ఏసీపీ చక్రపాణి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఇటీవల పోలీసు ట్రెయినింగ్ ముగించుకుని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేసిన నూతన పోలీస్ కానిస్టేబుళ్లు క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి సూచించారు. సోమవారం నూతన కానిస్టేబుళ్లు ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు మొత్తం 8 మంది అలాట్ కాగా అందులో ఇద్దరు ఉమెన్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి కృషి : బొంతు శ్రీదేవియాదవ్



నవతెలంగాణ - చర్లపల్లి

వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ చర్లపల్లి డివిజన్ అభివృద్ధి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. సోమవారం చర్లపల్లి డివిజన్‌లోని నాగార్జున కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా నాగార్జున కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీలోని పలు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. నాగార్జున కాలనీ బస్ స్టాప్ దగ్గర నాలా కవర్స్ 70 మీటర్స్, యూజీడీ పాత పైప్ లైన్ తరచూ పొంగుతో కాలనీవాసులకు ఇబ్బందులు గురవుతున్నారని కార్పొరేటర్‌కు తెలిపారు. రోడ్డు నెంబర్ 3లో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్, ప్రధాన రోడ్డులో ఉన్న పాత జీహెచ్‌ఎంసి మహిళా టాయిలెట్ క్యాబిన్ తొలగింపు విషయాలను కార్పొరేట్ దృష్టికి కాలనీ సభ్యులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి బస్ స్టాప్ దగ్గర ఉన్న నాలకు వెంటనే సిమెంట్ బిల్లలను తక్షణమే ఏర్పాటు చేయాలని, సానిటైజేషన్ విభాగం వారితో మాట్లాడి ఉపయోగం లో లేని మహిళా టాయిలెట్ క్యాబిన్ ని తొలగించాలని ఆదేశించారు. అతి త్వరలో ప్యాచ్ వర్క్ వేపిస్తానని కార్పొరేటర్ కాలనీవాసులకు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి ఏఎంసీ నాగిళ్ల బాల్ రెడ్డి, నాగార్జున కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి యవపురం రవి, ఉపాధ్యక్షులు గోపాల్ యాదవ్, సాయి, కరుణాకర్ రెడ్డి, మహేశ్ గౌడ్, హిరాలాల్ నాయక్, వెంకటొరెడ్డి పాల్గొన్నారు.

నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థలను సందర్శించిన న్యూయార్క్ డిప్యూటీ కమిషనర్







నవ తెలంగాణ - పోచారం

న్యూయార్క్‌లో డిప్యూటీ కమిషనర్‌గా సేవలందిస్తు న్న దిలీప్ కుమార్ చౌహాన్ దివ్యనగర్‌లోని నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థలను, నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ అక్షరాభ్యాస సంస్థ, నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ర్థుల అభివృద్ధికి అవలంభిస్తున్న విధానాన్ని అభినందించారు. అక్షరాభ్యాసను ఆరంభించి ఈ సంస్థ ద్వారా నల్లమల రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రస్తుత సమాజంలో అక్షరాభ్యాస వంటి విధానాలు అవసరమని అందరూ అనుసరించాలని కోరారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. న్యూయార్క్ లో విద్యార్థులకు ఉన్న ఉన్నత విద్య పరిశోధనాల అవకాశాలను వివరించారు. అన్ని రంగాలలో సుస్థిరమైన అభివృద్ధి జరగాలని తాము చేస్తున్న కృషిని వివరించారు. ఉన్నత విద్య పరిశోధనలకు న్యూయార్క్ వచ్చే భారతీయ విద్యార్థులకు మౌలిక సదు పాయాలతో పాటు అన్ని విధాల సహాయ సహకారాలు సదుపాయాలు అందిస్తామ న్నారు. కాగా భారతీయ విద్యార్థులకు ప్రాముఖ్యత ఇవ్వడంతో పాటు భారతీయ పండుగ దీపావళికి న్యూయార్క్‌లో సెలవు దినంగా ప్రకటించడంలో దిలీప్ కుమార్ కీలక పాత్ర పోషించారు. వీరు విద్యార్థుల పరిశోధనలను ప్రోత్సహిం చడంలో సైతం ముందుంటారు. కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు

కీర్తన కుమితీ ఫైట్‌లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

● బంగారు, కాంస్యం, రజత పతకాలు కైవసం

● ఉపాధ్యాయుల అభినందనలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆనంద్ బాగ్ టాలెంట్ హబ్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు కీర్తన కుమితీ(ఫైట్), కటా విభాగంలో బంగారు పతకాలు, తనై కుమితీలో (ఫైట్) కాంస్య, కటా విభాగంలో రజత పతకం, ఆశిక తిరుమలరెడ్డి కాంస్య పతకాలు సాధించారు. బెల్లబ్ స్కూల్ చెందిన అభిరామ్ కుమితీ (ఫైట్) విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఏసీటీ కిడ్స్ స్కూల్‌కు చెందిన వశిష్ట కుమితీ (ఫైట్)విభాగంలో రజత పతకం సాధించాడు. ఆల్‌కలర్ గ్రాండ్ ఛాంపియన్షిప్ అబౌవ్ 12 ఏజ్ గ్రూప్‌లో కీర్తన కుమితీ (ఫైట్) విభాగంలో గ్రాండ్ ఛాంపియన్షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, కరాటే మాస్టర్ కుమారస్వామి అభినందనలు తెలిపారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పెండింగ్ సమస్యలను పరిష్కంచాలని కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ అన్నారు. సఫిల్ గూడలోని లేక్ పార్క్‌లో దోమల నివారణకు ఎం.ఎల్ ఆయిల్ చల్లాలన్నారు. సోమవారం అనంతరం మల్కాజిగిరి సర్కిల్ ఆఫీస్‌లోని ప్రజావాణిలో పాల్గొని స్ట్రీట్ లైట్స్ సమస్య పరిష్కరించాలని, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ పెండింగ్ పనులను పూర్తి చెయ్యాలని, ప్రాపర్టీ టాక్స్ ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో డి.సి రాజు, ఈ.ఈ లక్ష్మణ్, ఎంతోమలజీ ఏ.ఈ వనజ, శివ, నందు, దుర్గ ప్రసాద్ స్వామి, అధికారులు, పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



● బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్

నవ తెలంగాణ- మేడ్చల్

ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మల్కాజ్ గిరి కలెక్టరేట్ లో ఆశా వర్కర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న లెప్రసీ,పల్స్ పోలియో,టీబి సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్లకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.వారికి నెల నెల రావాల్సిన బిల్లుల విషయంలో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.నెలకు మూడు లీవ్ లతో పాటు ఇబ్బందులు పెట్టకుండా నెల నెల బిల్లులు సక్రమంగా ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆశా వర్కర్లతో కలసి భారీ ఎత్తున ధర్నాలు,రాస్తారోకోలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆశా వర్కర్లు మహాలక్ష్మి,ప్రేమ్ లత,పద్మ,అనుష,దుర్గ,కవిత,రెహణ, సరస్వతి,కవిత,జ్యోతి,పుష్ప,రజిత,లావణ్య పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ - చర్లపల్లి

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మైనార్టీ నాయకుడు బద్రుద్దీన్ ఉన్నారు.

కుల గణన సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కాంగ్రెస్ కూకట్‌పల్లి యువ నాయకులు గాదె శివ చౌదరి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకులు గాదె శివ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చి ఇక్కడ నివాసం ఉండి.. ఉద్యోగం వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో భాగపస్వామ్యమై మీ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్వే వలన ఆర్థికంగా వెనకబడిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల అందించటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. రేపటి భవిష్యత్తుకు ఈ సర్వే నాంది అన్నారు. మీ ఏరియాలో ఇప్పటి వరకు సర్వేకు రానట్లయితే.. మీ లోకల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించాలన్నారు.

కింగ్‌డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. అనంతరం ఈనెల 19న తేదీన నిర్వహించ నున్న "గ్రాండ్ క్రిస్మస్" వేడుకలకు ఎమ్మెల్యేని ఆహ్వాని స్తూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమం లో కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ సభ్యులు బిషప్ క్రీస్తు రాజు, ఎస్తేరు రాణి, ఎండి.రఫిక్ బాబు, ఎలీషా , తిమోతి, ప్రభాకర్, భాస్కర్,శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన విజయోత్సవం



- జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజా పాలన విజయోత్సవం" కార్యక్రమాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో అనేక అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ గౌతమ్ పొట్రు, అర్బన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఆన్‌లైన్ ద్వారా సీఎంతో ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్నారు. 2024 నుంచి ప్రారంభమవుతున్న కొత్త పారా మెడికల్ కోర్సుల, డిప్లొమా ఈఈసీజీ టెక్నాలజీ (డిఇసిజి), డిప్లొమా - మెడికల్ స్టెరిలైజేషన్, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ (డిఎంఎస్టి)ను ప్రారంభించారు. మేడ్చల్-మల్కాజిగిరి ప్రభుత్వ వైద్య కళాశాల/ఆస్పత్రి ప్రాంగణంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ క్లినిక్ వారంలో రెండు రోజులు సేవలు అందించి, ట్రాన్స్‌జెండర్ సమాజానికి సమగ్ర ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ "ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల స్థాపన, కొత్త పారామెడికల్ కోర్సుల ప్రారంభం జిల్లా యువతకు అధిక శిక్షణను అందించడం మాత్రమే కాకుండా, సమాజానికి అధునాతన ఆరోగ్య సేవలను అందించడంలో సహాయపడుతుంది" అని తెలిపారు. కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈ అవకాశాలు మీ భవిష్యత్‌కు మేల్కొలుపు గానే కాకుండా, సమాజానికి సేవ చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదం చేస్తాయి. ఈ అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుని, మీ సేవలతో సమాజానికి మేలు చేయండి" అని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డులో కుత్బుల్లాపూర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి, ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని మల్కాజిగిరి డివిజన్ డాక్టర్ శోభారాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీ కష్ణ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి.జయంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి
- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రజా పాలన విజయోత్సవ సన్నాహక సమావేశం సోమవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కాల్వ సుజాత, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, ఇన్చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని కూకట్ పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించ తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్ పార్టీకార్యాల యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుజాత మాట్లాడుతూ గత పది ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుతిన్నదని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆమె ధ్వజమెత్తారు. ఈ మేరకు రూ.8 లక్షల కోట్ల అప్పుల కారణంగా ప్రతినెల కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం టిఆర్ఎస్ పరిస్థితి వెంటిలేషన్ స్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. అప్పుల రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ గాడిలో పెడుతున్నారన్నారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ పేదలకు అండగా కాంగ్రెస్ జెండా ఉంటుందని, పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో లేక పోయినా ప్రాణాలొడ్డి మరీ పోరాటం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చేసే సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనపై వారం రోజులపాటు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని డివిజన్ స్థాయి నాయకులకు రమేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్తామని రమేష్ పేర్కొన్నారు. పీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం, ఏ.బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, యుగంధర్ రెడ్డి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పా రెడ్డి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య గోపిశెట్టి రఘు, డివిజన్ అధ్యక్షులు మరియు డివిజన్ అధ్యక్షురాలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలమల్లేష్ మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెం దడం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమా మహేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నంలు విచారం వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిం చాలని కోరుతూ కుత్బుల్లాపూర్ సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయ ప్రాంగణంలో సీపీఐ శ్రేణులతో కలిసి బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఇప్పటివరకు కమ్యూని స్టు పార్టీలో కీలక భూమిక పోషించిన కామ్రేడ్ బాల మల్లేష్ లేడనే వార్తలు జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి,వి.హరినాథ్ రావు,యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేష్,మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వి.హైమవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆకుబత్తిని ప్రవీణ్, అధ్యక్షులు భాస్కర్, ఉపా ధ్యక్షులు డి.రాములు, చారీలు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పేదలకు వరం సీఎం సహయనిధి అని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లో నివాసం ఉంటున్న వి.అరుణకి హార్ట్ స్ట్రోక్ రావడంతో.. వారికి స్టెంట్ వేయాల్సి రావడంతో నిమ్స్ హాస్పిటల్‌లో చేరా రు. వారి కుమారుడు సూరజ్ కూకట్‌పల్లిలోని గొట్టి ముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయంలో సంప్రదించగా.. కూకట్‌పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి రూ.1,50,000ల ఎల్‌ఓసీ మంజూరు అయ్యింది. ఆ ఎల్‌ఓసి లెటర్‌ను సోమవారం బండి రమేష్ చేతుల మీదుగా వారి కుమారుడు సూరజ్ కి అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్‌కి, సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, అరుణ్, మస్తాన్ రెడ్డి, అస్లాం, పి.అరుణ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో.. ముగిసిన ప్రధానోపాధ్యాయుల కాన్ఫరెన్స్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్


తెలంగాణ గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాల ల యాజమాన్య సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో.. సోమవారం హెడ్‌మాస్టర్ల కాన్ఫరెన్స్ జరిగింది. సూరారంలోని విబిపీ ఫంక్షన్ హాల్‌లో ఎనర్జీ టు సినర్జీ న్యూ డైరెక్షన్స్ - 2025 అనే అంశంపై పాఠశాల యాజమాన్యం, హెడ్‌మాస్టర్ల ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యు డైస్ ప్లస్‌తోపాటు ఇతరత్రా ఆన్లైన్, అపార్, ఎన్ఈపి సమస్యలపై సమగ్రంగా అధికారులు వివరించారు. ఆన్లైన్ పనులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. ఎప్పటికప్పుడు అప్డేట్స్‌ను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. స్టేట్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ మురళి కృష్ణ, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మనిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఏహెచ్ పిఎస్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, విస్బ్లీ ఆఫ్ లెర్నింగ్ మెం టార్ అండ్ ట్రైనర్ రఘురామ్, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పలు అనుమానలను నివృత్తి చేశారు. ఈ సం దర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి మాట్లా డుతూ... ప్రయివేట్ యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చే నూతన ఆన్లైన్ ల అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కే రామేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు రాంచంద్రయ్య, చింతల మల్లేష్, హన్మంతా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



నవతెలంగాణ-మేడ్చల్

నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎఐసిటిఈ, ఆటల్ వారి సహకారంతో క్వాంటం కంప్యూటింగ్‌బీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్‌పై సోమవారం కళాశాలలో ఫ్యాకల్టీ కి డెవలప్మెంట్ ప్రోగ్రాంని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శ్రీమతి డా.సుప్రీతి హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల అధ్యాపకులు వారి నైపుణ్యాలను మరింత మెరుగు పర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించడానికి తమ కళాశాల ఒక వేదిక అవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడానికి తాము ఎప్పుడు సిద్ధమే అని కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాయోజకులైన ఎఐసిటిఈ అటల్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా.ఎ. మోహన్ మాట్లాడుతూ ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం వల్ల అధ్యాపకులు భవిష్యత్తులో రానున్న మార్పులకు అనుగుణంగా ఉంటారని తద్వారా విద్యార్థులకు కూడా తదనుసారంగా బోధన చేస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ ఈ ఎఫ్డిపి లో భాగంగా మెకానిక్స్ ఆఫ్ క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం ఇన్ఫర్మేషన్ థియరీ, కమ్యూనికేషన్ నెట్వర్క్స్, ఆర్టీ ఫిషియల్ ఇంటలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ పై పరిచయం క్వాంటం ఎర్రర్ కరెక్టింగ్ కోడ్ వంటి ఎన్నో అంశాలును వివరించడానికి డి ఆర్డిఓ, ఐఐటి వంటి ప్రముఖ సంస్థల నుండి ప్రముఖులు రిసోర్స్ పర్సన్స్‌గా రావడం చాలా ఆనందదాయకమని తెలిపారు. నేటి రోజున జరిగిన సెషన్‌లో ఏఐ మెషిన్ లెర్నింగ్‌ను వివరించడానికి ముఖ్య అతిథి డా.సుప్రీతి రిసోర్స్ పర్సన్‌గా ఉండడం విశేషం అన్నారు. ఈ ఎఫ్‌డీపీకి వివిధ రాష్ట్రముల కళాశాల నుండి సుమారు 105 అధ్యాపకులు నమోదు చేసుకోగా, ఎఐసిటిఈ, అటల్ వారి నియమాలను అనుసరించి 60 మంది అధ్యాపకులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మెన్ జె. నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి , కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా.ఏమోహన్, ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాథం, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.పురుషోత్తం ప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.రాము, కార్యక్రమ సమన్వయకర్త డా.దిలీప్ రెడ్డి, డీన్ ఐసిటి శ్రీనివాస్, వివిధ విభాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా మూడో మహాసభల పోస్టర్‌ను ప్రగతి నగర్‌లో అతికించి ప్రదర్శిస్తూ సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్న బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో.. పార్టీ మూడవ జిల్లా మహాసభలు ప్రగతి నగర్ లీలా సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్‌లను అతికించారు.
నవతెలంగాణ-దుండిగల్

సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి



- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం షాపూర్ నగర్ రైతుబజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ... పేద ప్రజల కార్మికుల అసంఘటిత రంగాల కార్మికుల తరపున పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పార్టీ ఆధ్వర్యంలో ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. రెండు పడక గదుల ఇండ్లు స్థానికులకే కేటాయించాలన్నారు. గతంలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని కూడా లెక్క చేయకుండా జైళ్లకు వెళ్లడానికి కూడా సిద్ద పడి సూరారం గాజులరామారం, మెట్టుకానిగూడలో ఉన్న ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా..ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా పోరాటాలు చేసి, సాధించడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, గత 10 ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాన్ని పక్కకు పెట్టి.. అధికారం కోసం కమిషన్ల కోసం పరిపాలించారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న భూకబ్జాదారులు, నాయకుల బెదిరింపులకు, దాడులకు కూడా వెనకాడకుండా భూ పోరాటం చేసారన్నారు. రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇండ్లు సాధించిన ఘనత సీపీఐ(ఎం) పార్టీదీ అన్నారు. పేదల పక్షాన పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ.దేవదానం బి. సత్యం, డి.కరుణాకర్, ఎండి.జాకీర్ హుస్సేన్, సీనియర్ నాయకులు పి.శంకర్, పార్టీ సభ్యులు ఆరిఫ్ బాబా, ఎస్కే ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లు కేటాయించండి..

ఏ ఆధారం లేకుండా దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ.. షాపూర్ నగర్ ప్రధాన రహదారి రంగా - భుజంగా సర్కిల్ రోడ్డు పక్కన నిరుపేద కుటుంబానికి జీవిస్తున్నాయి. రహదారి విస్తరణలో ప్లాస్టిక్ కవర్ల గుడిసె కూడా తొలగించాలి. దాదాపు నెల రోజులు కావస్తున్నా.. సామాన్లపై ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని తన ముగ్గురు పిల్లలతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. జీవనం సాగిస్తున్నారని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఈ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏమీ అందడం లేదన్నారు. తన భర్త అనారోగ్యంతో.. ఇదే రోడ్డుపక్క గుడిసెలో ఐదు సంవత్సరాల క్రితం చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. తనకు పెన్షన్ రాలేదని తెలిపారు. ఉండడానికి ఇండ్లు కావాలని ఆధార్ కార్డు, ఓటర్ కార్డు జత చేసి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కానీ ఈ నిరుపేద కుటుంబానికి ఇండ్లు ఇవ్వలేదని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహని కలిసి ఆ కుటుంబానికి ఇల్లు కేటాయించవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది.



రాజీవ్ గృహకల్పకు బస్సు సౌకర్యం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహ కల్ప గత 10సం॥ బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎంతోమంది నాయకులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకొనే దాఖలాలు లేకపోవడంతో.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి ప్రజలు కలిశారు. వారి బాధలను విన్నపించగా..కూకట్‌పల్లి డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు సౌకర్యం సోమవారం రాజీవ్ గృహకల్ప నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హనుమంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ హయంలో నిర్మించిన రాజీవ్ గృహ కల్ప కాలనీకి మళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన సంబరాలలో బస్సు సౌకర్యం కలిగినందుకు ఆనందం వ్యక్తం చేసారు. అలాగే ప్రభుత్వ చౌక దారుల దుకాణ సందర్శించి, గడిచిన మొదటి సం॥ లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఎలా ఉందో అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు అంజద్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, రాంచందర్ నాయక్, రవి, మర్తమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి..

పేదలకు వరం సీఎం సహాయనిధి అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సి పల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను అనారోగ్యంతో బాధపడుతూ.. దరఖాస్తు చేసుకున్న వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన.. బాధితులకు రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000 ల సీఎం సహాయనిధి నుండి (సీఎం ఆర్ ఎఫ్) కొలన్ మంజూరి చేయించారు. 126,132 డివిజన్ల లోని చెందిన వాసులు దేవర నర్సింహా, కానరామ్‌కు రూ 60,000 (అరవై వేల రూపాయలు) సీఎంఆర్ ఎఫ్ - మంజూరి పత్రాలను (చెక్కులు) అందజేశారు. అనంతరం కోలన్ మాట్లాడుతూ అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దులపల్లి టాక్స్ ప్యాక్స్ చైర్మెన్ గరిషే రాజు, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్, జేమ్స్, కొంపల్లి మున్సిపాలిటీ ప్యాక్స్ చైర్మెన్ రాజు, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సెలూన్‌లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కులవృత్తినే జీవనాధారంగా సాగిస్తున్న నాయి బ్రాహ్మణుల షాపులకు, ప్రభుత్వ ఉచిత కరెంటును అందించకపోతే, నాయి బ్రాహ్మణుల తరపున పోరాడుతా మని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళ వారం రోజు ఇందిరా పార్క్ వద్ద, నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికై ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే మేడ్చల్ జిల్లా నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో.. సంఘ సభ్యులు అందరూ ఎమ్మెల్యే కలిసి, తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో సెలూనులకు కరెంటుని ఉచితంగా ఇస్తే.. ఈ ప్రభుత్వం బిల్లులు కట్టాలని ఇబ్బందులు పెడుతున్నా రని వారి సమ స్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు. సెలూన్ షాపులకు కచ్చితంగా ఉచిత కరెంటు ఇవ్వాలని తెలిపా రు. అదేవిధంగా నాయి బ్రాహ్మణులు కాకుండా, ఇతర కులాల వారు పెట్టే, హైటెక్ సెలూన్‌లను ప్రభుత్వం ప్రోత్సహించొద్దని.. నాయి బ్రాహ్మణుల కులవృత్తి చేసు కునే వారే సెలూన్ షాపులు పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

ఖైరతాబాద్ ఆర్టీఏకు మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించారు. తమ కంపెనీ లాండ్ అండ్ ట్రీకి చెందిన నూతన వాహనం ఇన్నోవా హైక్రాస్ కారు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆయనను ఖైరతాబాద్ ఆర్టీవోలు పురుషోత్తం రెడ్డి, సీపీ వెంకటేశ్వర్ రావు స్వాగతం పలికారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కొత్త వాహనం సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను సంబంధిత అధికారులు నిబంధనలకు మేరకు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు ఆయన వాహనానికి టీజీ09 సీ 9393 నెంబర్‌ను కేటాయించారు.

ఎన్. బాల మల్లేష్‌కు అశ్రు నివాళి



నవతెలంగాణ-ఓయూ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాల మల్లేష్ అంతిమ యాత్రలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఓయూ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేశ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ ఎ స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ పాల్గొని వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బాల మల్లేష్ కుమారుడిని పరామర్శించారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్ పెట్ ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం. సిర్సస్ ల్యాబ్స్ సంస్థ ఉచితంగా 8 కంప్యూటర్లను పంపిణీ చేశారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్న ముఖ్య ఉద్దేశంతో విద్యార్థులకు కంప్యూటర్లు సంస్థ వారు అందిస్తున్నట్టు తెలిపారు. 2024-25 లో పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు 10 గ్రేడ్ పాయింట్లతో పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధిస్తే ఒక్కో విద్యార్థిని లక్ష రూపాయల చొప్పున ఇస్తామని ప్రకటించారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సిర్సస్ ల్యాబ్స్ సంస్థను ఎమ్మెల్యే మాధవరం, కష్ణ పొడిశెట్టి, వెంకటేష్, ప్రేమ్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల స్థితిగతులను మెరుగు పరిచి వారికి ప్రయివేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు., కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, నరేందర్ గౌడ్, ఎజాజ్ బాయి, జంగయ్య, మక్కల నర్సింగ్, ఇర్ఫాన్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అర్జీలపై సత్వరమే స్పందించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని ప్రజలు వివిధ సమస్యలపై ప్రజా వాణిలో అందించే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా.. వివిధ ప్రాంతాలకు చెందిన 332 మంది అర్జీలు పెట్టుకున్నారు. అర్జీదారుల నుంచి అర్జీలను అదనపు కలెక్టర్లు కదిర వన్, ముకుంద రెడ్డిలతో కలసి అయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 332 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణశాఖవి 282, పెన్షన్లు 19, జిల్లా విద్యాశాఖ 04, డీఎస్‌వో 07, సంక్షేమ శాఖలు 06, ఇతరములు 14 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజవాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్.కోటజీ, ఇలియాజ్ అహ్మద్, శ్రీరామ్, ఆర్. రోహిణి, అపర్ణ, సిబ్బంది, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రాలల్లోని పిల్లలకు సర్టిఫికేట్ల జారీ

జిల్లాలోని అన్ని ఎన్జీవో, శిశు విహార్ సంరక్షణ కేంద్రాలలోని పిల్లలకు జనన, కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లోగా అందజేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం మధుర నగర్ శిశు విహార్ సంరక్షణ కేంద్రంలో ఎన్జీవో, శిశు విహార్‌లోని పిల్లలకు జనన, ఆదాయ, కుల, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపును కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా 8 నెలల బాలికకు బర్త్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంరక్షణ కేంద్రంలోని పిల్లలందరికీ వారం రోజుల్లోగా ప్రత్యేక క్యాంపు ద్వారా వివిధ రకాలైన ధ్రువపత్రాలను అందించాలని ఆదేశించారు. సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, వైద్యులు పిల్లల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా పిల్లల బాగోగులు చూడాలన్నారు. సంరక్షణ కేంద్రాలలోని పిల్లల తల్లిదండ్రులు చనిపోతే వారి ఆస్తులు వారికి చెందేలా రెవెన్యూ శాఖకు వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయి రామ్, డీసీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ నయీమ్ ఉద్దీన్, సీడీపీవో, ఐసీడీఎస్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ సుమలత, యూనిసెఫ్ స్టేట్ కోఆర్డినేటర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.





"ఏసీఈ ది కాంపిటీటివ్ ఎక్సన్ ఆప్టిట్యూడ్" క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ

నవతెలంగాణ-ఓయూ

ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో "ఏసీఈ ది కాంపిటీటివ్ ఎక్సన్ ఆప్టిట్యూడ్" అనే ఉచిత ఐదు రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణా కార్యక్రమం సోమవారం నుంచి డిసెంబర్ 6, 2024 వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సీఎఫ్ఆర్‌డీ భవనం, హెచ్‌సీడీసీ కార్యాలయం, ఈ-క్లాసరూమ్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించనున్నట్టు వారు చెప్పారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొ. సి. వి. రంజని పాల్గొన్న విద్యార్థులకు, నేటి వనరుల వ్యక్తులకు స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల డేటా ఇంటర్‌ప్రిటేషన్, కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, విద్యార్థులు శ్రద్ధగా పాల్గొనాలని కోరుతూ నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాల ఎంపిక పరీక్షలలో విజయం సాధించడానికి ముఖ్యమని పేర్కొన్నారు. ప్రఖ్యాత శిక్షకులు శ్రీనివాస్ రెడ్డి, దుర్గ నరేశ్ "నంబర్ సిస్టమ్ అండ్ నంబర్ థియరీ" పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఓయూ క్యాంపస్, అనుబంధ , కళాశాలాల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

108 బజార్ బస్తీలో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ వార్డు 5 లోని 108 బజార్ బస్తీలో సోమవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పర్యటించారు. బస్తీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నో ఏండ్లుగా ఎన్నో ఏండ్లుగా నివాసం ఉంటున్నా.. తమకు సరైన తాగు నీటి వసతి కూడా లేదని, 4 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. నీటి వసతి కల్పించడం కోసం వెంటనే బోర్ వెల్ వేయించాలని కోరారు. అలాగే కరోనా కాలంలో భద్రతా కారణాల వల్ల మూసివేసిన 1, 3 వ నెంబర్ గేట్లు తెరిపించాలని కోరారు. గతంలో రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్న కాలంలో తమ కోసం మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారని, అలాగే పైప్ లైన్లు కూడా వేయించారని.. కానీ ఇప్పుడు ఆ పైప్ లైన్లు తీసేసారన్నారు. తమ కోసం శాశ్వత ప్రాతిపదికన , నీటి వసతి, డ్రయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. వీటితో పాటు సరైన స్ట్రీట్ లైట్స్ లేవని, రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంటుందని ఎమ్మెల్యేకు చెప్పారు అలాగే రోడ్లు కూడా దెబ్బతిన్నాయని వెంటనే వాటిని రిపేర్ చేయించాల్సిందిగా ఎమ్మెల్యేకు స్థానికులు వినతి పత్రం సమర్పించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బోర్వెల్ పనులకు శంకుస్థాపన

కంటోన్మెంట్ 7 వార్డు తిరుమలగిరి, ఇందిరా నగర్ వాసుల నీటి సమస్య తీర్చడం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వేస్తున్న పవర్ బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలో నీటి సమస్య ఉందని స్థానికులు గతంలో ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించారు. ఈ మేరకు బోర్‌వెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మురళి ముదిరాజ్, రంగ రవీంద్ర గుప్త, సరితతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



సమాజ అవసరాలకు అనుగుణంగానే సాంకేతికత అభివృద్ధి చెందాలి

- ఓయూ వీసీ ప్రొ.కుమార్
- "రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సెమి కండక్టర్ ఐసీ డిజైన్ ఇన్ ఇండియన్ పర్స్పెక్టివ్"పై సదస్సు

నవతెలంగాణ-ఓయూ

సమాజవసరాలకు అనుగుణంగా సాంకేతికత అభివృద్ధి చెందినప్పుడే పరిశోధనల లక్ష్యం నెరవేరుతుందని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అన్నారు. విద్యాసంస్థలు పరిశ్రమల అనుసంధానంతో నూతన ఆవిష్కరణలతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయని తెలిపారు. ఏటా దేశవ్యాప్తంగా 12 లక్షల ఇంజినీర్లను విద్యాసంస్థలు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, సుస్థిర నైపుణ్యం, అవగాహన కలిగిన 20 శాతం మందికి మాత్రమే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం సోమవారం నిర్వహిస్తున్న ఆరు రోజుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సెమి కండక్టర్ ఐసీ డిజైన్ ఇన్ ఇండియన్ పర్స్పెక్టివ్" అనే అంశంపై జరుగుతున్న ఈ సదస్సులో ఎలక్ట్రానిక్స్ రంగంలో పనిచేస్తున్న పలువురు నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లో ఉన్న అవకాశాలపై ప్రొఫెసర్ కుమార్ ప్రసంగించారు.



గత 40 ఏండ్లలో టెలికమ్యూనికేషన్స్ రంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులను వివరించారు. చిప్ డీజైన్, సెమికండక్టర్ రంగంలో అద్భుతమైన ఉపాధి అవకాశాలున్నాయని, ప్రస్తుతం 3 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని చెప్పారు. పరిశ్రమలు, విద్యాసంస్థల అనుసంధానానికి ఉన్న పరిమితులను, సమస్యలను గుర్తించి పరిష్కరించటం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచవచ్చని స్పష్టం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి ఎదిగే అవకాశాలు భారత సొంతమని ఎస్.ఐ.ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. అభివద్ధి చెందుతున్న దేశంగా కాకుండా త్వరలోనే అభివద్ధి చెందిన భారత్‌ను సాకారం చేసుకునేందుకు పరిశోధకులకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలను వాణిజ్య మార్కెట్‌కు అందించాలని ఈసీఐఎల్ శాస్త్రవేత్త డాక్టర్ అనీష్ కుమార్ శర్మ అభిప్రాయపడ్డారు. సాంకేతిక అభివృద్ధిని సమస్యల పరిష్కారం దిశగా మలచాలని ఔత్సాహిక పరిశోధకులను కోరారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ రంగంలో రానున్న ఐదేండ్లకు సరిపడా సవాళ్లను అధిగమించేలా ఈ సదస్సు మార్గదర్శనం చేయాలని ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.పైడిమర్రి చంద్రశేఖర్ ఆకాంక్షించారు. డాక్టర్ మిస్బావుద్దీన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి ప్రొ. డి. రామకృష్ణ సహా అధ్యాపకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో వార్ ఆఫ్ డీజేస్ ప్రకటించిన కంట్రీ క్లబ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

కంట్రీ క్లబ్ అందరికన్నా ముందుగా న్యూ ఇయర్ బాష్‌కి వెల్‌కమ్ చెప్పింది. కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆసియాలోనే అత్యంత భారీ స్థాయి నూతన సంవత్సర వేడుకలు 'వార్ ఆఫ్ డీజేస్'ను నిర్వహిస్తున్నట్టు కంట్రీక్లబ్ ఎండీ రాజీవ్‌రెడ్డి ప్రకటించారు. బేగంపేట్‌లోని క్లబ్ ఆవరణలో సోమవారం కంట్రీ క్లబ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ రెడ్డి, నటి దక్షా నాగర్కర్‌తో కలసి చలో శ్రీలంక బడే దిల్‌వాలే కార్డ్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు కలిసి న్యూ ఇయర్ వేడుక వివరాలను వెల్లడించారు.

ఈ సంవత్సరం కూడా దేశంలోని తమ అన్ని క్లబ్‌లు రిసార్ట్‌లలో "ఆసియాలోనే అతిపెద్ద న్యూ ఇయర్ బాష్ 2025"ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు, నగరానికి సంబంధించి తమ ప్రధాన వేడుక, "వార్ ఆఫ్ ది డిజేస్' నగరంలోని పోలీస్ హాకీ స్టేడియంలో జరుగనుందని, దీనిలో ప్రముఖ తారల ప్రదర్శనలు, డీజే సెట్స్‌తో పాటు టాలీవుడ్ నటి దక్షా నాగర్కర్ నత్యాలు ప్రధాన ఆకర్షణ అని రాజీవ్ రెడ్డి పేర్కొన్నారు.

కొలంబోలో అద్భుతమైన నైట్ లైఫ్, క్యాండీస్ ఐకానిక్ టెంపుల్ ఆఫ్ ద టూత్ రెలిక్,తుల్‌గాలాలో వైట్-వాటర్ రాఫ్టింగ్ వరకు ఎన్నో మధుర జ్ఞాపకాల ఈ యాత్ర ద్వారా పోగు చేసుకోవచ్చునన్నారు. ప్రపంచ స్థాయి అనుభవాలను తమ సభ్యులకు అందించాలనుకుంటున్నామని, ఈ కార్యక్రమం ద్వారా తమ సభ్యులు తమ స్వంత అద్భుతమైన జ్ఞాపకాలను పొందగలరని తన నమ్మకం అన్నారు. 'చలో శ్రీలంక'తో కంట్రీ క్లబ్ ఇండియా ప్రపంచ పర్యాటక రంగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పుతోందని, సభ్యులకు ప్రత్యేకమైన ప్రయాణ ప్రయోజనాలను మాత్రమే కాకుండా అర్థవంతమైన సాంస్కృతిక సంబంధాలను ఏర్పరచుకునే అవకాశాన్ని కూడా అందిస్తోందని తెలిపారు.

అంబర్‌పేట్, హిమాయత్‌నగర్‌లలో ఘనంగా క్రీడా దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా రెండవ రోజు సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా దినోత్సవాల్లో భాగంగా అంబర్‌పేట్ మండలంలోని జీహెచ్ఎస్ అజంపుర-1, హిమాయత్‌నగర్‌లోని హైదరగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ ఈఈవో ఎం. విజయలక్ష్మి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈవో విజయలక్ష్మి మాట్లాడుతూ క్రీడాలు మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకట్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి 5న మాదిగ విద్యార్థి గర్జన సభ

ఓయూ విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ఓయూ



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఓయూలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల విద్యార్థి నాయకులందరూ కలిసి ఎస్సీ వర్గీకరణ అమలుకు జనవరి 5న ఓయూలో మాదిగ విద్యార్థి గర్జన సభను నిర్వహిం చనున్నట్టు ఓయూలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల విద్యార్థి నాయకులు తెలిపారు. ఓ యూ ఫ్యాకల్టీ క్లబ్ లో నిర్వహించిన విస్తతస్థాయి సమావేశంలో ఓయూలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ సూచించిన సమానత్వ సూత్రం ఆధారంగానే జనాభా దమాషా ప్రకారం విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో సమాన వాట దక్కాలని కోరుతున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడం వల్లనే 30 ఏండ్ల నుండి మాదిగ-మాదిగ ఉపకుల విద్యార్థులు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వర్గీకరణ వ్యతిరేకిస్తున్న వారందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ఉందని, ఇప్పటికైనా వర్గీకరణకు సహకరించి అన్నదమ్ముల లాగా కలిసి ఉందామన్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ జిల్లాల,నియోజకవర్గాలు,మండలాల నుంచి మాదిగ విద్యార్థులు పెద్ద ఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

52 కణితీలను తొలగించిన కేర్ వైద్యుల బృందం..





డాక్టర్ ప్రభ అగర్వాల్

నవతెలంగాణ-బంజారాహిల్స్

అత్యంత భారీ పరిమాణంలో ఉన్న 52 ఫైబ్రాయిడ్‌తో కెనడాకు చెందిన 42 ఏండ్ల ఓ నర్సుకు కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ వైద్యులు డాక్టర్ ప్రభ అగర్వాల్ వైద్య బృందం ఆధ్వర్యంలో క్లిష్టమయిన సర్జరీతో ఊరట కల్పించారు. ఆ మహిళ.. కొద్దిగా తిన్నా కడుపు నిండిపోయినట్టుగా అనిపించడం, మూత్ర విసర్జన నెమ్మదించడం లాంటి సమస్యలతో 3 నెలల నుంచి బాధపడుతున్నది. ఎమ్మారై స్కాన్‌ల ఆధారంగా సోఫియాకు ఏడు ఫైబ్రాయిడ్లు ఉన్నట్టు నిర్ధారణ అయింది, ఆమె కడుపులో పలు పరిమాణంలో ఉన్న ఫైబ్రాయిడ్ కేర్ ఆస్పత్రి డాక్టర్ ప్రభ అగర్వాల్ గుర్తించారు.

శస్త్రచికిత్స ఊహించని సవాళ్లను ఎదురుకోనట్టు హైటెక్ సిటీలోని కేర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రభా అగర్వాల్ తెలిపారు. "ఎమ్మారై స్కాన్‌ల ఆధారంగా సోఫియాకు ఏడు ఫైబ్రాయిడ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది, కానీ శస్త్రచికిత్స సమయంలో, బృందం ఊహించని సమస్యను కనుగొంది. ఆపరేషన్ చేస్తున్నప్పుడు ఫైబ్రాయిడ్లు 'ద్రాక్ష గుత్తి'లా కనిపించడం ప్రారంభించాయి. మొత్తంగా, మేము ఆమె గర్భాశయాన్ని కాపాడుతూ 52 ఫైబ్రాయిడ్లను తొలగించాం. ఆమె సంతానోత్పత్తి చెక్కుచెదరకుండా ఉండేలా చూశాం. ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ, ఫలితంతో మేము ఆశ్చర్యపోయాం' అని డాక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డాక్టర్ ప్రియాంక అనస్థీషియా నైపుణ్యంతో కూడిన శస్త్ర చికిత్స నిర్వహణ, మొత్తం వైద్య బృందం అచంచలమైన అంకితభావంతో సంక్లిష్ట ప్రక్రియకు మద్దతు లభించిందిని , శస్త్రచికిత్స విజయవంతమయ్యేలా చేయడంలో వారి పాత్ర కీలకమని తెలిపారు. సోఫియా తనకు కొత్త జీవితాన్ని అందించినందుకు, భవిష్యత్తులో కుటుంబాన్ని ప్రారంభించే అవకాశాన్ని కల్పించినందుకు కేర్ హాస్పిటల్స్ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలేష్ గుప్త మాట్లాడుతూ ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలు కేర్ హాస్పిటల్స్ వైద్య నైపుణ్యం, రోగి-కేంద్రీకృత సంరక్షణ పట్ల నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. అత్యాధునిక సౌకర్యాలు, ప్రత్యేక నిపుణుల బృందంతో, ఆస్పత్రి అధునాతన స్త్రీ జననేంద్రియ సంరక్షణలో బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తూనే ఉంటుందని తెలిపారు.



స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ

ఇందిరానగర్ రోడ్ నెం 1 నుంచి 5 వరకు జరుగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను కార్పొరేటర్ డా. హేమ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరం కిందట ఈ పనులు మంజూరయ్యాయని, వర్షాకాలం, ఎన్నికల నేపథ్యంలో పనులు మొదలు పెట్టలేదని తెలిపారు. ఆ పనిని రూ. 70 లక్షల వ్యయంతో ఇప్పుడు మొదలు పెట్టమన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు నాణత్యా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, కాలనీవాసులు నవీన్ గౌడ్, శ్యామ్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1లోని శ్రీ మహంకాళి రామ మందిర్ దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్‌గా బాబు రావు, సభ్యులుగా విపిన్ అగర్వాల్, రఘు సింగమనేని, మల్లాది రమాకాంత్ రెడ్డి, అమర వాణి మేక, ధర్మ రాజు, రాఘవేంద్ర ప్రసాద్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి, బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయ్, కంది శ్రవణ్ రెడ్డి, ధర్మేందర్ నాయక్, రాజన్న, ఉపేందర్ రెడ్డి, రాం, నర్సింగ్ రావు, జావీద్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్..
- ఏఎంహెచ్ఓ కు వినతి పత్రం..

నవతెలంగాణ - ధూల్ పేట్



శానిటేషన్ స్వీపింగ్ వర్క్ మహిళా కార్మికులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కష్ణ నాయక్ అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్-9 ఏఎంహెచ్ఓ శానిటేషన్ మెడికల్ అధికారి డాక్టర్ జ్యోతి బాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన, జోన్ కార్యదర్శి కిషన్‌లు మాట్లాడుతూ.. మహిళా కార్మికులపై సూపర్ వైజార్ ఆగడాలు అరికట్టాలన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగంలో సూపర్ వైజార్‌లు స్వీపింగ్ వర్కర్ పనిచేస్తున్న మహిళా కార్మికులను మానసికంగా, శారీరకంగా వేధింపులు గురిచేస్తున్నారని ఆరోపించారు. సూపర్ వైజార్ మాటలు వినకపోతే పని భారం ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని మహిళా కార్మికులు వాపోతున్నారన్నారు. వస్తున్న చాలి చాలని వారి వేతనాల నుంచి వారికి రూ.500లు, రూ. 1000లు ఇవ్వాలని డిమాండ్ చేస్తారనీ ఆరోపించారు. ఈ మధ్యకాలంలో అనేక సంఘటనలు జరిగినవని, ఆ సంఘటన జీహెచ్ఎంసీ అధికారుల దృష్టిలో ఉన్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం పై ఏఎంహెచ్ఓ సానుకూలంగా స్పందించారని, తమ పరిధిలో ఇలాంటి సంఘటనలు జరిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వినకపోతే ఉద్యోగుల సస్పెండ్ చేస్తామన్నారన్నారు. మహిళకు రక్షణ కోసం తమ వంతు కృషి చేస్తామనీ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శ్రీను, రవి, రాకెష్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు లెప్రసీ సర్వే బకాయిలు చెల్లించండి



- మేడ్చల్-మల్కాజిగిరి డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఈ నెల 2-15వ తేదీ లెప్రసీ సర్వే చేయాలని ఆశా వర్కర్లను ప్రభుత్వం నిర్దేశించిన క్రమంలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి టి.రఘు నాథస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శ ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ మూడేండ్లుగా ఆశా వర్కర్లకు లెప్రసీ పారితోషకాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ ఎల్డర్లీకేర్ ట్రెనింగ్ పారితోషకాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయనీ, వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించేంత వరకు, సర్వే మెటీరియల్ అందించేంత వరకు సర్వే చేయలేమని ఆశా వర్కర్లు డీఎంఅండ హెచ్‌ఓకు విన్నవించారు. ప్రభుత్వం ఇలాగే ఆశాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వారిని అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తుందనీ, ఈ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు లేప్రసీ సర్వే నిలిపేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, కీసర పీహెచ్‌సీ నాయకురాలు రాధా యాదమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ సరిత, మల్కాజిగిరి పీహెచ్‌సీ నాయకురాలు శోభ, శశికళ, రాజ్యలక్ష్మి, కుషాయిగూడ పీహెచ్‌సీ నాయకురాలు ప్రవీణ, లలిత, కవిత, జ్యోతి, బాలానగర్ ఆశా యూనియన్ నాయకురాలు అనిత, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతినెలా 1న వేతనాలు, వేతనాలలో
అక్రమ కోతలు వెంటనే ఆపాలి

- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)

నవతెలంగాణ-బంజారా హిల్స్

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం సోమవారం నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇస్తున్న వేతనాలలో ఫిక్స్ అలవెన్స్ రూపంలో చూపిస్తున్న రూ.1445 లను గ్రాస్ శాలరీలో కలపాలనీ, వేతనాలలో అక్రమంగా చేస్తున్న కోతలను వెంటనే ఆపాలన్నారు. కొత్తగా జాయిన్ అయిన కార్మికులకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇస్తూ.. పనిచేస్తున్న ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించక పోవడం మూలంగా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు ఇస్తున్న కేవలం కాంట్రాక్టు కార్మికులకు మాత్రం 7వ తేదీ వరకు చెల్లిస్తూ.. వివక్ష పాటిస్తున్నారని విమర్శించారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని తెలిపారు. సెమిస్కిల్డ్ పోస్టులకు అర్హత కలిగిన కాంట్రాక్ట్ కార్మికులకు వయసుతో సంబంధం లేకుండా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



లేనియెడల రాబోయే కాలంలో కార్మికులు ఆందోళన, పోరాటాల్లోకి వెళతారని హెచ్చరించారు. డబుల్ డ్యూటీ చేస్తే, ఒక్క డ్యూటీలూ ఎన్ని ఉపయోగం లేదనీ రానిరోజు నిర్దాక్షణ్యంగా రూ. 56 లు కట్ చేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడు జరగలేదనీ ఇదేంటని ప్రశ్నిస్తే కాంట్రాక్టుమనీ మేనేజ్‌మెంట్ తమకు ఇవ్వడం లేదు. కాబట్టి దాన్ని మీ వేతనాల్లో కోత విధించడం జరుగుతుందని సమాధానం చెప్పడం దీనిపై ఆస్పత్రి యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇ.నర్సింహులు, వెంకటేష్, యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

'అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లి మృతి'

- ఆ పిల్లి (అలియాస్ పొట్టి) మలమూత్ర విసర్జన టాయిలెట్ లోకి మాత్రమే వెళ్లడం విశేషం
- మన దేశంలో పిల్లల సగటు జీవిత కాలం 14 నుంచి 16 ఏండ్లు మాత్రమే
- అలాంటిది ఈ పిల్లి వయస్సు 21 ఏండ్లు జీవించి రికార్డు సృష్టించింది
- కుటుంబ సభ్యుల్లో ఒకరిగా పెంచుకున్న పొట్టి (పిల్లి) చనిపోవడంతో యజమాని దంపతులు జూలూరి శ్రీదేవి, పుండరీ చారి (విలేఖరి) కన్నీరుమున్నీరుగా విలపించారు





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లి (అలియాస్ పొట్టి) మృతి చెందింది. దీని వయస్సు 21 ఏండ్లు, మన దేశంలో పిల్లుల సగటు జీవిత కాలం 14 నుంచి 16 ఏండ్లు మాత్రమే ఉంది. కానీ ఈ పిల్లి (పొట్టి) 21 ఏండ్లు జీవించి రికార్డు నెల కొల్పింది. అంబర్ పేట్ డివిజన్, పటేల్ నగర్ రాజయ్య వీధిలో నివాస ముంటున్న యజమాని దంపతులు జూలూరి శ్రీదేవి, పుండరీ చారి (విలేఖరి) కుటుంబం ఈ పిల్లిని పెంచుకున్నారు. 2004 సెప్టెంబర్ 19న ఈ పిల్లి జన్మించిన పొట్టి ఇటీవలనే 20 ఏండ్లు పూర్తి చేసుకుని 21వ ఏటా అడుగు పెట్టింది. కుటుంబ సభ్యుల మధ్య పొట్టి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకుంది. ఈ పిల్లి మలమూత్ర విసర్జన టాయిలెట్‌లోకి మాత్రమే వెళ్లడం విశేషం. ఈ పొట్టి పాలతో పాటు చేపలు, చికెన్, ఐస్ క్రీమ్ ఇష్టంగా తినేది. మాంసం దుకాణం నుంచి రోజు సాయంత్రం యజమాని జూలూరి పుండరీ చారి పొట్టికి ఏదో ఒకటి తీసుకెళ్లి పెట్టాలి, ఉట్టి చేతులతో వెళితే గోల గోల చేసేది. 2011 జూన్ 9వ తేదీ అర్ధరాత్రి ఇంటి యాజమానురాలు శ్రీదేవికి చాతిలో నొప్పితో అవస్థలు పడుతుండగా పక్కనే ఉన్న ఈ పిల్లి గమనించి గట్టిగా అరుస్తూ కుటుంబ సభ్యులను నిద్ర లేపింది. దీంతో శ్రీదేవిని 108 సర్వీస్ ద్వారా హైదర్ గూడలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెపోటుగా వైద్యులు నిర్ధారించి స్టంట్ వేశారు. అలా యజమాని ప్రాణాలు కాపాడింది ఈ పొట్టి, ఎంతో అల్లారు ముద్దుగా పెరిగిన ఈ పొట్టి తీవ్ర అస్వస్థకు గురై సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు చనిపోవడంతో ప్రాణంగా పెంచుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బంధువులు పొట్టి పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, అంత్యక్రియలు నిర్వహించారు.

25 వసంతాల సిల్వర్ జూబ్లీని
పూర్తి చేసుకున్న రెయిన్‌బో ఆస్పత్రి..



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఎందరికో కడుపుకోత, మరెందరో జీవితాలలో వెలుగునిచ్చి ఊహ తెలియని పసిప్రాణాలను కాపాడిన చరిత్ర సొంతం చేసుకున్న రెయిబ్బో ఆస్పత్రి. అప్పుడప్పుడు వైద్యులు వారి శ్రమ ఫలితంలో నిస్పృహ, నిరాశకు గురై సమాజంలో తమ పాత్రను విస్మరించేలా విమర్శలు వచ్చినా.. వెనక్కు తగ్గకుండా అండగా మేమున్నాం,"గో హెడ్" అంటూ వెన్నుదన్నుగా నిలిచే ఓ బృందం ఏర్పాటు చేసి నమ్మకమే బలంగా నిస్వార్థంగా సేవలందిస్తుంది. ప్రాణాలు కాపాడడమే మన పని మన బాధ్యత అంటూ గుర్తు చేస్తూ సంస్థ పరమైన అన్ని రకాల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పరికరాలను అందిస్తుంది. ప్రోత్సహించే సంస్థలలో ఒకటిగా నిలిచింది. 4 వేల మంది ఉద్యోగులకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్ వారు హైదరాబాద్ నగరంలో సిల్వర్ జూబ్లీ వేడులకనూ సోమవారం జూబ్లీహిల్స్లో ఘనంగా నిర్వహించుకుంది. ఆస్పత్రి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ కంచర్ల రమేష్ రెడ్డి, క్లినికల్ డైరెక్టర్ ఆబ్స్టెట్రిక్స్ గైనకాలజీ బ్రైట్ రైట్ బై రైన్బో హాస్పిటల్ డాక్టర్ ప్రణతి రెడి, ఇన్టెంటివ్ కేర్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చీరలతో కలిసి సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 15 సంవత్సరాలు సుదీర్ఘ కాలంగా సేవలందించిన 4 వేల మందిలో 37 మంది వైద్యులు, ఉద్యోగులు, సిబ్బందికి గౌరవ పరమైన జ్ఞాపికను అందజేస్తూ.. సత్కరించుకున్నారు. అనంతరం ఉత్సాహభరితమైన రాంప్ వ్యాకులో డాక్టర్లు అదరగొట్టగా, ఉద్యోగులు,సిబ్బంది సంస్కృతిక సాంప్రదాయక కళానృత్యాలు చేస్తూ, ఆనందాన్ని వ్యక్తపరుస్తూ రెయిన్బో అంతం అనే స్పెషల్ ఆల్బమ్ను ఆలపిస్తూ ఆవిష్కరించుకున్నారు.

ప్రజావాణికి 72 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 72 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్లను సంఖ్యను వివరిస్తూ, ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం




- వంద మంది వైద్య విద్యార్థులకు పట్టాల అందజేత
- డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి- బంగారు పతకం సిద్ధాంత్ బర్మేచాకు ప్రదానం

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్

అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం జూబ్లీహిల్స్‌లోని ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆసియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) చైర్మన్, వ్యవస్థాపకుడు, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా వైద్య విద్యార్థులకు పట్టాల పంపిణీ చేశారు. వంద మంది 2018 బ్యాచ్ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి, డీన్ డాక్టర్ కే మనోహర్, ఏఐఎంఎస్ఆర్ సీ ఓ ఓ అపర్ణ రెడ్డి హాజరయ్యారు. అపోలో మెడికల్ కాలేజీ 2012లో ప్రారంభమైంది. ఈ మెడికల్ కాలేజీలో ఇప్పటి వరకు 700 మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులయ్యారు. వీరిలో 90 శాతానికి పైగా విద్యార్థులు దేశంలోని వివిధ వైద్య కళాశాలలలో, విదేశాలలో పీజీ సీట్లు సాధించారు. ప్రతిష్ఠాత్మక చైర్మెన్ మెడల్ డాక్టర్ ప్రతాప్‌సీ రెడ్డి బంగారు పతకం ఉత్తమ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి సిద్దాంత్ బర్మేచాకు అందించారు. ఈ అవార్డు సీనియర్ ఫిజిషియన్ లేటు డాక్టర్ కేవీఆర్ ప్రసాద్ స్మారకార్థం ఏర్పాటు చేశారు. అపోలో మెడికల్ కాలేజీ హైదరాబాద్, చిత్తూరులో రెండు మెడికల్ క్యాంపస్‌లతో పని చేస్తుంది. హైదరాబాద్ క్యాంపస్ మే 2017లో ఎంసీఐ నుంచి యూజీ గుర్తింపు పొందింది. 53 సీట్లతో 18 విభాగాల్లో పీజీ మెడికల్ కోర్సులను స్థాపించే ప్రక్రియలో ఉంది. చిత్తూరులోని మెడికల్ కాలేజీ క్యాంపస్ తన 8వ బ్యాచ్‌లో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను ఆగస్టు 2024లో చేర్చుకుంది. అపోలో గ్రూప్ చిత్తూరు నగరంలో నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తుంది. ఇది చిత్తూరుతో పాటు దేశంలోని సామాన్య ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాలను అందించనుంది.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎడెల్లి భాను ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జి సాయిబాబా, బాలరాజ్ గౌడ్, నల్లల కిషోర్, సత్యనారాయణ, ఓ వెంకటేష్ చౌదరి, తదితర నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట



'అంబేద్కర్ జీవితం- ఆశయం-విజయాలు'పై స్మారకోపన్యాసం'

- అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ డా.కె.లింగయ్య

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ సాయంత్రం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ వేదికగా 'అంబేద్కర్ జీవితం-ఆశయం-విజయాలు' అనే అంశంపై అంబేద్కర్ స్మారకోపన్యాసం-39' నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మెన్ డా.కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషనర్, తొలి మాజీ చైర్మెన్ జస్టిస్ జి.చంద్రయ్య స్మారకోపన్యాసం ఉంటుందన్నారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను గుర్తించి ప్రతి ఏడాది ఆయన వర్ధంతి సందర్భంగా ఈ స్మారకోపన్యాసాలను నిర్వహిస్తున్నామని, ఇప్పటికి 38 స్మారకోపన్యాసాలు నిర్వహించినట్టు తెలిపారు. దీంతో 39వ స్మారకోపన్యాసమని వారు వివరించారు. ఈ కార్యక్రమానికి అంబేద్కరిస్టులు, బుద్ధిస్టులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ -అంబర్‌పేట

ఆశావర్కర్లకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

- లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించాలి
- కోఠి కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆశా వర్కర్లకులకు లెప్రసి, ఫల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి అన్నారు. సోమవారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసి సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు చెప్పున్నారని. వెంటనే లెప్రసీ సర్వే కోసం ట్రెనింగ్ లు కూడా ప్రారంభించారని.. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2023లో సగం జిల్లాలకు, 2024లో మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆశాలు చేసిన లెప్రసి డబ్బులు, 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశాలకు చెల్లించలేదని మండిపడ్డారు. ఈ అంశం పైన కమిషనర్ ఆఫీస్ లో సంబంధిత అధికారులను తమ యూనియన్ ఆధ్వర్యంలో కలిసినప్పుడు లెప్రసి 2 సంవత్సరాల సర్వే డబ్బులు మేము రిలీజ్ చేసి చాలా కాలమైందని, సర్వేకు ముందే ఈ బడ్జెట్ తాము రిలీజ్ చేస్తున్నామని తెలియజేస్తూ తమకు బడ్జెట్ వివరాలతో కూడిన సంబంధిత ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందజేశారని గుర్తు చేశారు. ఈ ఆర్డర్ కాపీలు తీసుకొని అన్ని జిల్లాల్లో మా నాయకత్వం జిల్లా డీఎంహెచ్ఓ అధికారులను కలిసి పెండింగ్ లెప్రసి సర్వే డబ్బులు చెల్లించాలని కోరామని అన్నారు. దీని పై జిల్లా అధికారులు స్పందిస్తూ తమకు పై నుండి డబ్బులు రాలేదని, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చినంత మాత్రాన డబ్బులు ఇచ్చినట్టు కాదని అంటున్నారన్నారు. ఈ అంశాన్ని రాష్ట్రస్థాయిలో సంబంధిత అధికారులకు తెలియజేశామని తెలిపారు. రాష్ట్ర అధికారులు స్పందిస్తూ జిల్లా అధికారులు చెబుతున్నది. సరి కాదని, తాము పంపించింది వాస్తవమని అంటున్నారని. ఈ రెండింటి మధ్య రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. పైగా రెండు సంవత్సరాల నుంచి చేసిన లెప్రసి సర్వే 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాక ఆశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తూ, ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, పెండింగ్ బిల్లులు చెల్లించి ఆశాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. నేడు ఆశా డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ముందు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. 4వ తేదీన కలెక్టర్ ల కార్యాలయాల ముందు ధర్నాలు చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి యాదమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేష్, రాష్ట్ర నాయకురాలు ఎం మీనా, సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ జిల్లా అధ్యక్షులు జె కుమారస్వామి. సెక్రటరీ డి భాగ్యలక్ష్మి పెద్ద ఎత్తున ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకుల ఆహ్వానం

నవతెలంగాణ - ధూల్‌పేట్

2024-25 సంవత్సరానికిగాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో స్టాటిస్టిక్స్ విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపక నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తు, అర్హతల ఒరిజినల్స్, ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్ 4వ తేదీ సంబంధిత శాఖలో ఇంటర్వ్యూకి హాజరు కావాలన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, పిహెచ్ డి, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతోపాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఇతర వివరాల కోసం డి.శ్రవణ్ కుమార్ 98482 74530ని సంప్రదించాలని తెలిపారు.

అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.ఇమ్మాన్యుయేల్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



అబిడ్స్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్‌గా ఎస్ ఇమ్మాన్యుయేల్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆయన చాంబర్ లో మాట్లాడుతూ.. అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నటి శోభిత మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

నవతెలంగాణ - ధూల్ పేట్

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కన్నడ సినీ, టీవి నటి శోభిత శివన్న (32) మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులు ఆమె స్వస్థలమైన బెంగుళూరుకు తీసుకువెళ్లారు. ఫోరెన్సిక్ వైద్యులు యాదయ్య నేతృత్వంలో శవ పరీక్ష నిర్వహించారు. కొండాపూర్ శ్రీ రాంనగర్ కాలనీలోని సీ బ్లాకులో శోభిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మరణవార్త తెలిసిన వెంటనే బెంగుళూరు నుంచి ఆమె ముగ్గురు అక్కలు తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యులు ఉస్మానియా మార్చురీకి చేరుకున్నారు. తుక్కుగూడలోని భర్త సుధీర్‌రెడ్డి, మామ నాయిని బుచ్చిరెడ్డి, చింతల వెంకటరెడ్డి ఇతర కుటుంబ సభ్యులు మార్చురీకి చేరుకున్నారు. తెలంగాణ సాంప్రదాయం ప్రకారం నగరంలోనే శోభిత మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని నాయిని బుచ్చిరెడ్డి శోభిత కుటుంబీకులతో చర్చించారు. అయితే శోభిత పుట్టి పెరిగింది బెంగుళూరులోనే అక్కడికే తీసుకువెళ్తామని ఆమె కుటుంబీకులు చెప్పడంతో పరస్పర అంగీకారంతో శోభిత మృతదేహాన్ని బెంగుళూరుకు తీసుకువెళ్లారు. బుచ్చిరెడ్డి, చింతల వెంకటరెడ్డిలు విలేకరులతో మాట్లాడుతూ.. శోభిత సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిందనీ అందరితోనూ కలగొలు పుగా ఉండేదని గుర్తు చేశారు. భక్తి ఎక్కువగా ఉండేదనీ పండగల సమయం లో ఉపవాసదీక్షలు, భక్తి ఎక్కువగా ఉండేదన్నారు. సుధీర్‌రెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నారని, 19నెలల క్రితమే మ్యాట్రిమోనీ ద్వారా పరిచయమయ్యారని చెప్పారు. రెండు కుటుంబాలు పరస్పర అంగీకారంతో పెండ్లి చేశామని తెలియజేశారు. దంపతులు అన్యోన్యంగా ఉండేవారని, ఇటీవలే గోవాకు వెళ్లి వచ్చారని తెలిపారు. శోభిత తమ కుటుంబం నుంచి దూరమ వ్వడం చాలా బాధగా ఉందన్నారు. తమ కుమారుడు సుధీర్ రెడ్డి, భార్య ఆత్మహత్య చేసుకోవడంతో, ఇంకా షాక్ లోనే ఉన్నాడని, అతను కోలుకోవడానికి ఇంకా కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వర్గీకరణ అమలయ్యేంతవరకు నిరంతరం పోరాటం

- మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్

నవతెలంగాణ - ముషీరాబాద్

ఏబీసీడీ వర్గీకరణ అమలయ్యేంతవరకు నిరంతరం పోరాటం చేయాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగల రాష్ట్రస్థాయి విస్తత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐ ఆర్ టీ ఎస్ అప్పికట్ల భరత్ భూషణ్, బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి పాల్గొని మాట్లాడారు. మన జాతి అన్ని రంగాలలో అభివద్ధి చెందే విధంగా క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో జాతిని బలోపేతం చేయడం కోసం భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మన తరం కోసం కాకపోయినా మనం ముందు తరాల కోసమైనా పార్టీలకు సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదకు వచ్చి జాతీయ అభివృద్ధి కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. గూడు లేని పేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టే వరకు కృషి చేద్దామన్నారు. విద్యా హక్కు చట్టం అమలు చేసి ప్రతి కార్పొరేట్ స్కూల్లో కాలేజీలో 25 శాతం ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య వైద్యం అందించాలన్నారు. ప్రయివేటు రంగ కంపెనీల్లో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి, రిటైర్డ్ ఓయూ ప్రొఫెసర్ మత్తయ్య, విజయ్ పాల్, ముత్యాల మురళీధర్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు వషాపాక నరసింహ, అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను నరసయ్య సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షులు గ్యార శ్రీనివాస్, వికేసి పార్టీ అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, జగిలి భాస్కర్ మాదిగ, తదితర నాయకులు పాల్గొన్నారు



పదవీ విరమణ శుభాకాంక్షలు.

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

బీఆర్ఎస్ పార్టీలో సుదీర్ఘ కాలం పాటు ప్రధానకార్యదర్శి గా సుదీర్ఘ కాలం పాటు తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా పనిచేసి పదవీ విరమణ చేసిన మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జి ఆర్ వి మహేందర్ కుమార్ పూల బొకే అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. యాదగిరి వాడపల్లి, మాధవ్ మేరు, డాక్టర్ సురేష్, డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత సేవలందించిన మహనీయుడు మర్రి చెన్నారెడ్డి

- రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ - ముషీరాబాద్



మర్రి చెన్నారెడ్డి ఉన్నతమైన పదవుల్లో అత్యున్నతమైన సేవలు అందించిన మహనీయుడని రాష్ట్ర గవర్నర్ లు బిష్ణుదేవ్ వర్మ , హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయలు అన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్ రావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు, మాజీ మంత్రులు సమర సింహా రెడ్డి, సి.కష్ణాయాదవ్, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రా రావులతో కలిసి వారు సోమవారం ఇందిరాపార్క్ మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, గవర్నర్‌గా అత్యుత్తమ సేవలందించిన మహనీయుడని కొనియాడారు. చిన్నప్పటినుండే చదువులలో రాణించి డాక్టరు అయ్యారని గుర్తు చేశారు. 1990లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి ప్రజలకు ఎంతో సేవలను అందించారన్నారు. అంతేకాకుండా క్రీడారంగంలో కూడా తన దైన శైలిని ప్రదర్శించేవారని తెలిపారు. ఆయన సామాజిక న్యాయం, సమానమైన అభివద్ధి కోసం పోరాడారని తెలిపారు. అలాగే ఆయన ఒక గొప్ప రాజనీతిజ్ఞుడు అని, ఆయన ప్రగతిశీల విధానాలు రాష్ట్రంపై చెరగని ముద్ర వేసాయని కొనియాడారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మట్లాడుతూ చెన్నారెడ్డి వ్యక్తి కాదు, ఆయన మహా సంస్థ అన్నారు. యవ్వనంలోనే రాష్ట్ర కాన్సిట్యుషన్ సభ్యుడిగా అసెంబ్లీగా ఉన్నారని.. రెండు సార్లు ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మహా వ్యక్తి అని కొనియాడారు. చెన్నారెడ్డి ఉపన్యాసం తాను మరవలేనిదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్నా ఏమాత్రం కూడా భయపడలేదన్నారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తుకు కారణం మర్రి చెన్నా రెడ్డి అని గుర్తు చేశారు. పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు దీక్షలు చేస్తుంటే సంబరాలు చేస్తారా..?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ - ముషీరాబాద్



ఒకవైపు విద్యార్థులు సమస్యల తో సతమతమవుతు దీక్షలు ధర్నాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలు చేస్తోందనిబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. 16లక్షల 75వేలమంది విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన విద్యానగర్ బిసి భవన్ లో విద్యార్థులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇంజనీరింగ్/పీజీ/డిగ్రీ తదితర కాలేజీ కోర్సులు చదువుతున్న 16 లక్షల 75 వేలమంది బీసీ/ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు రూ.4వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల మాట్లాడుతూ విద్యార్థులు గోస పడుతుంటే ప్రభుత్వ మాత్రం విజయోత్సవాలు చేసుకోవడం విడ్డూరం అన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు వేలకోట్లు చెల్లిస్తున్నారు కానీ విద్యార్థుల స్కాలర్షిప్ బిల్లులు వందల కోట్లు కూడా చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి స్కాలర్ షిప్ లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. గత నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లమీద వచ్చి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది... కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదని తెలిపారు. తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. గతంలో స్కాలర్ షిప్ లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పున్హ ప్రారంభం చేసాము. కానీ ప్రభుత్వానికి బుద్ధి రాలేదన్నారు. ఇప్పుడు అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు కలిపి నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో , నీల వెంకటేష్, సి. రాజేందర్, నందాగోపాల్, అనంతయ్య, పి. సుధాకర్, ఉదయ్ నేత, మధుసూదన్ రావు, రవి కుమార్ యాదవ్, పథ్వీ గౌడ్, అరవింద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి నిరంతరం కృషి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ - అంబర్‌పేట

పేదల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట ఎమ్మెల్యే క్యాబ్ కార్యాలయంలో వివిధ అనారోగ్యాల బారిన వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందిన పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంక్షేమానికి వ్యక్తిగతంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులుసురేష్ గౌడ్, బుచ్చిరెడ్డి,అనిల్ కుమార్, సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న..

నవతెలంగాణ - ధూల్ పేట్



ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చెప్పట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిర్యాదులను సంబంధిత విభాగాలతో తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జోన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో స్థానికంగా నెలకొన్న సమస్యలను తమ దష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటావన్నారు. జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీ పి మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఎ. యం సీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు ఉంటుంది

- సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి..

నవతెలంగాణ - ధూల్ పేట్



అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సంస్థలో, ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ చైర్మెన్ ఎన్.గిరిధర్ రెడ్డి అన్నారు. సెట్విన్ సంస్థలో వివిధ హోదాలలో పనిచేసి జనరల్ మేనేజర్ గా పదవీ విరమణ పొందిన మహమ్మద్ అబ్దుల్ మోతీజ్ పదవి విరమణ సభ జరిగింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ ఎకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, నవీన్ కుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో చేసిన మంచి పనులు పదవి విరమణ చేసిన తర్వాత కూడా తప్పక గుర్తుండిపోతాయన్నారు.

7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్

- గోడ పత్రికను ఆవిష్కరించిన తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు తీవ్రతరం చేస్తామని తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ) హెచ్చరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లిన వాటి పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 7న తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ నిర్వహిస్తుందని వెల్లడించారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ నేతలు వి.ప్రవీణ్ (టీయుసీఐ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), మీర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), ఎస్.రామకృష్ణ (బీఆర్ టీయు), బి.తిరుమలేష్ గౌడ్, శ్రీనివాస్, శంకర్ రెడ్డి (క్యాబ్స్ యూనియన్)లతో కలిసి బి.వెంకటేశం రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో డ్రైవరుకు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని, గ్రేటర్ హైదరాబాద్ 20 వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న సుందరయ్య పార్క్ నుండి ఇందిరా పార్క్ వరకు లక్ష మంది రవాణా రంగ కార్మికులతో మహా ప్రదర్శన, అనంతరం ఇందిరా పార్క్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జేఏసీ నేతలు ఏ.బిక్షపతి యాదవ్, సిహెచ్.జంగయ్య, ఏం.కష్ణ, లింగం గౌడ్, ఎండి.జాకిర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరామ్‌ఘర్ - జూపార్క్ ఫ్లై ఓవర్‌కు నెహ్రూ పేరు పెట్టాలి

- కాంగ్రెస్ బహదూర్ పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్

నవతెలంగాణ-ధూల్ పేట్



ఆరామ్ ఘర్ - జూపార్క్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పేరుని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఫ్లైఓవర్ గా నామకరణ చెయ్యాలని కాంగ్రెస్ బహదూర్ పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంలో " తెలంగాణ రైసింగ్" పేరుతో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్నదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వేల కోట్ల అభివద్ధి పనులను శంకుస్థాపన చేస్తున్నారన్నారు. అందులో బాగంగా ప్రారంభించబోయే బెంగళూర్ ప్రధాన రహదారి అయిన బహదూర్ పురా నియోజకవర్గం నెహ్రూ జూలోజికల్ పార్క్ వద్ద నిర్మించిన ఆరాంఘర్ టు జూ పార్క్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పేరును పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరుని పెట్టాలని కోరామని తెలిపారు. అక్కడే ఉన్న జంతు ప్రదర్శనశాల పేరు సహితం నెహ్రూ జూ లాజికల్ పార్క్‌గా నెహ్రూ పేరు మీదనే ఉన్నదని గుర్తు చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాశారని తెలిపారు.



వికలాంగుల జీవితాల్లో మార్పు కోసం



'ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్నా' అన్నారు మదర్‌థెరిస్సా. అలా ఆమె చేతులు పదహారేండ్లలో వెయ్యి మంది వికలాంగులకు సాయం చేశాయి. ఆ సాయం వారి జీవితాన్నే మార్చివేసింది. ఆమే పుష్పా. వికలాంగులకు చేయూతనిస్తే వారి ఆత్మగౌరవంతో బతుకుతారు. అలాంటి గౌరవమైన జీవితాన్ని వారు అనుభవించేందుకు పరీక్షలు రాసి సహకరిస్తున్నారు. ఈ రోజు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆమె స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...

2007లో బెంగళూరులో రోడ్డు దాటించాలని పుష్పను ఓ అంధుడు అడిగారు. రోడ్డుకు అవతలి వైపుకు చేరుకున్న తర్వాత ఆమెను 'నా ఫ్రెండ్‌కు పరీక్ష రాయడంలో సాయం చేయగలరా' అని మరో సాయం అడిగారు. అది ఆమె జీవితాన్నే మార్చేసింది. అయితే పరీక్ష రాసే రోజు వచ్చినప్పుడు ఆమె ఆందోళన చెందారు. ఎందుకంటే అంధులకు సాయంచేసే 'స్క్రైబ్'గా ఆమె శిక్షణ తీసుకోలేదు. ఆ పరీక్ష ఎలా రాస్తారో ఆమెకు పెద్దగా అవగాహన లేదు. 'ఆ మూడు గంటలపాటు కొంత ఆందోళన చెందాను. ఆమె కాస్త నెమ్మదిగా సమాధానాలు చెప్పేవారు. ప్రశ్నను మళ్లీ మళ్లీ చదవాలని ఆమె అడిగేవారు' అని పుష్ప పంచుకున్నారు.

16 ఏండ్లలో వెయ్యికి పైగా

తర్వాత 19 ఏండ్ల హేమ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన సాయం పుష్ప చేయగలిగారు. ఆ తర్వాత అంధుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థల నుంచి ఆమెకు అభ్యర్థనలు వెల్లువెత్తాయి. గత 16 ఏండ్లలో ఆమె వెయ్యికి పైగా ఇలాంటి పరీక్షలు రాశారు. వీటి కోసం ఆమె ఎలాంటి డబ్బులూ తీసుకోలేదు. స్కూలు, యూనివర్శిటీ పరీక్షలతోపాటు ప్రవేశ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షల్లోనూ పుష్ప సాయం చేస్తున్నారు.



'పరీక్ష కేంద్రాలు నాకు రెండో ఇల్లులా మారిపోయాయి. ఇది నాకు అలవాటుగా మారిపోయింది. ఇప్పుడు ఎలాంటి ఒత్తిడీ లేదు' అంటున్నారు. చరిత్ర నుంచి స్టాటిస్టిక్స్ వరకు చాలా సబ్జెక్టులు నేర్చుకోవడానికి ఈ పరీక్షలే తనకు సాయం చేశాయని చెబుతున్నారు. అంధులతోపాటు సెరెబ్రల్ పాల్సీ, డౌన్స్ సిండ్రోమ్, ఆటిజం, డిస్లెక్సియా, రోడ్డు ప్రమాదాల వల్ల పరీక్షలు రాయలేనివారికి కూడా ఆమె సహకరిస్తున్నారు.

ఒక్కరికే 47 పరీక్షలు

మొదట్లో సెరెబ్రల్ పాల్సీ బాధితులు చెప్పేవి అర్థం చేసుకోవడంలో ఆమె ఇబ్బంది పడేవారు. 'వారి విషయంలో కొంచెం ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సి వస్తుంది. పెదాల కదలికలు చూసి వారు ఏం చెబుతున్నారో అర్థం చేసుకోవాలి' అని పంచుకున్నారు. మొదట్లో కొంత తడబడినప్పటికీ వీల్‌చైర్ సాయంతో కదిలే కార్తీక్ కోసం ఆమె చాలా పరీక్షలు రాశారు. 'స్కూల్‌లో చివరి పరీక్షలతో మొదలుపెట్టి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో గ్రాడ్యుయేషన్‌లో అన్ని పేపర్లూ అంటే మొత్తంగా 47 పరీక్షలు తన కోసం రాశాను' అని పుష్ప చెప్పారు. 'స్కూల్ పరీక్షల సమయంలో వేరే వారికి పరీక్షలు రాయడానికి పుష్ప వచ్చారు. నాకు వేరొకరు సాయం చేస్తున్నారు. అయితే ఆయన మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో పుష్ప తన పని పూర్తిచేసుకొని నాకు సాయం చేయడానికి వచ్చారు. మేం చేతితో రాయలేం. కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం కష్టం. ఎందుకంటే మా చేతులు చాలా నెమ్మదిగా కదులుతాయి. ఇంత సాయం చేస్తున్న ఆమెకు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అని 25 ఏండ్ల కార్తీక్ అన్నారు. ఏండ్లపాటు కలిసి పనిచేయడంతో వీరిద్దరి మధ్య మంచి అనుబంధం కూడా పెనవేసుకుంది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన కార్తీక్ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు.

జీవితాన్ని మార్చిన సాయం

'నేను చాలా మంది విద్యార్థులకు చాలా పరీక్షలు రాశాను. ఒక్కొక్కరిది ఒక్కో కథ' అంటారు ఆమె. మార్చి మూడో వారంలో 19 ఏండ్ల భూమికా వాల్మీకికి యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలో పుష్ప సాయం చేశారు. భూమికకు దృష్టిలోపం ఉంది. దీంతో అక్షరాలను వాయిస్‌లోకి మార్చే టూల్స్, యాప్స్ సాయంతో ఆమె చదువుకున్నారు. అయితే పరీక్షల్లో ఇలాంటి టూల్స్ ఉపయోగించడానికి వీల్లేదు. 'పుష్ప పరీక్ష రాస్తేనే జీవితంలో నేను ముందుకు వెళ్లగలను. ఆమెకు సహనం ఎక్కువ. అన్ని సమాధానాలు పూర్తయ్యేవరకు మాతోనే కూర్చుంటారు. అసలు విసుక్కోరు. రాసేముందుగా సమాధానాన్ని నాకు ఒకసారి చదివి వినిపిస్తారు' అని భూమిక వివరించారు.

వారు తప్పు చెప్పినా అలాగే రాయాలి

పుష్ప దగ్గరకు సాయం కోసం వచ్చేవారిలో చాలా మంది యూనివర్సిటీలో ప్రవేశం కోసం బాగా కష్టపడుతుంటారు. వారిని చూస్తే జాలి వేసినప్పటికీ, నిజాయితీతోనే తాను ముందుకు వెళ్తానని ఆమె చెప్పారు. 'వారు చెప్పింది రాయడం నా విధి. తప్పు సమాధానం చెప్పినప్పుడు లేదా వాక్య నిర్మాణ దోషాలు చెప్పినప్పుడు నేను అలానే రాయాల్సి ఉంటుంది. ఎందుకంటే అక్కడ నేను జోక్యం చేసుకోకూడదు. కొన్నిసార్లు పిల్లలు ఇంగ్లీష్ అర్థం చేసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. వారికి నేను వారి మాతృభాషలో వివరించేందుకు ప్రయత్నిస్తుంటారు. అది మాత్రమే నేను చేయగలిగే సాయం' అని ఆమె అన్నారు. విద్యార్థి కోసం ఒక పరీక్ష నిర్వాహకుడు ఉంటారు. కెమెరాలు కూడా ఏర్పాటుచేస్తారు. యూనివర్సిటీలో అదే సబ్జెక్టు చదువుకున్న వారిని పరీక్షల్లో సాయం చేయడానికి అనుమతించరు.

పేద కుటుంబం నుంచి

పుష్ప కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో పుట్టారు. వారిది నిరు పేద కుటుంబం. తండ్రి ఓ ప్రమాదానికి గురై పని చేయలేకపోయేవారు. పుష్పకు ఓ తమ్ముడు ఉన్నాడు. తల్లే కష్టపడి వీరిద్దరినీ పెంచింది. 'ఒకానొక సమయంలో ఫీజులు కట్టలేక బడి మానేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఫీజు కట్టి సాయం చేశారు. అందుకే నేను కూడా ఈ రూపంలో సేవ చేసి ఆ కృతజ్ఞతను తీర్చుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. స్కూల్ చదువు పూర్తయిన తర్వాత పుష్ప, ఆమె సోదరుడు కొరియర్ కంపెనీల్లో ఉద్యోగానికి చేరారు. దూర విద్య ద్వారానే పుష్ప డిగ్రీ పూర్తిచేశారు. కంప్యూటర్ సైన్స్‌లో ఆమెకు డిప్లొమా కూడా ఉంది.

వరుస సమస్యలు

ఇటీవల కాలంలో పుష్ప చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 2018లో తండ్రి చనిపోయారు. 2020లో కోవిడ్-19 మహమ్మారి వల్ల తమ్ముడిని కూడా ఆమె కోల్పోయారు. ఏడాది తర్వాత ఆమె చేస్తున్న ఉద్యోగం పోయింది. ఆ తర్వాత ఊహించని విధంగా తల్లి కూడా మరణించారు. 'మే 2021లో అమ్మ చనిపోయారు. కొన్ని నెలల తర్వాత, అంటే ఆగస్టులో నేను 32 పరీక్షలు రాశాను. ఒక్కోసారి రోజుకు రెండు పరీక్షలు కూడా రాసేదాన్ని. నా కష్టాలు, బాధలు మరిచిపోవడానికి ఈ పరీక్షల్లో చేసిన సాయం చికిత్సలా పనిచేస్తుంది' అని ఆమె తెలిపారు.

ఐదు భాషల విద్యార్థులకు సాయం

వికలాంగులకు ఇలా పరీక్షలు రాయడంతో పుష్పకు గుర్తింపు కూడా వచ్చింది. మహిళలకు సాధికారత కల్పిస్తున్నందుకు నేషనల్ అవార్డును ఆమె అందుకున్నారు. '2018 మార్చి 8న అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డును నేను తీసుకున్నాను' అని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఆమె ఓ స్టార్టప్ కంపెనీలో పనిచేస్తున్నారు. కార్పొరేట్ ఈవెంట్లలో మోటివేషన్ స్పీచ్‌లు కూడా ఇస్తుంటారు. ఇప్పటికీ ఆమె పరీక్షలు రాయలేని వారికి సాయం చేస్తూనే ఉన్నారు. తమిళం, కన్నడ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ.. ఇలా ఐదు భాషల విద్యార్థులకు ఆమె సాయం చేస్తున్నారు. 'నా సమయం, శక్తిని వారి కోసం కేటాయిస్తుంటాను. నేను ఒకరి కోసం పరీక్ష రాస్తున్నానంటే, వారి జీవితం మారుతుంది' అని ఆమె సంతోషంగా చెబుతున్నారు. ■



మోడీ మౌనం వీడాలి

(మొదటిపేజీ తరువాయి)

20 నిమిషాల పాటు మాత్రమే సభ కొనసాగింది. రాజ్యసభలో గత సోమవారం 33 నిమిషాలు కార్యకలాపాలు జరుగగా, బుధవారం 13 నిమిషాలు, గురువారం 16 నిమిషాలు, శుక్రవారం 13 నిమిషాల పాటే సభ జరిగింది.

చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోంది : ప్రతిపక్షాలు

అమెరికా కోర్టులో గౌతమ్ అదానీపై చార్జిషీట్, సంభాల్ హింసతో సహా పలు సమస్యలపై పార్లమెంటులో చర్చలు జరగకుండా ప్రభుత్వం తప్పించుకుంటుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అదానీ, మణిపూర్, సంభాల్, అజ్మీర్‌లపై తక్షణ చర్చకు ఇండియా బ్లాక్ పార్టీలు నోటీసులు ఇచ్చాయని, కానీ మోడీ ప్రభుత్వానికి పార్లమెంటు పని చేయడం ఇష్టం లేదని ఆరోపణలు చేశాయి. అందుకే చర్చకు అంగీకరించటం లేదని పేర్కొన్నాయి. "ఈ పరిస్థితి నిజంగా అ సాధారణమైనది. ప్రతిపక్షం చర్చను కోరుతోంది. కానీ ప్రభుత్వం దాని నుంచి పారిపోతోంది" అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ అన్నారు. నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంపై రెండ్రోజుల పాటు చర్చ జరగాలని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీలు కూడా కోరుతున్నాయని ఆయన అన్నారు. ఈ చర్చకు సంబంధించిన తేదీలను మోడీ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదని పేర్కొన్నారు.

పార్లమెంటరీ ప్రతిష్టంభన ముగింపునకు అంగీకారం

(మొదటిపేజీ తరువాయి)

ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలు నిరంతరం వాయిదా పడుతూ వస్తోన్నాయి. మంగళవారం నుంచి లోక్‌సభ, రాజ్యసభలు సజావుగా సాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చినట్టు తెలిసింది. పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కిరెణ్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 13, 14 తేదీల్లో లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను, డిసెంబర్ 16, 17 తేదీల్లో రాజ్యసభలో చర్చ జరుగుతుందని చెప్పారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నుంచి పార్లమెంట్ సజావుగా సాగుతుందని రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

వ్యక్తిగత కారణాలతో ఎస్ఐ ఆత్మహత్య ?

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. కాగా, ఆయన ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆయనతో పాటు యువతి ఉన్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో ఎస్ఐ మృతికి యువతి కారణం అయి ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. రిసార్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి రేగొండ మండలం వెంకటరాజపల్లి గ్రామానికి చెందిన ఎస్ఐ హరీశ్.. ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఆదివారం రాత్రి పూసూరు గ్రామం సమీపంలోని గోదావరి బ్రిడ్జి వద్ద ఉన్న ఫెరిడో రిసార్ట్స్‌లో ఆయన రూమ్ తీసుకొని ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన రూమ్ నుంచి గన్ పేలిన శబ్దం రావడంతో రిసార్ట్ సిబ్బంది.. మాస్టర్ కీతో ఎస్ఐ రూమ్ తెరిచి చూడగా.. బెడ్‌పై విగతజీవిగా ఎస్ఐ ఉండటాన్ని గుర్తించారు. దాంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. మృతుని అన్న కుమార్ వచ్చేవరకు తరలించొద్దని అంబులెన్స్ వద్ద బైటాయించారు. వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్ఐ తిరుపతి.. కుటుంబ సభ్యులకు సర్ది చెప్పి మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్పీ శబరిష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రుద్ర హరీష్ (28) వ్యక్తిగత కారణాలతో సర్వీస్ రివర్‌తో సూసైడ్ చేసుకున్నారని ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలిపారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించామని, త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. కాగా, రిసార్ట్స్ రూమ్‌లో ఆయనతోపాటు ఓ యువతి ఉన్నట్టు సమాచారం.

సీఎం రేవంత్‌ది రెండు నాల్కల ధోరణి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతీ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆయన మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేవంత్ పాలనలో గత ఏడాది కాలంగా రైతు బంధు, బతుకమ్మ చీరెలు, పింఛన్లతోపాటు అనేకం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల ఏడున కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీటు విడుదల చేస్తామని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ తదితరులతో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ వ్యవహారశైలిపైనా, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైనా ఆయన ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం ఓ అపరిచితుడంటూ ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండాలనీ, బాధ్యతగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మాత్రం అందుకు భిన్నంగా నరం లేని నాలుక ఏదైనా మాట్లాడుతుందనే రీతిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేశారంటూ సీఎం పదేపదే చెప్పటాన్ని హరీశ్ ఈ సందర్భంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అప్పు రూ.4.26 లక్షల కోట్లేనంటూ తాను శాసనసభ వేదికగా స్పష్టం చేశానని గుర్తు చేశారు. ఇప్పటికీ అదే మాటకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు బంధు డబ్బులేసేందుకు వీలుగా తమ పార్టీ ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకుందనీ, అదే విషయాన్ని తాను తొర్రూరులో నిర్వహించిన బహిరంగ సభలో చెప్పానని గుర్తు చేశారు. ఆ అంశంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన రేవంత్, ఉద్దేశపూర్వకంగానే రైతుల ఖాతాల్లో డబ్బులు పడకుండా ఆపారని వాపోయారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా కింద ఎకరానికి రూ.5 వేలే ఇచ్చిందనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రూ.7,500 ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఈ రకంగా రేవంత్ ప్రతీ విషయంలోనూ ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. ప్రజలను మోసం, దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందని విమర్శించారు. ప్రజలకు మాటిస్తే నిలబెట్టుకునేందుకు ప్రయత్నించాలి, కానీ అందుకు విరుద్ధంగా సీఎం స్థాయిలో జనాలను రెచ్చగొట్టుడేందని ప్రశ్నించారు. ఆయన రెండు వైపులా పదునున్న కత్తికంటే ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, రైతు బంధు తదితర విషయాల్లో సీఎం రేవంత్ గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను హరీశ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు.



ఇబ్రహీంపట్నంలో కులదురహంకార హత్య



(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. తమకు ప్రాణహాని ఉందని దంపతులు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరి దారిలో వారు ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో భార్యాభర్తలు ఇద్దరూ స్వగ్రామమైన రాయపోల్‌కు వచ్చారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో విధులకు హాజరయ్యేందుకు నాగమణి తన స్కూటీపై రాయపోల్ నుంచి మన్నెగూడ మీదుగా హయత్‌నగర్‌కు బయలుదేరింది. ఈ విషయాన్ని గమనించిన ఆమె సోదరుడు కొంగర పరమేష్ కారులో ఆమెను వెంబడించాడు. రాయపోల్-మన్నెగూడ మార్గమధ్యలో ఆమె ప్రయాణిస్తున్న స్కూటీని వెనక నుంచి కారుతో ఢీకొట్టాడు. దాంతో నాగమణి స్కూటీపై నుంచి కింద పడిపోయింది. వెంటనే అప్పటికే కారులో సిద్ధంగా ఉంచుకున్న వేట కొడవలితో నాగమణి మెడపై నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజు, రామకృష్ణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నాగమణిని నరికిన వేట కొడవలి, ద్విచక్ర వాహనం, ఆమె బ్యాగుతో పాటు కారు నెంబర్ ప్లేట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నాగమణి హత్య జరిగిన విషయం తెలుసుకున్న భర్త శ్రీకాంత్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు.

కులాంతర వివాహం, ఆస్తి తగాదాలే కారణం..

మృతురాలు నాగమణికి గతంలోనే వివాహం జరిగింది. అయితే భర్త నుంచి ఇటీవల విడాకులు తీసుకున్న ఆమె.. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను ప్రేమించి, పెండ్లి చేసుకుంది. అప్పటికే తన తల్లి ద్వారా నాగమణికి సక్రమించిన ఎకరా భూమి ఆమె పేరుతోనే ఉంది. నాగమణితో పాటు సోదరుడైన పరమేశ్‌కు ఇబ్రహీంపట్నం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో.. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తిని తన పేరున చేయాలని నిందితుడు పరమేశ్ పట్టుబట్టాడు. ఆ క్రమంలోనే నాగమణి తన పేరుతో ఉన్న ఎకరం భూమిని సోదరుడు పరమేశ్‌కు రిజిస్ట్రేషన్ చేసింది. భవిష్యత్తులో కూడా తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో ఎలాంటి గొడవలకు రావొద్దని, కోర్టులో కేసులు వేయొద్దని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని పరమేశ్ సోదరిపై ఒత్తిడి తెచ్చాడు. ఆ క్రమంలోనే అక్క-తమ్ముడి మధ్య వాదోపవాదాలు జరిగినట్టు సమాచారం. కులాంతర వివాహం చేసుకొని వెళ్లిన క్రమంలో 'నీ బతుకు నువ్వు బతకాలని, తమ ఆస్తి జోలికి రావద్దని' అక్కను పరమేశ్ హెచ్చరించాడు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిలో 'నీకు ఎంత హక్కు ఉంటుందో నాకు అంతే హక్కు ఉంటుందని, అవసరమైతే కోర్టు ద్వారా ఆస్తిని రాబట్టుకుంటానని' నాగమణి సోదరుడిని హెచ్చరించినట్టు తెలిసింది. భవిష్యత్తులో నాగమణి కోర్టులో కేసు వేసి ఆస్తిని తీసుకుంటుందన్న అక్కసును మనసులో పెట్టుకొని, అలాగే కులాంతర వివాహం చేసుకున్నదనే కోపం పెంచుకుని ఒంటరిగా ఉన్న సమయంలో నిందితుడు ఆమెను హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నాగార్జునసాగర్ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

ఆస్తులు-అప్పులపై తేలని పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

ఎటూ తేలలేదని సమాచారం. రూ.861 కోట్ల మేర లేబర్ సెస్‌ను ఏపి, తెలంగాణ మధ్య పంపకానికి అంగీకారం కుదిరింది. పన్నులు పంపకాలపై ఇరు రాష్ట్రాల శాఖాధికారుల సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని నిర్ణయించారు. 9,10 షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పులు పంపకాల అంశమూ తేలలేదు. ఉద్యోగుల మార్పిడిపైనా సీఎస్‌ల కమిటీ సమావేశంలో సుదీర్ఘచర్చ జరిగింది. ఎక్సైజ్ శాఖకు తెలంగాణ చెల్లించిన రూ.81కోట్ల బకాయిల అంశం పరిష్కారమైంది. అదనంగా ఇచ్చిన రూ.81కోట్లు తిరిగి చెల్లించినట్టు ఏపీ తెలిపింది. డ్రగ్స్ నివారణపై సంయుక్త కమిటీ వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్త కమిటీ వేయాలని నిర్ణయానికి వచ్చారు. మరో రెండు అంశాలపై సీఎస్‌ల కమిటీలో ఏకాభిప్రాయం కుదిరినట్టు సమాచారం, విభజన అంశాలపై చర్చించేందుకు మరోసారి భేటీ కావాలని సిఎస్‌లు నిర్ణయించారు. ఈ కీలక భేటీలో ఏపీ నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తోపాటు ఆర్థిక శాఖ కార్యదర్శి, హోమ్‌శాఖ కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సీఎండీ, వాణిజ్యపన్నులశాఖ చీఫ్ కమిషనరు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సిఎస్ శాంతకుమారితో పాటు ఆర్థిక, హోమ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఘర్షణ

కొనక్రీ, గినియా : దక్షిణ గినియాలోనే అతిపెద్ద నగరమైన నజెరెకొరెలో సాకర్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, తొక్కిసలాటలో పిల్లలతో సహా డజన్ల సంఖ్యలో అభిమానులు మరణించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసి పోయింది. ఆ సమయంలో చెలరేగిన ఘర్షణలను అదుపు చేసేందుకు భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దాంతో చోటు చేసుకున్న తొక్కిసలాటలో భారీగా ప్రాణ నష్టం సంభవించిందని స్థానిక మీడియా, రాజకీయ పార్టీల కూటమి వెల్లడించింది. సుమారు 70 మందికి పైగా చనిపోయారని కథనాలు వస్తున్నాయి.

స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం (డిసెంబరు 2వ తేదీ) ఈ తొక్కిసలాట జరిగిందని గినియా ప్రధాని అమడవు ఒరి బాహ్ ఎక్స్‌లో తెలిపారు. ఎంతమంది మరణించారనే సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. కాగా అధికారులు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని బాహ్ చెప్పారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయని, పదుల సంఖ్యలో గాయపడ్డారని రాజకీయ పార్టీల కూటమి నేషనల్ అలయన్స్ ఫర్ ఆల్టర్‌నేషన్ అండ్ డెమోక్రసీ ఒక ప్రకటనలో తెలిపింది. వివాదాస్పద పెనాల్టీ విషయంలో గందరగోళం నెలకొని, ఘర్షణలు చోటు చేసుకున్నాయని, దాంతో పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయని స్థానిక మీడియా వార్తలు తెలిపాయి. ఈ పెనాల్టీ అంశం మద్దతుదారులకు ఆగ్రహాన్ని తెప్పించింది. వారు రాళ్ళు విసిరారు. దాంతో భద్రతా బలగాలు బాష్ప వాయుగోళాలను ప్రయోగించారని మీడియా తెలిపింది. చాలామంది చనిపోయారని, వారిలో పిల్లలు కూడా వున్నారని పేర్కొంది. సమీపంలోని ఆస్పత్రిలో గాయపడిన వారు చికిత్స పొందుతున్నారని, వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా వుందని వార్తలు తెలిపాయి. సంఘటనా స్థలంలోని వీడియోలను చూస్తుంటే స్టేడియంలో ఒక వర్గం గట్టిగా నినాదాలు చేస్తూ అరవడం కనిపిస్తోంది. రిఫరీ పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. ఆ వెంటనే పెద్ద ఎత్తున ఘర్షణలు చెలరేగాయి. అభిమానులు పెద్ద పెట్టున ఫీల్డ్‌లోకి పరుగులు పెట్టడం కనిపిస్తోంది. ప్రజలు అటూ ఇటూ పరుగులు పెడుతూ, బాగా ఎత్తుగా వున్న కంచెను దూకి బయటకు వెళ్లిపోవడానికి చాలా మంది ప్రయత్నించడం కనిపించింది. ఆ పక్కనే గల ఆస్పత్రిలో నేలపై చాలామంది పడి వుండగా, మరికొంతమంది వారికి చికిత్స విషయంలో సహకరిస్తున్నారు. తక్షణమే ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టాలని నేషనల్ అలయన్స్ పిలుపిచ్చింది. గినియా మిలటరీ నేత మామడి దౌముబుయా యొక్క చట్టవిరుద్ధమైన, సముచితం కాని రాజకీయ ఆకాంక్షకు మద్దతును సమీకరించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. 2021లో అధ్యక్షుడు అల్ఫా కాండెను సైన్యం పదవీచ్యుతుడిని చేసినప్పటి నుండి గినియాలో సైనిక పాలనలోనే వుంది. సైనిక పాలనలో వుంటూ తిరిగి పౌర పాలనకు రాని మాలి, నైజర్, బుర్కినా ఫాసో దేశాల సరసన గినియా చేరింది. మూడేండ్ల క్రితం అధ్యక్షుడిని పదవీచ్యుతుడిని చేస్తూ దేశం గందరగోళంలోకి జారకుండా తాను అడ్డుకున్నానని దౌముబుయా వ్యాఖ్యానించారు. పైగా గత ప్రభుత్వం చేసిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు.

మహిళా విశ్వవిద్యాలయమే...కానీ?

వర్సిటీ హోదా కల్పించని రాష్ట్ర ప్రభుత్వం

- యూజీసీ గుర్తింపు లేకుండానే కొనసాగుతున్న వైనం
- రెండున్నరేండ్లు దాటినా మారనితీరు
- కోఠి మహిళా కాలేజీ పేరుతోనే ధ్రువపత్రాల జారీ
- ఆందోళనలో విద్యార్థులు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం
- విద్యాశాఖ కసరత్తు





నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కోఠి మహిళా కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను నాటి విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి 2022, ఏప్రిల్ 25న ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) నాటి వీసీ డి రవీందర్‌కు అందజేశారు. రూ.వంద కోట్ల నిధులు కూడా కేటాయించారు. గతేడాది డిసెంబర్ ఏడో తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరును మార్చింది. రెండున్నరేండ్లు దాటినా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అయినా మహిళా వర్సిటీకి విశ్వవిద్యాలయ హోదా కల్పించలేదంటే అతిశయోక్తి కాదు. అప్పుడు ఉన్న పరిస్థితే ఇప్పుడూ కొనసాగుతున్నది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం మహిళా వర్సిటీకి విశ్వవిద్యాలయ హోదా కల్పించకపోవడం వల్ల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు ఇవ్వలేదు. ఉత్తీర్ణులైన యూజీ, పీజీ విద్యార్థులకు ఏ విశ్వవిద్యాలయం పేరుతో ధ్రువపత్రాలను ఇవ్వాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. యూజీసీ గుర్తింపు లేకుండా మహిళా విశ్వవిద్యాలయం పేరుతో ధ్రువపత్రాలను జారీ చేస్తే చెల్లుబాటు కావు. దీంతో కోఠి మహిళా కళాశాల పేరుతోనే విద్యార్థులకు ధ్రువపత్రాలను ఇస్తుండడం గమనార్హం. విశ్వవిద్యాలయంగా మారిన తర్వాత కాలేజీ పేరుతో ధ్రువపత్రాలను ఇవ్వడాన్ని విద్యార్థులు తప్పుపడుతున్నారు. వర్సిటీ అధికారుల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళా విశ్వవిద్యాలయం పేరుతోనే ధ్రువపత్రాలను ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఇన్‌చార్జీ వీసీల నియామకం

హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న మహిళా కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చింది. అందుకోసం జీవో నెంబర్ 12ను 2022, ఏప్రిల్ 25న విడుదల చేసింది. కానీ తెలంగాణ యూనివర్సిటీల యాక్ట్–1991ను సవరించి మహిళా విశ్వవిద్యాలయానికి కొత్త చట్టం తేలేదు. దీంతో కోఠి మహిళా కళాశాలగానే ఇప్పటికీ గుర్తింపు ఉన్నది. మహిళా విశ్వవిద్యాలయం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకపోవడంతో ఆ వర్సిటీకి ప్రత్యేక చట్టం లేకపోవడం వల్ల యూజీసీ గుర్తింపు లేదు. దీంతో మహిళా విశ్వవిద్యాలయంగా ఏర్పడినా... అప్పగి నుంచి ఇన్‌చార్జీ వీసీలను ప్రభుత్వం నియమిస్తున్నది. 2023, మార్చి నాలుగో తేదీన తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం మొదటి ఇన్‌చార్జీ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ ఎం విజ్జులతను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అక్టోబర్ 16న ఓయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్‌ని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీగా నియమించింది. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమావేశాల్లోనే మహిళా విశ్వవిద్యాలయం బిల్లును ప్రవేశపెట్టేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ బాధ్యతను ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ వి బాలకిష్టారెడ్డికి ప్రభుత్వం అప్పగించింది. అసెంబ్లీలో మహిళా విశ్వవిద్యాలయం బిల్లు ఆమోదం పొందితే గవర్నర్ ఆమోదముద్ర వేస్తారు. ఆ తర్వాత తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం చట్టంగా మారుతుంది. దీంతో యూజీసీ గుర్తింపు వస్తుంది. ఆ తర్వాతే శాశ్వత వీసీని నియమించడానికి మార్గం సుగమం అవుతుంది.

వర్సిటీకి చట్టపరంగా గుర్తింపు కల్పిస్తాం : బాలకిష్టారెడ్డి

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడినా చట్టపరంగా గుర్తింపు రాలేదని ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్ ఆమోదిస్తే చట్టంగా మారుతుందన్నారు. అప్పుడే తెలంగాణ మహిళా విశ్వవిశ్వవిద్యాలయానికి చట్టపరంగా గుర్తింపు వస్తుందని వివరించారు. తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్టం–1991లో మహిళా విశ్వవిద్యాలయాన్ని చేరుస్తామని వివరించారు. అప్పుడే యూజీసీ గుర్తింపు కూడా వస్తుందని చెప్పారు. అయితే కొన్ని ఇబ్బందులు వస్తాయన్నారు. చట్టం చేసినప్పటి నుంచే వర్సిటీ పేరుతో ధ్రువపత్రాలను ఇవ్వడానికి అవకాశముంటుందని అన్నారు. 2022, ఏప్రిల్ 25న మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి ధ్రువపత్రాలను ఇచ్చేందుకు అవకాశం ఉండబోదని చెప్పారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలని అన్నారు.

ఏడు నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు

- 36 ఈవెంట్స్‌లో పోటీలు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఈ నెల ఏడు నుంచి జనవరి 2వరకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ 2024 క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ క్రీడా ప్రాదికార సంస్థ తెలిపింది. నెంబర్ వన్ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా సీఎం ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విసత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రీడోత్సవాలను విజయంతం చేసేందుకు ఈ నెల 8 లోగా ఒఎఒబజూ2024.వశ్రీఖఅస్త్రుఋఖ.స్త్రశీఐ.ఱఅ నందు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుని ప్రతిభను మదింపు చేసి, ప్రోత్సహిస్తారని సంస్థ తెలిపింది. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి , వారిని ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ధృడ సంకల్పంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపింది. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో పోటీలు జరుగుతాయని సంస్థ పేర్కొన్నది.

పీసీబీ నిర్ణయాన్ని తప్పుబట్టిన షోయబ్ అక్తర్

ఛాంపియన్స్ ట్రోఫీ



ఇస్లామాబాద్ : భవిష్యత్‌లో భారత్‌లో నిర్వహించే ఐసిసి టోర్నీలకు వెళ్లకూడదన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యతిరేకించారు. వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆ దేశంలో పర్యటించేది లేదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు దిగొచ్చింది. పాక్‌లో పర్యటించడానికి భారత్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ఐసీసీ చెప్పినట్టే ఆ జట్టు మ్యాచ్‌లను తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పీసీబీ తాజాగా పేర్కొంది. కానీ ఈ విషయంలో పాక్ బోర్డు ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసిసి టోర్నీల కోసం భారత్‌కు వెళ్లకూడదని నిర్ణయిస్తే.. ఆ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. అయితే.. ఈ నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యతిరేకించాడు. ఓ క్రీడా ఛానల్‌తో మాట్లాడుతూ ఛాంపియన్స్ ట్రోఫీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించే ఈ టోర్నీ రెవెన్యూలో అధిక వాటాను పీసీబీ డిమాండ్ చేయడాన్ని షోయబ్ అక్తర్ సమర్థించాడు. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొన్నాడు. భవిష్యత్‌లో ఐసిసి ఈవెంట్‌ల కోసం భారత్‌కు వెళ్లకూడదన్న వైఖరిపై మాత్రం అభ్యంతరం వ్యక్తంచేశాడు. వారిని సొంతగడ్డపైనే ఓడించేలా పాక్ జట్టును నిర్మించాలని కోరాడు.

హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీని

ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై సందిగ్ధత తొలగినట్టు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగనున్నట్టు సమాచారం. అయితే మొన్నటివరకు ఛాంపియన్స్ ట్రోఫీ జరగడం అనుమానంగా సాగింది. పాకిస్థాన్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ టీమిండియాను పంపించబోమని బీసీసీఐ స్పష్టం చేయడం, మరోవైపు హైబ్రిడ్ మోడల్‌లోనే టోర్నీ నిర్వహిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పట్టుబట్టడంతో.. టోర్నీ నిర్వహణపై అనిశ్చితి ఏర్పడింది. ఇక హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడం దాదాపు ఖాయమైంది. భారత్ ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక కానున్నట్లు సమాచారం. భారత్ సెమీస్, ఫైనల్ వరకు చేరుకుంటే. ఆ మ్యాచ్‌లను కూడా అక్కడే నిర్వహిస్తారు.

15.5 ఓవర్లు..5 పరుగులు

వెస్టిండీస్ బౌలర్ సంచలన రికార్డు
46 ఏళ్లలో ఇదే తొలిసారి



జమైకా : వెస్టిండీస్ సీమర్ జేడెన్ సీల్స్ సంచలన రికార్డు నమోదు చేశాడు. టీమిండియా స్టార్ పేరిట ఉన్న అరుదైన రికార్డును అతడు బద్దలు కొట్టాడు. టెస్ట్ క్రికెట్‌లో ఈ మైల్‌స్టోన్ నమోదవడం 46 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 15.5 ఓవర్లు వేసిన సీల్స్.. కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అతడు వేసిన ఓవర్లలో 10 ఓవర్లు మెయిడిన్లు ఉండటం విశేషం. తన స్పెల్‌లో ఓవర్‌కు సగటున 0.32 చొప్పున పరుగులిచ్చాడు సీల్స్. గత 46 ఏళ్లలో ఇంత తక్కువ ఎకానమీతో ఓ స్పెల్ వేయడం ఇదే తొలిసారి. కనీసం 10 ఓవర్లను ప్రాతిపదికగా తీసుకుని వేసిన స్పెల్స్‌లో సీల్స్ టాప్‌లో నిలిచాడు.

ఉమేశ్‌ను దాటేశాడు : 1978 నుంచి ఇప్పటివరకు ఏ బౌలర్ కూడా టెస్టుల్లో 0.4 కంటే తక్కువ ఎకానమీతో బౌలింగ్ చేయలేదు. కానీ తాజాగా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సీల్స్ 0.32 ఎకానమీని నమోదు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఈ లిస్ట్‌లో ఉన్న టీమిండియా వెటరన్ పేసర్ ఉమేశ్ యాదవ్ (0.42 ఎకానమీ)ని అతడు దాటేశాడు. 2015లో డర్బన్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఉమేశ్ ఈ రికార్డును నెలకొల్పాడు. దాన్ని సీల్స్ అధిగమించాడు. ఇక, బెస్ట్ ఎకానమీ స్పెల్స్‌లో చూసుకుంటే.. భారత మాజీ ఆటగాడు బనూ నద్కర్నీ అగ్రస్థానంలో ఉన్నాడు. 1964లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో అతడు 32 ఓవర్లలో 27 మెయిడిన్లు వేయడమే గాక కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చాడు.

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ భోణీ

సెంచరీతో రాణించిన కెప్టెన్ మహ్మద్ అమన్
జపాన్‌పై 211 పరుగుల తేడాతో ఘన విజయం



షార్జా : అండర్–19 ఆసియా కప్‌లో భారత్ బోణీ కొట్టింది. జపాన్‌పై యువ భారత్ 211 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారీ లక్ష్యఛేదనలో జపాన్ 50 ఓవర్లలో 128/8కి పరిమితమైంది. దీంతో భారత్‌కు భారీ విజయం సొంతమైంది. ఓపెనర్ హ్యూగో కెల్లీ (50: 111 బంతుల్లో) టాప్ స్కోరర్. ఛార్లెస్ హింజ్ (35) రాణించాడు. మిగతా బ్యాటర్లెవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో హార్దిక్ రాజ్, కార్తికేయ, చేతన్ శర్మ తలో రెండు వికెట్లు తీయగా.. యుధజిత్ ఒక వికెట్ పడగొట్టాడు.

అదరగొట్టిన అమన్ :

భారత కెప్టెన్ మహ్మద్ అమన్ (122 : 118 బంతుల్లో 7 ఫోర్లు) శతకం బాదడంతో జట్టుకు భారీ స్కోరు దక్కింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (54 : 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. వైభవ్ సూర్యవంశీ (23 : 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కార్తికేయ (57 : 50 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. చివర్లో హార్దిక్ రాజ్ (25 : 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. యువ భారత్ తన తర్వాతి మ్యాచ్ డిసెంబరు 4న యుఎఇతో ఆడనుంది.

నవచిత్రం

విరహ వేదనలో సారంగపాణి




రూప కొడువాయూర్, ప్రియదర్శి

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన సినిమా 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు.

'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. ఈనెల 20న థియేటర్లలోకి వస్తుందీ సినిమా. టైటిల్ సాంగ్ 'సారంగో సారంగో...' కొన్ని రోజుల క్రితం విడుదలైంది. రెండో పాట 'సంచారి... సంచారి...'ని సోమవారం విడుదల చేశారు.

దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ, 'ఎటువంటి కథలోనైనా భావోద్వేగం లేకపోతే ఆ కథకు పరిపూర్ణత ఉండదు, 'సారంగపాణి జాతకం' లాంటి పూర్తి నిడివి హాస్యరస చిత్రంలో కూడా! ముఖ్యంగా ఈ సినిమాలో ప్రధానమైన అంశం ప్రేమ. తాను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయికి, తన నమ్మకానికి మధ్య నలిగిపోయిన వ్యక్తి కథే ఈ సినిమా. 'సంచారి' అనే పాట తన నమ్మకం వల్ల తాను ప్రాణంగా ప్రేమించే అమ్మాయిని కోల్పోయే సందర్భంలో వస్తుంది. కొంత విరహ వేదన, కొంత ఆ అమ్మాయిని కోల్పోతాననే తపన – వేదన మేళవించిన గీతమిది. ద్వితీయార్థంలో కీలకమైన సందర్భంలో వచ్చిన తర్వాత కథ గమనాన్ని మారుస్తుంది. అమ్మాయిని పొందాలనే అతని కోరికను బలంగా మార్చి, ఆఖరి ఆటంకాన్ని ఎదుర్కోవడానికి ప్రేరేపిస్తుంది. ఈ పాటకు కథలో మంచి ప్రాముఖ్యం ఉంటుంది. నాకు చాలా చాలా ఇష్టమైన పాటల్లో ఇదొకటి. సంజీత్ హెగ్డే అద్భుతంగా పాడిన పాట. రామజోగయ్య శాస్త్రి ఎంత బాగా రాస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంగీత దర్శకుడు వివేక్ సాగర్ శైలి గుర్తొచ్చే పాట ఇది. ప్రియదర్శి, రూప నటన కూడా బావుంటుంది. నాకు ఇష్టమైన పాట ప్రేక్షకులకు కూడా దగ్గర అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

మహేష్ డబ్బింగ్ ప్రధాన ఆకర్షణ



మహేష్‌బాబు

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఈనెల 20న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం 2019లో 'లైవ్–యాక్షన్ ది లయన్ కింగ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించబోతోంది. 'ముఫాసా'కి హీరో మహేష్ బాబు వాయిస్ అందించారు.

మహేష్ బాబు వాయిస్ ఓవర్‌లో రిలీజైన ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ గ్రాండ్ మీడియా ఈవెంట్‌లో లాంచ్ చేశారు. టాకా పాత్రకు హీరో సత్యదేవ్, టిమోన్ పాత్రకు అలీ, పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ వాయిస్ అందించారు. నమ్రతా శిరోద్కర్ మాట్లాడుతూ, 'డిస్నీ టీమ్ థ్యాంక్స్. చాలా శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్ చేశారు. ఇలాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ని డబ్ చేయడం ఒక ఛాలెంజ్. ఇది పక్కా ఫ్యామిలీ ఫిల్మ్, ఎమోషనల్ రైడ్. మహేష్ బాబు చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'మన వాయిస్ డిస్నీ లైబ్రరీలో ఉండటం అనేది గ్రేట్ ఎచీవ్‌మెంట్. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సరిలేరు నికెవ్వరు వంటి మహేష్‌బాబు చిత్రాల్లో నటించడం, ఇప్పుడు ఆయనతో కలిసి టాకా అనే క్యారెక్టర్‌కి వాయిస్ చెప్పడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో సత్యదేవ్ చెప్పారు.

ఈ ప్రయాణం.. అద్భుతం



శ్రీనువైట్ల

'నేను ఊహించని ఎన్నో అద్భుతాలు నా కెరీర్‌లో జరిగాయి. దర్శకుడిగా 25 ఏండ్ల జర్నీ చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రయాణం అద్భుతం. ఇలాంటి సంతృప్తికరమైన జర్నీకి కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని అన్నారు డైరెక్టర్ శ్రీను వైట్ల. 'నీ కోసం' చిత్రంతో ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. రవితేజ హీరోగా నటించిన ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించింది. 7 నంది అవార్డులను సొంతం చేసుకున్న ఈ చిత్రం 3–12–1999లో విడుదలై, నేటితో (మంగళవారం) 25 ఏళ్ళు పూర్తి చేసుకుంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనువైట్ల మీడియాతో తన జర్నీ గురించి పలు ఆసక్తికరమైన విశేషాలను షేర్ చేసుకున్నారు.

'నాతొలి సినిమా ఆగిపోవడంతో బాగా డిజప్పాయింట్ అయ్యాను. మళ్ళీ ఓ కథ రాసుకుని, తక్కువ బడ్జెట్‌లో చేయాలని అనుకున్నాను. అలా 'నీ కోసం' సినిమా స్టార్ట్ చేశాం. అప్పుడు కూడా కొన్ని కారణాల వలన సినిమా కొంతకాలం ఆగింది. రవితేజ నా స్నేహితుడు. తన ప్రోత్సాహంతో ఆ సినిమాని ఫినిష్ చేశాను. నాగార్జున ఫస్ట్ కాపీ చూశారు. ఆయనకి బాగా నచ్చి, నాకు డైరెక్షన్ ఆఫర్ చేశారు. అలాగే రామోజీ రావుకి కూడా సినిమా నచ్చి, అవుట్‌రేట్‌కి కొనేశారు. ఒక మంచి సినిమా ఆగకూడదనే ఉద్దేశంతో తీసుకున్నానని, వారి బ్యానర్‌లో నాకు సినిమా ఇస్తానని రిలీజ్‌కి ముందే ఆయన మాట ఇచ్చారు. ఆ బడ్జెట్‌కి సినిమా రీజనబుల్‌గానే ఆడింది. ఏడు నంది అవార్డ్స్ రావడం చాలా ఆనందంగా అనిపించింది. రామోజీ రావు చెప్పినట్లే నాకు వారి బ్యానర్‌లో 'ఆనందం' సినిమా ఇచ్చారు. నాగార్జున డైరెక్షన్ ఆఫర్ చేయడం, రామోజీ రావుకి సినిమా నచ్చడం, రిలీజ్ చేయడం, 7 నంది అవార్డ్స్ రావడం.. ఇవన్నీ మెమరబుల్ మూమెంట్స్. నా జర్నీలో టాప్ 5 మూవీస్ చెప్పమంటే, 'ఆనందం, వెంకీ, రెడీ, దూకుడు, ఢీ' అని గర్వంగా చెప్పగలను. రీసెంట్‌గా 'విశ్వం' సాధించిన ఘన విజయం మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు ఉత్సాహాన్నిచ్చింది'.

ఏది చేసినా.. శివుని కోసమే



అరియానా, వివియానా

హీరో విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కన్నప్ప'. వచ్చే ఏడాది ఏప్రిల్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు.మంచు విష్ణు పిల్లలు అరియానా, వివియానాల పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ క్షణంలో నా హృదయం గర్వంతో ఉప్పొంగు తోంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూసేందుకు నేను ఎంతగానో ఎదురు చూస్తున్నాను' అని మంచు విష్ణు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నేను చేసిన తప్పేంటి?



రామ్‌గోపాల్ వర్మ

ఏడాది క్రితం తాను చేసిన సోషల్ మీడియా పోస్టుపై ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు కావడంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. మంగళవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

'మనది ఫ్రీ వరల్డ్. వ్యంగ్యం అనేది మీడియా సహా ప్రతి చోటా ఉంటుంది. ఇప్పుడున్న సోషల్ మీడియా ఓపెన్ చేస్తే వందలాది మీమ్స్ కనిపిస్తాయి. నేను ఏడాది క్రితం చేసిన పోస్ట్ కూడా అలాంటిదే. అయితే ఏడాది తర్వాత ఒక వ్యక్తి మేలుకుని నాపై పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాడు. ఆ తర్వాత ఇదే పోస్ట్‌ను కారణంగా చూపుతూ ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు అయ్యాయి. ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నదే అనే అనుమానంతో నేను ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నాను. నేను చేసిన తప్పేంటో, ఏ సెక్షన్‌లో అరెస్ట్ చేస్తున్నారో పోలీసులు చెప్పకముందే కొన్ని మీడియా సంస్థలు హడావుడి చేశాయి. ఏపీలో సెన్సార్ ఇబ్బందుల వల్ల నేను పొలిటికల్ మూవీస్ చేయడం మానేస్తా అని పోస్ట్ చేశా. అది కూడా ఏడాది పాటు సెన్సార్ కోసం వెయిట్ చేసి, చిరాకుగా ఉండి పొలిటికల్ బేస్డ్ మూవీస్ రూపొందించను అని పోస్ట్‌లో పేర్కొన్నా'.

కంటెంటే సూపర్‌స్టార్



అక్షయ్, ఐశ్వర్య

పి.ఎస్.బి సినిమాస్ బ్యానర్ పై రూపొందున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డియర్ కృష్ణ'.

ఈ సినిమా ద్వారా పీఎస్ బలరామ్ రచయితగా, నిర్మాతగా పరిచయమవుతున్నారు. దినేష్ బాబు స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు.

అక్షయ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో 'ప్రేమలు' చిత్ర ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఐశ్వర్య కూడా మరో హీరోయిన్.

ప్రచార చిత్రాలతో, లక్ష రూపాయల కాంటెస్ట్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి.

రచయిత, నిర్మాత పి.ఎస్. బలరామ్ మాట్లాడుతూ, 'నేను ఈ సినిమాకి నిర్మాతగా భావించట్లేదు. కృష్ణుడి సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న వ్యక్తిగానే భావిస్తున్నాను. కృష్ణుడి వల్ల మా కుటుంబంలో జరిగిన మిరాకిల్‌నే కథగా తీసుకున్నాం. అదేంటంటే మా అబ్బాయి అక్షయ్ అత్యంత అరుదైన డిసీజ్ నుంచి, డాక్టర్లే ఆశ్చర్యపోయేలా ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ సినిమాలో అక్షయ్‌నే హీరోగా నటించాడు. ఈ చిత్రం కోసం మేం స్టార్స్‌ని తీసుకోవాలి అనుకోలేదు. ఎందుకంటే కృష్ణుడే సూపర్‌స్టార్, కంటెంటే సూపర్ స్టార్' అని అన్నారు.

'మా కుటుంబానికి, కృష్ణుడికి మధ్య నడిచే ప్రేమ కథే ఈ చిత్రం. మా నాన్న నాకు జన్మని ఇవ్వడమే కాదు, పునర్జన్మను కూడా ఇచ్చారు. ఆయన వల్లే నేను ఈరోజు ఇలా మీ ముందు ఉన్నాను.ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని హీరో అక్షయ్ తెలిపారు.

ఎద.. ఎద సవ్వడి



శ్రీ చరణ్ రాచకొండ, గీత్ సైని

శ్రీచరణ్ రాచకొండ, గీత్ సైని జంటగా నటిస్తున్న సినిమా 'కన్యాకుమారి'. ఈ చిత్రాన్ని రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు.

ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో సోమవారం ఈ సినిమా నుంచి 'ఎద ఎద సవ్వడి..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు.

ఈ పాటకు దర్శక, నిర్మాత సృజన్ అట్టాడ లిరిక్స్ అందించగా, అనురాగ్ కులకర్ణి, జయశ్రీ పల్లెం పాడారు. రవి నిడమర్తి అద్భుతంగా ట్యూన్ చేశారు. 'ఎద ఎద సవ్వడి.. చేసెను సందడి, నువ్వు నన్ను తాకగా, రేగెను అలజడి, అట్ట అట్ట సూడకే ఎట్ట ఎట్ట ఆపనే, పొంగుతున్న ప్రేమనే.. పిల్లా' అంటూ సాగుతుందీ పాట.

ఈ సినిమా నుంచి ఇప్పటికే హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'కత్తిలాంటి పిల్లవే..' సాంగ్ కూడా మంచి ఆదరణ పొందింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

'ఇదొక గ్రామీణ నేపథ్యంలో సాగే ఎంటర్‌టైనర్. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్నీ ఇందులో ఉన్నాయి' అని దర్శక, నిర్మాత సృజన్ అట్టాడ తెలిపారు.

ఈ చిత్రానికి ఎడిటింగ్ – నరేష్ అడుప, సినిమాటోగ్రఫీ – శివ గాజుల, హరిచరణ్ కె, మ్యూజిక్ – రవి నిడమర్తి, సౌండ్ డిజైనర్ – నాగార్జున తాళ్లపల్లి, కో ప్రొడ్యూసర్స్ – సతీష్ రెడ్డి చింతా, వరీనియా మామిడి, అప్పల నాయుడు అట్టాడ, సిద్ధార్థ్.ఎ, రచన, ప్రొడ్యూసర్, డైరెక్టర్ – సృజన్ అట్టాడ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గురుకులాల్లో అన్నీ బాగుంటే మమ్మల్ని అడ్డుకోవడమెందుకు?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకులాల్లో అన్ని బాగుంటే బీఆర్ఎస్ నాయకుల్లను ఆ హాస్టళ్లను సందర్శించకుండా అడ్డుకోవడమెందుకని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గురుకులాల్లోకి వెళ్లకుండా తమను అడ్డుకుంటుంటే విద్యార్థులే సమస్యలు చెప్పుకునేందుకు రోడ్డు మీదకు వస్తున్నారని తెలిపారు. గురుకులాల్లో స్థితిగతులపై విద్యార్థి సంఘాలు అధ్యయనం చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. తాము తరగతుల బహిష్కరణకో, ధర్నాలు చేయడానికో వెళ్లడం లేదని స్పష్టం చేశారు. గురుకులాలను కేసీఆర్ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తే, రేవంత్ రెడ్డి సర్కారు వాటిని నాశనం చేస్తున్నదని విమర్శించారు. లగచర్ల, మహబూబాబాద్, గురుకులాలు ఎక్కడికెళ్లినా అడ్డుకుంటున్నారనీ, ఎంత కాలం అడ్డుకుంటారని నిలదీశారు. పాలన చేతగాక గురుకులాల్లో విషాహారానికి బీఆర్ఎస్ కారణమంటూ ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఆదివారం తల్లిదండ్రులు పిల్లలను కలిసేందుకు ఎందుకు అనుమతివ్వరని ప్రశ్నించారు. వాటిని జైళ్లుగా మారుస్తున్నారని విమర్శించారు.

దళిత ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత బంధు డబ్బులు రాకుండా చేసిన సీఎం రేవంత్ రెడ్డి దళిత ద్రోహి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలట్ పద్ధతిని ఈ ప్రాజెక్టును ప్రారంభించిన మాజీ సీఎం కేసీఆర్ 18,500 మంది దళితులకు రూ.10 లక్షల చెప్పున వారి అకౌంట్లలో వేశారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఎస్సీ కార్పొరేషన్ విడుదల చేసిన జీవోనే సాక్ష్యమన్నారు. అధికారంలోకి వస్తే దళిత బంధు సాయాన్ని రూ.12 లక్షలకు పెంచుతామని చెప్పారు. దళిత సంఘాలు దీనిపై స్పందించాలని సూచించారు. హుజూరాబాద్ ఏసీపీ చిట్టా త్వరలోనే విప్పుతానని హెచ్చరించారు. దళితులపై బనాయించిన కేసులను బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎదుర్కొంటుందని తెలిపారు.

రాష్ట్రంలో ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 'ప్రజాపాలన విజయోత్సవాలు' ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగాలు ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. ప్రజా విజయోత్సవాలలో భాగంగా సోమవారం "ఆరోగ్య ఉత్సవాలు" అనే కార్యక్రమం రాష్ట్ర మంతట నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవాలలో రాష్ట్ర రెవిన్యూ,హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా రూ.15.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు బిటీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదే విధంగా నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మెదక్, ములుగు, రంగారెడ్డి, కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల,నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ వరంగల్ , హన్మకొండ, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

రేపు న్యాస్ (పరాస్) పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు మూడేండ్లకోసారి నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్ష పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఈ ఏడాది ఫెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్- రాష్ట్రీయ సర్వేక్షన్-24 (పరాస్) పేరుతో ఈ సర్వేను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ పరీక్ష జాతీయస్థాయిలో బుధవారం జరగనుంది. మూడు, ఆరు, తొమ్మిది తరగతుల్లోని విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ)కి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్రంలో ఎంపిక చేసిన 3,500 పాఠశాలల్లో మాత్రమే ఈ పరీక్షను నిర్వహిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో ఉదయం 10.30 గంటలకే పరీక్ష ప్రారంభమవుతుంది.

317 జీవో బాధితులందరికీ న్యాయం చేయాలి

- విద్యాశాఖ సంచాలకులకు టీపీటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని టీపీటీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వారి స్థానికత ఆధారంగా బదిలీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం వండే వారి వేతనాలు పెంచాలని సూచించారు. ప్రతినెలా పదో తేదీలోగా బిల్లులు చెల్లించాలని, ప్రతి పాఠశాలలోనూ తాగునీటి వసతి కల్పించాలని తెలిపారు.

పాఠశాల గ్రాంట్ దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : బీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల గ్రాంట్‌ను దుర్వినియోగం చేసిన వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం మాజీ ఎంఈవో (ఎఫ్ఏసీ) ఉషారాణిపై చర్యలు తీసుకోవాలని బీటీఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె చైతన్య కలిసి ఫిర్యాదు చేశారు.

ఆమెపై హైదరాబాద్ ఆర్జేడీకి ఈ ఏడాది జనవరి మూడున ఫిర్యాదు చేశామని తెలిపారు. వనపర్తి డీఈవో విచారణ కోసం ఆదేశాలిచ్చినా ఆ అధికారిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై విచారణ చేపట్టి ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని సూచించారు.

వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు రెండు వారాల్లో ఇవ్వండి

- సీబీఐ, ఈడీలకు సుప్రీం ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలను రెండు వారాల్లోగా అందించాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. ఈ మేరకు సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఏండ్ల పాటు కొనసాగుతోందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గతంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రఘురామకృష్ణరాజు తరపున సీనియర్ న్యాయవాది బాలాజీ శ్రీనివాస్, వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసుకు సంబంధించి కింది కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల వివరాలు ఇవ్వాలని కోరింది. దీంతో పాటు ఈడీ, సీబీఐ కేసుల వివరాలు విడిగా చార్ట్ రూపంలో అందించాలని సూచించింది. పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్లు రెండు వారాల్లోగా సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు రోజువారీ పద్ధతిలో విచారణకు ఆదేశించినట్టు ఇరుపక్షాల న్యాయవాదులు తెలిపారు. అయితే విచారణ ఇన్నేండ్లపాటు ఎందుకు ఆలస్యమవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. జగన్ అక్రమాస్తుల విషయంలో పలు కోర్టుల్లో డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు విచారణలో ఉన్నాయని న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. దీంతో ఈ కేసుకు సంబంధించి వివిధ కోర్టుల్లో ఉన్నపెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఈడీ, సీబీఐకు తగిన ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు, ట్రయల్ కోర్టులో పిటిషన్లు, పెండింగ్ కేసుల వివరాలివ్వాలని కోరింది. తదుపరి విచారణను 13కి వాయిదా వేసింది.

ఐఐటీ, ఐఐఎంల్లో 80శాతానికిపైగా

అధ్యాపకులు జనరల్ కేటగిరే

ఎస్సీ, ఎస్టీ అధ్యాపకులు తక్కువే : ఆర్‌టీఐ డేటా వెల్లడి



న్యూఢిల్లీ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో బోధించే అధ్యాపకుల్లో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం మందే ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ - సమాచార హక్కు) ద్వారా వెల్లడైంది. రెండు ఐఐటిలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటిల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80-90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటి, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి.

కాగా, ఐఐటి, ఐఐఎంలతోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం మేరా రిజర్వేషన్లు ఇచ్చారు. అయితే వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్‌టిఐ తెలిపింది. ఇక ఉదయ్‌పూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించినట్టైతే ఒక్క ఎస్‌టి కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టు గా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి.

ఐఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ఢిల్లీ ఐఐటిల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80-90 శాతం మేరా జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు. మొత్తంగా 13 ఐఐఎంల్లో 82.8 శాతం మంది అధ్యాపకులు జనరల్ కేటగిరీ వారు వుండగా, కేవలం 5 శాతం ఎస్‌సి, ఒక శాతం ఎస్‌టి, 9.6 శాతం మంది ఓబిసి, ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు (ఇబిసి), వికలాంగుల కోటాలకు చెందినవారు అధ్యాపకులుగా ఉన్నారు.

21 ఐఐటిల్లో 80 శాతం జనరల్ కేటగిరీ, 6 శాతం ఎస్‌సి, 1.6 శాతం ఎస్‌టి, 11.2 శాతం ఓబిసి, ఇబిసి, వికాలాంగుల కోటాలకు చెందిన అధ్యాపకులు ఉన్నారు. మొత్తంగా ఐఐటిల్లో గానీ, ఐఐఎంల్లో గానీ ఇంచుమించుగా ఇదే గణాంకాలు ఉన్నాయి. అయితే దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎంలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొందని కూడా చెప్పలేమని ఆర్‌టిఐ పేర్కొంది. పాట్నా ఐఐటి అధ్యాపకుల్లో 38 శాతం ఓబిసి, ఎస్సీలు 22 శాతం, ఎస్టీలు 13 శాతం, జనరల్ కేటగిరీ 12 శాతం మందే ఉన్నారు. భిలాయ్, ఇండోర్ ఐఐటిల్లో 50 శాతం మందే జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు.

జమ్మూలో 51 శాతం జనరల్ కేటగిరీ, 19 శాతం ఎస్‌సి, 5 శాతం ఎస్‌టి, 23 శాతం ఓబిసి, 2 శాతం ఇతర కేటగిరీలకు చెందిన వారు అధ్యాపకులుగా ఉన్నారు. ఏడు ఐఐఎంల్లో 256 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్‌టిఐ డేటా తెలిపింది. ఈ పోస్టుల్లో ఓబిసి కేటగిరీకి చెందినవి 88, 54 ఎస్సీ, 30 ఎస్టీ కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఐఐటిల్లో 1,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 451 ఓబిసి, 234 ఎస్‌సి,, 129 ఎస్‌టి పోస్టులు ఉన్నాయని ఆర్‌టిఐ తెలిపింది.

ఫెంగల్ తుపాన్ ఎఫెక్ట్

తమిళనాడు, పుదుచ్చేరిలో పంటలకు భారీ నష్టం



చెన్నై : ఫెంగల్ తుపాను కారణంగా తమిళనాడు, పుదుచ్చేరిలో పంటలు తీవ్రంగా నష్టపోయాయి. తమిళనాడులోని విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాలోనే దాదాపు 1,29,000 హెక్టార్లలో పంటలు నీటి మునిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం తెలిపారు. ఫెంగాల్ తుపాను నష్టంపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత, పొలాల్లో నీరు ఇంకిపోయిన తరువాత పంట నష్టంపై సమగ్ర అంచనా వేసి, నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామని చెప్పారు. తమిళనాడులో ఫెంగల్ తుపాను కారణంగా సోమవారం కూడా వర్షాలు కురిసాయి. విల్లురం జిల్లాలో సోమవారం భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు మునిగిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై కూడా నీరు నిలిచి పోవడంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రిష్ణగిరి జిల్లాలోని ఊతంగరై, పోచంపల్లి తాలుకాల్లో భారీ వర్షాలకు రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జాతీయ రహదారులకు అనుసంధానం తెగి పోయింది. ఉత్తంగరై హైవేపై పక్కన నిలిపి ఉంచిన బస్సులు వరద నీటిలో కొట్టుకుని పోయాయి. ఈ రెండు తాలుకాల్లో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఈ జిల్లాల్లో అన్నామలై యూనివర్శిటీ పరీక్షలను వాయిదా వేసింది. పుదుచ్చేరిలోనూ పంటలు నీట మునిగాయని, వర్షాల కారణంగా నలుగురు మరణించారని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి తెలిపారు. సహాయక చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 లక్షల చొప్పున పరిహారం అందచేస్తామని చెప్పారు. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 3.54 లక్షల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 వేలు సహాయం అందచేస్తామని ప్రకటించారు. బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 3, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను పుదుచ్చేరి యూనివర్శిటీ రద్దు చేసింది. తాజా తేదీలను త్వరలో ప్రకటిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. అయితే ఈ నెల 6 నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.

ఉత్తర కేరళకు రెడ్ అలర్ట్ జారీ

ఫెంగాల్ తుఫాను కారణంగా కేరళలో గణనీయమైన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) సోమవారం హెచ్చరిక జారీ చేసింది. మంగళవారం నాటికి ఈ అల్పపీడనం ఉత్తర కేరళ, కర్ణాటక మీదుగా అరేబియా సముద్రం వైపు కదులుతున్నందున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఐదు ఉత్తరాది జిల్లాలు-కాసరగోడ్, కన్నూర్, వాయనాడ్, కోజికోడ్, మలప్పురానికి రెడ్ అలర్ట్‌లు జారీ చేసింది. పాలక్కాడ్, త్రిసూర్, ఇడుక్కి, ఎర్నాకులం జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్, కొట్టాయం, అలప్పుజా, పతనంతిట్టలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

బెంగళూరులో ఆగని వర్షాలు

ఫెంగల్ తుఫాను కారణంగా బెంగళూరు ముంపునకు గురైంది. తుపానుతో బెంగళూరులో ఆదివారం సాయంత్రం నుండి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమయ్యాయి. సోమవారం కూడా రోడ్లపై నీరు నిలిచిపోవడం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఐఎండి అధికారుల సమాచారం ప్రకారం మంగళవారం కోస్టల్ కర్ణాటక, దక్షిణ ఇంటీరియర్ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలల్లో మంగళవారం కూడా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

అల్పపీడనంగా బలహీన పడిన తుపాను

ఫెంగల్ తుపాను సోమవారం ఉదయం 5:30 గంటల సమయంలో అల్పపీడనంగా బలహీనపడిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం మంగళవారం నాటికి ఉత్తర కేరళ, కర్ణాటక తీరాల్లో తూర్పు-మధ్య అరేబియా సముద్రంలో కలిసి పోయే అవకాశం ఉందని తెలిపింది. ఈ కారణంగా మంగళవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

నవంబర్‌లో 18 కేసులు

- ఇందులో 17 ట్రాప్‌లు
- ఒకటి ఆదాయానికి మించి ఆస్తి కేసు :

ఏసీబీ డీజీ విజయ్ కుమార్ వెల్లడి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) నవంబర్‌లో.. లంచాలకు సంబంధించి 17 కేసులు, ఒక ఆదాయానికి మించి ఆస్తుల కేసును నమోదు చేయటం జరిగిందని ఆ విభాగం అధిపతి విజయ్ కుమార్ తెలిపారు. నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 27 మంది ప్రభుత్వోద్యోగులు, మరో ముగ్గురు ప్రయివేటు వ్యక్తులను అరెస్ట్ చేయటం జరిగిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రూ.3.50 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకోవటం జరిగిందని తెలిపారు. అలాగే, నీటి పారుదల శాఖకు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ (ఏఈఈ) నికేశ్ కుమార్ కూడబెట్టిన రూ.17.73 కోట్ల విలువైన అక్రమాస్తులను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేయటం జరిగిందని ఆయన వివరించారు. ఈ అక్రమాస్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.150 కోట్ల పైనే ఉంటుందని అంచనా వేశారు. అలాగే, గతంలో ఏసీబీకి చిక్కిన ముగ్గురు అధికారులకు ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ఈనెలలోనే ఏడాది నుంచి మూడేండ్ల పాటు కఠిన కారాగార శిక్షలను విధించటం జరిగిందని ఆయన తెలిపారు. కాగా, గత నెలలో నమోదైన 17 కేసులు పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల, ఆర్టీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు చెందిన అవినీతి అధికారులకు సంబంధించినవి ఉన్నాయని విజయ్‌కుమార్ చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలలో అవినీతికి పాల్పడే అధికారులకు సంబంధించిన సమాచారాన్ని తమకు అందజేయాలనీ, సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేవంత్‌రెడ్డి లక్కీ లాటరీ సీఎం : కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి లక్కీలాటరీ సీఎం అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. తెలంగాణ కోసం ఏనాడైనా ఆయన ఉద్యమించాడా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉద్యమకారులపై తుపాకీ ఎక్కిపెడితే ఆనాడు ప్రజలు ఛీ కొట్టారని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. రాష్ట్ర రాజకీయాలు విపరీత పోకడలకు దారితీస్తున్నాయని వాపోయారు. ప్రజల కు ఏం ఒరగబెట్టారని ఏడాది పరిపాలన సంబురాలు



చేసుకుంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల గురించి అమరవీరుల స్థూపం దగ్గర చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుళ్లపై ఒట్లు వేసి హామీలు ఎందుకు అమలు చేయడం లేదు? రుణమాఫీ ఎందుకు చేయలేదు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఒట్టు అంటే.. ప్రజలు తిట్టు అన్నట్లుగా భావిస్తున్నారని తెలిపారు. భూములు, గుజరాత్ మద్యం బ్రాండ్ల గురించి మాట్లాడే రేవంత్ రెడ్డికి.. రియల్ ఎస్టేట్ బినామీ భూముల విషయంలో ఆఫీసర్లకు ఏయే బ్రాండ్లు ఇవ్వాలో బాగా తెలుసని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో గ్యారెంటీలు, హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఖాళీ పాత్రలే ఎక్కువ శబ్దం చేస్తాయన్నట్టుగా కాంగ్రెస్ పరిస్థితి ఉందన్నారు.

ఉద్యోగాలడిగితే నిరుద్యోగులపై లాఠీచార్జి చేస్తూ, బోనస్‌ను బోగస్ చేసి, రుణమాఫీ అరకొరతోనే సరిపెట్టి, భూములు గుంజుకొని రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసాల కాంగ్రెస్‌ను తరిమికొడతార న్నారు. ఏడో తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలోకి వెళ్తామన్నారు.

2026 మార్చి నాటికి పోలవరం ఈఎల్ 41.15 పూర్తికి షెడ్యూల్

- కేంద్ర మంత్రి రాజ్ భూషన్ చౌదరి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2026 మార్చి నాటికి పోలవరం ఎర్త్ లెవెల్ (ఈఎల్) 41.15 పూర్తి చేయడానికి షెడ్యూల్ చేసినట్లు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషన్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి, బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్ర అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కాలానికి ప్రాజెక్ట్ నీటిపారుదల భాగానికి సంబంధించిన మిగిలిన ఖర్చులో వంద శాతం భరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం అంచనా వేసిన టైమ్‌లైన్‌ల ప్రకారం, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కనిష్ట స్థాయి ఈఎల్ 41.15 మీటర్ల వరకు నీటి నిల్వను 2026 మార్చి నాటికి పూర్తి చేయడానికి షెడ్యూల్ చేయబడిందని తెలిపారు. 2021-22లో రూ.2,635.83 కోట్లు, 2022-23లో రూ.906.03 కోట్లు, 2023-24 రూ.274.93 కోట్లు విడుదల చేశామన్నారు. రెండోసారి సవరించిన అంచనాల్లో భాగంగా రూ.33,168.24 కోట్ల భూ సేకరణ, పరిహారం, పునరావాసం కోసం అంచనా వేసినట్లు తెలిపారు. రూ.22,380.64 కోట్ల పనులు, విద్యుత్ కాంపోనెంట్‌కు అంచనా వేశారని, మొత్తం రూ.55,656.87 కోట్లు (2017-18 ధరల సూచీ) ఈ అంచనాలను సాంకేతిక సలహా కమిటీ 2019 ఫిబ్రవరిలోనే 141వ సమావేశంలోనే ఆమోదించిందని తెలిపారు. అయితే, రివైజ్డ్ కాస్ట్ కమిటీ తన 2024 నివేదికలో ఎర్త్ లెవెల్ 41.15 మీటర్ల వరకు నీటి నిల్వతో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి చేయడానికి సవరించిన వ్యయం కోసం రూ. 30,436.95 కోట్లను అంచనా వేసిందని, ఇందులో పరిహారం, పునరావాస కాంపోనెంట్‌లకు రూ.12,270.42 కోట్లు అని తెలిపారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై పున :పరిశీలించాలి

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి వైసీపీ ఎంపీల వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పున:పరిశీలించాలని వైసీపీ ఎంపీలు కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామిని కలిసి వైసీపీ ఎంపీల బృందం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి క్యాప్టివ్ మైనింగ్ లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారిందని, ఇదే లాభదాయకతను ప్రభావితం చేస్తుందని తెలిపారు. విశాఖ ఉక్కు టర్నోవర్ సాధించడానికి అవసరమైన చేయూతను కేంద్రం అందించాలని కోరారు. మరో రెండేండ్ల పాటు కేంద్రం నుంచి చేయూత అందితే ఆర్థిక పరిస్థితి మెరుగువుతుందని పేర్కొన్నారు. ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి వీలుగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని, ఇది వ్యయప్రతికూలతలను అధిగమించేందుకు సహాయపడుతుందని అన్నారు. కేంద్ర సహకారం అందిస్తే ప్లాంట్ మళ్ళీ లాభదాయకమైన వెంచర్‌గా మారుతుందని తెలిపారు. ఆర్థిక పునర్నిర్మాణానికి కేంద్రం సాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వచ్చే మంత్రివర్గంలో ఈ ప్రతిపాదనలు పెడతానని ఆయన హామీ ఇచ్చారన్నారు. కేంద్ర మంత్రి కుమార స్వామిని కలిసిన వారిలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవి సుబ్బారెడ్డి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పి.వి మిధున్ రెడ్డి, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మద్దిల గురుమూర్తి, మేడా రఘునాథ్ రెడ్డి, గుమ్మ తనూజా రాణి తదితరులు పాల్గొన్నారు

చైనాలో నేపాల్ ప్రధాని ఓలి పర్యటన

ఖాట్మండు : నాలుగు రోజుల అధికార పర్యటన నిమిత్తం నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలి సోమవారం చైనా బయలుదేరి వెళ్ళారు. ఈ పర్యటనా సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయి పరస్పర ప్రయోజనాలు కలిగిన వివిధ అంశాలపై చర్చిస్తారు. చైనా ప్రధాని లీ కియాంగ్ ఆహ్వానం మేరకు బయల్దేరిన ఓలి ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఓలి వెంట 39మంది సభ్యులతో ప్రతినిధి బృందం కూడా వెళ్ళింది. చైనా అనుకూల నేతగా పరిగణించే ఓలి సాధారణంగా నేపాల్ ప్రధానులు మాదిరిగా భారత్‌లో కాకుండా సాంప్రదాయానికి భిన్నంగా చైనాలో పర్యటిస్తున్నారు. 2008లో ప్రచండ కూడా ఇలాగే తొలిగా చైనాలో పర్యటించారు. ఈ పర్యటనా సమయంలో ఉభయ పక్షాలు బిఆర్ఐ ప్రాజెక్టుల పునరుద్ధరణకు కొత్త ప్రణాళికపై చర్చిస్తారని భావిస్తున్నారు.

జీఆర్ఏపీ-4 నిబంధనల సడలింపునకు సుప్రీం నో

న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం(ఎన్‌సిఆర్)లో వాయు కాలుష్యం తీవ్రత తగ్గుముఖం పట్టే వరకూ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్ఎపి)-4వ దశ నిబంధనలను సడలించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నిబంధనలను సడలించాలంటే వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టాల్సిందేనని సోమవారం స్పష్టం చేసింది. అదేవిధంగా ఈ నిబంధనలు కారణంగా ఉపాధి కోల్పోయిన నిర్మాణ రంగ కార్మికులకు ఏదైనా పరిహారం చెల్లించారా.. లేదా.. అనే విషయాన్ని తెలియజేయడానికి ఎన్‌సిఆర్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ నెల 5న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ ముందు హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తో సహా ఎన్‌సిఆర్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ నెల 5న మధ్యాహ్నం 3:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాలని స్పష్టం చేసింది. అలాగే, జిఆర్ఎపి 4వ దశ నిబంధనలను అమలు చేయడం కష్టంగా ఉందా అని ఢిల్లీ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. ముఖ్యంగా నిబంధనల అమలు కోసం సిబ్బందిని మోహరించడం, దేశరాజధానిలోకి ప్రవేశించకుండా ట్రక్కులను అడ్డుకోవడంలోనూ.. ఇబ్బందులు ఎదరవుతున్నాయా.. అని ప్రశ్నించింది. దీనికి ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ 'నిబంధనలు పాటించలేదనే ఆరోపణలను పరిశీలిస్తామని సమాధానం ఇచ్చారు. 1.5 కోట్ల జనాభా ఉన్న నగరంలో 2,3 సంఘటనల ఆధారంగా నిబంధనలు పాటించడం లేదని చెప్పలేమని ధర్మాసనానికి తెలిపారు.

సజ్జల భార్గవరెడ్డికి చుక్కెదురు

కేసుల కొట్టివేత పిటిషన్‌ను సుప్రీం తిరస్కరణ

- హైకోర్టుకు వెళ్లండి
- రెండు వారాల పాటు

అరెస్టు చేయొద్దంటూ సూచన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై ఏపీ ప్రభుత్వం తనపై పెట్టిన కేసులు కొట్టివేయాలని సజ్జల భార్గవరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యాకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సజ్జల భార్గవ రెడ్డి హైకోర్టుకు వెళ్లాలని, రెండు వారాల పాటు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు సూచించింది. అయితే గతంలో జరిగిన వ్యవహారాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారని సజ్జల భార్గవ తరపు న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. చట్టాలు ఎప్పటివి అన్నది ముఖ్యం కాదని, మహిళలు, ప్రజా ప్రతినిధులు అని కూడా చూడకుండా చేసిన అసభ్య వ్యాఖ్యలను చూడాలని ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్దార్థ లూత్ర అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులపై దుమ్మెత్తి పోస్తూ, అసభ్య పదజాలం ఉపయోగించే వ్యవహారంలో కీలక సూత్రధారి భార్గవ రెడ్డి అని అన్నారు. టీడీపీ నేతలపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం దర్యాప్తునకు కూడా సహకరించడం లేదని పేర్కొన్నారు. చాలా విషయాలు సుప్రీంకోర్టు ముందు గోప్యంగా ఉంచారని తెలిపారు. సామాజిక మధ్యమాల్లో పెట్టిన పోస్టుల వివరాలను కోర్టుకు అందించారు. దీంతో జోక్యం చేసుకున్న జస్టిస్ సూర్యకాంత్ సోషల్ మీడియా పోస్టులన్నీ ఆమోదయోగ్యంగా లేవని, చాలా తీవ్రంగా ఉన్నాయని, బ్యాడ్ టేస్ట్ అని వ్యాఖ్యలు చేశారు. దుర్భాషలు, అభ్యంతరకరమైన భాష ఉపయోగించే ఎవరైనా చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవా ల్సిందేనని అన్నారు. తాము ఇప్పుడు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని, ఏ విషయాలైనా .. హైకోర్టులోనే చెప్పుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించేందుకు రెండు వారాల సమయం ఇచ్చింది. ఇరుపక్షాల వాదనలు విని తగిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ హైకోర్టుకు ఉందని ధర్మాసనం పేర్కొంది. రెండు వారాల వరకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు మినహాయింపు ఇచ్చింది. ఆ తర్వాత హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది.

బిజినెస్

చమురు ఉత్పత్తులపై విండ్‌ఫాల్ టాక్స్ రద్దు



న్యూఢిల్లీ : చమురు ఉత్పత్తులపై మోడీ సర్కార్ విండ్‌ఫాల్ టాక్స్‌ను రద్దు చేసింది. పెట్రోల్, డీజిల్, ఎవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, ఇతర చమురు ఉత్పత్తుల ఎగుమతులపై విధిస్తున్న విండ్‌పాల్ ట్యాక్స్‌ను రద్దు చేయడం ద్వారా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి సంస్థలకు ఆదాయాలు పెరగనున్నాయి. సోమవారం ఈ పన్నులను ప్రధాన మంత్రి కార్యాలయం సమీక్షించి నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చమురు ఉత్పత్తుల ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండ్‌ఫాల్ టాక్స్ అమలు చేస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పుడు ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తాయి. ఆ సమయంలో విధించే పన్నునే విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా పేర్కొంటారు. రెండు వారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ఈ పన్నులను కేంద్రం సమీక్షిస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధర గత కొన్ని నెలలుగా 72-75 డాలర్ల మధ్య కదలాడుతోంది.

11 నెలల కనిష్టానికి తయారీ పీఎంఐ

న్యూఢిల్లీ : తయారీ రంగం భారీగా పడిపోనుందని అంచనాలు వెలుపడుతున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ)56.5కు తగ్గి 11 నెలల కనిష్టానికి జారనుందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రంజుల్ భండారి పేర్కొన్నారు. ఇంతక్రితం అక్టోబర్‌లో ఇది 57.5గా ఉంది. గడిచిన నెలలో ముడి సరుకుల ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం ఒత్తిడి పీఎంఐపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ప్రంజుల్ అన్నారు. పిఎంఐ తయారీ సర్వేలో 400 కంపెనీల అభిప్రాయాలను సేకరిస్తారు. 50 ఎగువన ఉంటే విస్తరణగా.. 50 లోపు ఉంటే ఈ రంగంలో ప్రతికూలత ఉన్నట్టుగా గుర్తిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు భేష్

- ఇప్పటికే సగం లక్ష్యం పూర్తి
- ఇన్‌కంటాక్స్ అధికారి మిథాలి మధుస్మిత వెల్లడి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు మెరుగ్గా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ మిథాలి మదుస్మిత అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,21,000 కోట్ల ఆదాయపు పన్ను వసూళ్ల చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే రూ.59,000 కోట్లు వసూళ్ల చేసినట్లు తెలిపింది. గతేడాదితో పోల్చితే తెలంగాణలో 15 శాతం వృద్ధి చోటు చేసుకుందన్నారు. అయితే తెలంగాణతో పోల్చితే ఆంధ్రలో అంత ఆశాజనకంగా లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఎఫ్‌టీసీసీఐ ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మిథాలి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో నిర్దేశించుకున్న పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు రెండు రాష్ట్రాల్లో రూ.2 లక్షల కోట్ల పన్ను వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో కొన్ని వివాదంలో ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే భారత్ అత్యంత ప్రగతిశీల పన్ను విధానం గల దేశమన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, ప్రభుత్వ వ్యయాల కోసం ఎక్కువ ఆదాయాన్ని రాబట్టడం తమ కర్తవ్యమన్నారు.

ట్రంప్ టారీఫ్‌లతో బ్రిక్స్ దేశాలకు ముప్పు

- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి

హైదరాబాద్ : అమెరికా డాలర్‌కు దూరంగా ఉంటే బ్రిక్స్ దేశాలు 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికను ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శించారు. ఈ పరిణామం బ్రిక్స్ దేశాలకు ముప్పులాంటిందన్నారు. ఆర్థిక సవాళ్ల కారణంగా దాని సాధ్యత, చట్టబద్ధతపై మరింత స్పష్టత రావాల్సి ఉందన్నారు. ట్రంప్ టారీఫ్ విధానానికి అమెరికా చట్టం అనుమతిస్తుందో లేదో చూడాలన్నారు. యూఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడంలో బ్రిక్స్ దేశాల్లో అంతర్గత విభేదాలు ఉన్నాయన్నారు. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్‌లను కలిగి ఉన్న తొమ్మిది సభ్య దేశాలు అమెరికా కరెన్సీ ప్రత్యామ్యాయానికి చొరవ తీసుకోవాలన్నారు. బ్రిక్స్‌లోని కీలక దేశాలు రష్యా, చైనా కొన్ని రోజులుగా ప్రత్యామ్నాయాన్ని కోరుతున్నాయన్నారు. భారత్ ఇప్పటి వరకు ఈ చర్యలో భాగం కాలేదన్నారు.

వజ్రాల రంగం సీసీపీఏ ముసాయిదాకు మద్దతు

- నేచురల్ డైమాండ్ ఇండస్ట్రీ

ముంబయి : వజ్రాల రంగంలో వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉద్దేశించిన సమగ్ర మార్గదర్శకాలను రూపొందించడానికి సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) ఇటీవల వాటాదారులతో సంప్రదింపులు మొదలు పెట్టింది. ఈ రంగంలో నైతిక మార్కెటింగ్ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా తీసుకొస్తున్న ఈ విధానానికి మద్దతును ఇస్తున్నట్లు నేచురల్ డైమండ్ కౌన్సిల్ ఇండియా మధ్యప్రాచ్య విభాగం ఎండీ రీచా సింగ్ తెలిపారు. అన్ని వజ్రాలను ధ్రువీకరించడానికి, లేబుల్ చేయడానికి సీసీపీఏ ప్రతిపాదనకు తాము పూర్తిగా మద్దతు ఇస్తున్నామన్నారు.

కేఆర్‌ఎంబీ భేటి వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) మంగళవారం నాటి సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు కేఆర్‌ఎంబీ సభ్యకార్యదర్శి డిఎం రాయ్‌పురే తెలిపారు. తెలంగాణ అధికారులు, సిబ్బంది ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

నేడు ఢిల్లీలో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై ఢిల్లీలో మంగళవారం జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం జరగనుంది. ఇందులో ఇంతకుముందు జరిగిన ఆయా అంశాలు, చర్చలపై సమీక్ష చేయనున్నారు. కొత్త నిర్ణయాలు సైతం చేసే అవకాశముంది. కేంద్ర జలశక్తి శాఖ పర్యవేక్షణలో ఈ భేటీ జరగనుంది. ఈ మేరకు ఎన్‌డబ్ల్యూడీఏ సభ్యకార్యదర్శి బాలేశ్వర్ ఠాకూర్ తెలంగాణ నీటిపారుదల శాఖకు సమాచారం పంపారు

4న పెద్దపల్లిలో సీఎం సభ

- తొమ్మిది వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- 'యువ వికాసం' పై సీఎస్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బుధవారం పెద్దపల్లిలో నిర్వహించే 'యువ వికాసం' సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారనీ, ఈ సభలో సుమారు తొమ్మిది వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఆ సభ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, జిలా కలెక్టర్లతో సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువత కోసం ప్రత్యేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో ఇటీవల గ్రూప్-4 తోపాటు ఎంపికైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి సీఎం నియామక పత్రాలను అందజేస్తారని వివరించారు. ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యమయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ప్రారంభోత్సవం, సీఎం కప్ ప్రారంభోత్సవాలతో పాటు వందలాది కోట్ల విలువైన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే పలు స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సభకు హాజరయ్యే వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బస్సుల్లో వచ్చే వారు మధ్యాహ్నం రెండున్నర గంటలకల్లా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వామ్మో.. 'వందే భారత్'



టికెట్ ధరలు అధికం

- ప్రయాణానికి జంకుతున్న ప్రజలు?
- ఈ రైళ్లలో రద్దీ తగ్గటానికికారణమిదేనా?
- ప్రయాణికుల డిమాండ్ స్థిరంగా ఉండదు
- కాలాన్ని బట్టి రద్దీ ఉంటుంది : కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలు ప్రయాణికులకు షాకిస్తున్నాయి. ఈ కారణంతోనే ఈ రైళ్లలో ప్రయాణించేవారి సంఖ్య తక్కువగా ఉంటున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. దేశంలోని మిగతా రైళ్ల ధరలతో పోలిస్తే.. వందే భారత్ రేట్లు చాలా ఎక్కువగా ఉంటాయి. దీంతో వందే భారత్ రైళ్ల టికెట్ ధరలు ఆది నుంచీ చర్చనీయాంశంగానే మారాయి. వందేభారత్ రైళ్లలో లోపాలు, అందులో ఉన్న సదుపాయాలు గురించి ఫిర్యాదులు, జరుగుతున్న ప్రమాదాలకు సంబంధించి ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్‌గా మారిన విషయం విదితమే. భారత్.. దేశీయంగా రూపొందించిన తొలి సెమీ-హైస్పీడ్ రైలు అయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను 2019లో ప్రారంభించింది. ఇందులో ఆధునిక వసతులు ఉన్నాయనీ, ప్రయాణికులకు మంచి అనుభూతిని కలిగించటమే కాకుండా.. సమయాన్ని కూడా మిగుల్చుతుందని కేంద్రం తీవ్ర ప్రచారాన్ని కల్పించింది. ప్రస్తుతం భారత్‌లో మొత్తం 136 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ ఏడాది కేంద్ర రైల్వే శాఖ దేశవ్యాప్తంగా 46 వందే భారత్ ట్రైన్లను ప్రవేశపెట్టింది.

వందేభారత్ ట్రైన్‌ల గురించి మోడీ ప్రభుత్వం ఎంతోగానో గొప్పలు చెప్పుకున్నది. తమ పాలనలో రైల్వే వ్యవస్థ పురోగమిస్తున్నదనటానికి వందే భారత్ ఒక సంకేతంగా ప్రచారం చేసుకున్నది. అయితే, వందే భారత్ రైళ్లలో టికెట్ ధరలు చూస్తే మాత్రం షాక్ కావాల్సిందే. భారత్‌లోని ఇతర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ ట్రైన్ల కంటే.. వందే భారత్ ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలను లక్ష్యంగా చేసుకొని తీసుకొచ్చిన ఈ వందే భారత్ ట్రైన్లలో సాధారణ మధ్యతరగతికి చెందిన ప్రజలు ప్రయాణించాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సిందేనని విశ్లేషకులు చెప్తున్నారు.

వందే భారత్‌లో అధిక ధరలపై ఎంపీల నుంచి కూడా ప్రశ్నలు తలెత్తాయి. కొందరు ఎంపీలు ఈ విషయాన్ని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ముందు కూడా ప్రస్తావించారు. అయితే, రిజర్వ్ చేయబడిన రైలు సీట్ల కోసం ప్రయాణికుల డిమాండ్ స్థిరంగా ఉండదని ఆయన తెలిపారు. ఇది రద్దీ సమయాల్లో పెరుగుతుందనీ, రద్దీ సమయాలు కానప్పుడు తగ్గుతుందని వివరించారు. 2024-25 (ఈ ఏడాది అక్టోబర్ నాటికి) వందే భారత్ రైళ్లలో ఓవరాల్ ఆక్యుపెన్సీ వంద శాతం కంటే ఎక్కువగానే ఉన్నదని లోక్‌సభ సమావేశాల్లో భాగంగా ఒక ప్రకటనలో ఆయన వివరించారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కేవలం నగరాల్లో ఉండే సంపన్నులను దృష్టిలో ఉంచుకొనే వందే భారత్ వంటి రైళ్లను తీసుకొచ్చిందనే వాదనలూ వినబడుతున్నాయి. తమ పాలనలో భారత రైల్వే కొత్త పుంతలు తొక్కుతున్నదన్న మోడీ సర్కారు ప్రకటనలు 'మేడి పండు చందమే'నని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా, పేద, మధ్యతరగతి ప్రజలు ప్రయాణించే రైళ్లలో రద్దీ విపరీతంగా ఉంటుందనీ, రైళ్లలో అరకొర సౌకర్యాలతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అంటున్నారు. మోడీ పాలనలో రైల్వే ద్వారా సాధారణ ప్రయాణికులకు ఒరిగిందేమీ లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మోడీ సర్కారు రైళ్లలో కనీస సదుపాయలను మెరుగుపర్చి, జనరల్ బోగీల సంఖ్యను పెంచటంపై దృష్టి పెట్టాలని వారు సూచిస్తున్నారు.

పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల సంఖ్య పెంపుపై స్పందించండి

- మూడువారాల్లోగా అఫిడవిట్‌ను దాఖలు చేయండి
- ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు
- తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 25కు వాయిదా

న్యూఢిల్లీ : ప్రతీ పోలింగ్ స్టేషన్‌కూ గరిష్ట ఓటర్ల సంఖ్యను 1200 నుంచి 1500కు పెంచుతూ ఎన్నికల కమిషన్ (ఈసీ) తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై భారత సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. ఈసీ నుంచి అభిప్రాయాన్ని కోరింది. ఎన్నికల సంఘం నిర్ణయం ఆందోళనకరమని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిల్ విచారణను చేపట్టింది. ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ మణిందర్ సింగ్ హాజరయ్యారు. ఈసీ తీసుకున్న నిర్ణయం వెనక గల హేతుబద్ధతలను వివరిస్తూ ఒక షార్ట్ అఫిడవిట్‌ను సమర్పించాలని మణిందర్‌సింగ్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఇందుకు న్యాయస్థానం ఈసీకి మూడు వారాల సమయాన్ని విధించింది. గరిష్ట ఓటర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించటం ఆదోళనకరమనీ, ఏ ఓటరూ తన ఓటు హక్కును కోల్పోకూడదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ప్రతీ ఈవీఎంకు మొత్తం ఓటర్ల సంఖ్యను పెంచినప్పుడు సదరు నియోజకవర్గంలోని అన్ని రాజకీయపార్టీలను సంప్రదించటం జరుగుతుందని ఈసీ తరఫున మణిందర్ సింగ్ కోర్టుకు తెలిపారు. నిర్ణీత సమయం దాటినా.. అప్పటికే పోలింగ్ కేంద్రానికి వచ్చినవారికి ఓటు వేసేందుకు ఈసీ అనుమతిస్తుందని స్పష్టం చేశారు.

ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను సుప్రీంకోర్టు ధర్మాసనం వచ్చే ఏడాది జనవరి 25కి వాయిదా వేసింది. ఆ లోగా ఈసీ తన అఫిడవిట్ ప్రతిని పిటిషనర్‌కు అందజేయాలని న్యాయస్థానం తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల సంఖ్యను పెంచుతూ ఈసీ ఈ ఏడాది ఆగస్టులో రెండు ప్రకటనలను విడుదల చేసింది. అయితే, దీనిని సవాలు చేస్తూ ఇందుప్రకాశ్ సింగ్.. సుప్రీంకోర్టులో ఈ పిల్ వేశారు. ఈసీ నిర్ణయం ఏకపక్షమనీ, ఏ డేటానూ ఆధారంగా తీసుకోలేదని పిటిషనర్ అందులో ఆరోపించారు.

5 నుంచి టీపీబీవో అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీవో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల ఐదు నుంచి రెండో విడత ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల ఏడో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈ ప్రక్రియను నిర్వహిస్తామని పేర్కొన్నారు. గైర్హాజరైన అభ్యర్థులకు ఈనెల తొమ్మిదిన ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని వివరించారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంట తెచ్చుకోవాలని అభ్యర్థులకు సూచించారు. 175 టీపీబీవో పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ ఏడో తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

కాళేశ్వరం విచారణ పూర్తికి మరో మూడు నెలలు

- జనవరిలో కేసీఆర్‌కు పిలుపు
- ఫిబ్రవరిలో నివేదిక సమర్పణ
- కమిషన్ సన్నాహాలు ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం న్యాయ విచారణను మరింత వేగంగా చేపట్టాలని కమిషన్ భావిస్తున్నది. త్వరితగతిన విచారణను కొలిక్కి తెచ్చి ఫిబ్రవరిలో సర్కారుకు నివేదిక అందజేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈనేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన విచారణ క్రమాన్ని సమీక్షించుకుంటూనే, వచ్చే మూడు నెలల కాలంలో చేపట్టాల్సిన కార్యకలాపాలపై ప్రణాళిక రూపొందించుకున్నట్టు సమాచారం. మళ్లీ ఈనెల రెండోవారంలో విచారణ చేపట్టనున్నారు మారో మారు ఈఎన్సీలు సి మురళీధర్, హరిరామ్, నల్లా వెంకటేశ్వర్లను విచారించిన అనంతరం ఐఏఎస్‌లకు కబురు పెడతారని తెలిసింది. ఇప్పటివరకు అధికారులు, ఇంజినీర్లను విచారించినా కమిషన్ మరో కీలకఘట్టంలోకి అడుగుపెట్టనుంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను విచారణకు పిలవనుంది. ఈ క్రమంలో తొలుత కాళేశ్వరానికి అన్నీ తానై వ్యవహరించిన మాజీ సీఎం కేసీఆర్‌ను వచ్చే జనవరిలో విచారణకు పిలవాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఆయనతోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనంతరం ఫిబ్రవరిలో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విచారణ అనంతరం నివేదకను సమగ్రంగా ఉండేలా చూసుకోవడం, తప్పుచేసిన వారిపై కచ్చితమైన చర్యలకు సిఫారసు చేయాలనే భావనలో కమిషన్ ఉన్నట్టు తెలిసింది. ఈమేరకు కమిషన్ కార్యాచరణ ఫిబ్రవరి వరకు ప్లాన్‌చేసినట్టు సమాచారం.

వీసీ ద్వారా ఎస్‌ఈ విచారణ

సోమవారం సైతం విచారణ జరిగింది. అమెరికాలో ఉన్న ఒక ఎస్‌ఈని వీడియోకాన్ఫరెన్స్‌లో ద్వారా కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ విచారించారు. ఈసందర్భంగా ప్రాజెక్టుకు అనేక ప్రశ్నలు వేశారు. అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ప్రాజెక్టు ప్రణాళిక, డిజైన్, డ్రాయింగులు, స్థలం మార్పు, నిధుల అంచనా, ఖర్చు, ఆయకట్టు తదితర అంశాలపై విచారణ జరిగింది.

కుల దురహంకారంతోనే నాగమణి హత్య

- నిందితున్ని కఠినంగా శిక్షించాలి : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆధిపత్య కుల దురహంకారంతోనే కానిస్టేబుల్ నాగమణిని తన సోదరుడు పరమేష్ హత్య చేశాడని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హత్యకు పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన కొంగరి నాగమణి అనే కానిస్టేబుల్ నవంబర్ 10న యాదగిరి గుట్టలో శ్రీకాంత్ అనే దళిత యువకుడిని కులాంతర వివాహం చేసుకుందని తెలిపారు. తక్కువ తక్కువ సామాజిక తరగతి వాడిని పెళ్లి చేసుకోవడమే కాకుండా ఆస్తిలో వాటా తీసుకుంటుందని నాగమణి తమ్ముడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు.

డ్యూటీకి వెళ్తున్న ఆమెను కారుతో వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టి వేట కొడవలితో నరికి చంపాడని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ లేక పోవడంతో ఇలాంటి కులదురహంకారహత్యలు బహిరంగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు.నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోది చేయాలని డిమాండ్ చేశారు. నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయనకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాలికలపై పెరుగుతున్న హింస

- దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రోజురోజుకు బాలికలపై హింస పెరుగుతున్నదని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో దళిత స్త్రీ శక్తితో పాటు వివిధ మహిళా సంఘాలు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు నవవంబర్ 25నుంచి డిసెంబర్ 10వరకు స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రచారాన్ని నిర్వహించినట్టు వారు తెలిపారు.

ఎస్సీఆర్‌బీ, ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం చట్టాల అమలు,కమిషన్ల పనివిధానం సరిగా లేకపోవటంతో రోజురోజుకు మహిళలపై హింస పెరుగుతున్న దన్నారు.సమావేశంలో రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ నాయకురాలు సుమలత, మహిళా హక్కుల వేదిక నుంచి రుక్మిణిరావు, జాక్ సజియ, సామాజిక విశ్లేషకులు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఆడపిల్లలపై విపరీతంగా హింస పెరగటం వల్ల వారి జీవన కాలంపై ప్రభావం చూపిస్తున్నదని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తోంది

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

- వైభవంగా తెలుగు వర్సిటీ 39వ వ్యవస్థాపన దినోత్సవం



నవతెలంగాణ-దుండిగల్

దేశ విదేశాల్లో తెలుగుభాష, సాహిత్యం, లలితకళల ఔన్నత్యాన్ని చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తోందని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపన దినోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. ముందుగా విశ్వవిద్యాలయంలో భవన సముదాయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలనందిస్తున్న శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డా.కె.ఐ.వరప్రసాదరెడ్డికి 2023 సంవత్సరానికి గాను రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రంతో విశిష్ట పురస్కారాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా, సేవారంగాల్లో ఉపాధి ఉన్నప్పటికినీ లలితకళా రంగాల్లో కూడా ఉపాధిని పొందే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం గొప్ప నైపుణ్య శిక్షణా కేంద్రంగా నిలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి విశ్వవిద్యాలయానికి అన్నివిధాలుగా సాంకేతిక పరమైన సహకారాన్ని అందిస్తామని, తక్షణమే వర్సిటీకి అవసరమైన కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, సంబంధిత సాంకేతిక పరికరాలను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తున్న విశిష్ట పురస్కారాన్ని పొందిన వరప్రసాద రెడ్డి వ్యక్తి కాదు వైద్య రంగంలో అసమాన కీర్తిని పొందిన శక్తిగా నిలిచారని, పురస్కారానికే ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చారని ప్రశంసించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. తెలుగు విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణానికి పూర్వ ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్లు చేసిన కృషిని గుర్తుచేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. పురస్కార గ్రహీత వరప్రసాద రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతే తెలుగువారికి బలం, అస్తిత్వం అని, వాటిని సమాజంలో కాపాడుకోవడానికి, అవి మరింత పరిఢవిల్లడానికి తెలుగు విశ్వవిద్యాలయం అవసరమన్నారు. అందుకు ప్రభుత్వ సహకారం వాంఛనీయమని చెప్పారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లోనూ సంస్కృతి, భాష పట్ల అవగాహన కల్పించాలని, అప్పుడే మంచి పౌర సమాజం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వృత్తి పరంగా అందించిన వైద్య సేవల కన్నా ప్రవృత్తిపరంగా తెలుగు భాషా సాహిత్యానికి చేస్తున్న సేవలే తన జీవితానికి సంతృప్తినిస్తాయని తెలియజేశారు. విశ్వవిద్యాలయం అందించిన విశిష్ట పురస్కార నగదుతో పాటు మరో కోటి రూపాయలను వర్సిటీకి అవసరమయ్యే మౌలిక సదుపాయాల నిర్మాణానికి విరాళంగా చెక్కును మంత్రి సమక్షంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావుకు అందజేశారు. రాష్ట్ర ఉన్నతవిద్యామండలి అధ్యక్షులు ఆచార్య వి. బాలక్రిష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమానికి తొలుత విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులకు స్వాగతం పలుకుతూ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సుల వివరాలు, తెలుగు భాష, సాహిత్యాల ఔన్నత్యాన్ని, వాటి ప్రాభవాన్ని పెంచేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాలిటీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి, కలెక్టర్, గౌతంపొట్రు, అడిషనల్ కలెక్టర్ రాధిక, నిజాంపేట్ కమిషనర్, ఎం.డి. సాబేర్ అలీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంభాల్‌కు వెళ్లేందుకు నిరాకరణ

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చీఫ్ అజయ్ నేతృత్వంలో పర్యటనకు సిద్ధమైన బృందం
- ఎక్కడికక్కడ బారికేడ్లతో అడ్డుకున్న యూపీ పోలీసులు
- పోలీసులు, కార్యకర్తలకు మధ్య ఘర్షణ
- ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య : కాంగ్రెస్
- సంభాల్‌లో నిషేదాజ్ఞలు 10 వరకు పొడగించిన జిల్లా యంత్రాంగం



లక్నో : హింసతో అట్టుడికిన యూపీలోని సంభాల్‌కు వెళ్లటానికి సిద్ధమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సోమవారం లక్నోలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బయట ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్నది. పెద్ద ఎత్తున గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. యూపీ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు వినిపించారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అజయ్ రాయ్ నేతృత్వంలోని బృందం నిజ నిర్ధారణ కోసం సంభాల్‌లో సోమవారం పర్యటించటానికి సిద్ధమైంది. దీంతో యూపీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రే.. రాష్ట్ర రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఆ పార్టీకి చెందిన నాయకుల ఇండ్ల బయట పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసు ఆంక్షలు ఛేదించి సోమవారం సంభాల్‌కు వెళ్లటానికి అజయ్‌రాయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. అయితే, పోలీసులు వారిని బారికేడ్ల వద్దనే ఆపేశారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఇరు వర్గాల మధ్య ఘర్షణవాతావరణం చోటు చేసుకున్నది. హింసతో అట్టుడికిన సంభాల్‌లో పర్యటించకుండా తమను అడ్డుకున్న పోలీసుల చర్య ప్రజాస్వామ్యవ్యతిరేకమైనదిగా పార్టీ అభివర్ణించింది.

కోర్టు ఆదేశాల మేరకు సంభాల్‌లో మసీదు సర్వే విషయమై అక్కడ గతనెల 19 నుంచి టెన్షన్ వాతావరణ నెలకొని, 24న రెండో సర్వే నిర్వహణ సమయంలో అది తీవ్ర హింసాత్మకంగా మారిన విషయం విదితమే. ఈ హింసాత్మక ఘటనలో నలుగురు ముస్లిం యువకులు చనిపోగా, పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. దీనిపై చర్చకు పార్లమెంటు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి.

'ప్రభుత్వ అరాచక చర్య'

యూపీ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష నేత ఆరాధనా మిశ్రా మాట్లాడుతూ.. సంభాల్ ఘటన మామూలు విషయం కాదనీ, ఒక పెద్ద ఘటన అని అన్నారు. అజయ్ రాయ్ బృందం అక్కడికి నిజ నిర్ధారణ కోసం వెళ్లాలనుకున్నదనీ, నిన్నటి(ఆదివారం) రాత్రి నుంచి పోలీసులు నన్ను హౌజ్ అరెస్ట్ చేశారని ఆమె తెలిపారు. ఇది ప్రభుత్వ అరాచక చర్యలో భాగమని ఆరోపించారు. బీఎన్‌ఎస్‌ఎస్‌లోని సెక్షన్ 163ని విధించి, ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవాలనుకుంటున్నదని అన్నారు.

గాంధేయ మార్గంలో నిరసన తెలిపేవాళ్లం : కాంగ్రెస్ యూపీ చీఫ్

అంతకముందు అజయ్‌రాయ్ మీడియాతో మాట్లాడారు. "నవంబర్ 30 వరకు సంభాల్‌లో పర్యటించటానికి ప్రజాప్రతినిధులపై ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో మేము 2న అక్కడికి వెళ్లాలని నిర్ణయించాం. దీంతో, వారు(ప్రభుత్వం) ఈ నిషేధాన్ని ఈనెల 10 వరకు పొడగించింది. లోపాలను కప్పి పుచ్చే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తున్నది" అని ఆయన ఆరోపించారు. పలువురు పార్టీ కార్యకర్తలతో కలిసి రాత్రి ఆయన కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గడిపారు. ఒకవేళ మాకు అవకాశం కల్పించి ఉంటే మేము గాంధేయ మార్గంలో శాంతియుత మార్గంలో ఆందోళన చేపట్టేవారమన్నారు.

ఎస్పీ నేతలనూ అడ్డుకున్న పోలీసులు

సంభాల్‌కు వెళ్లకుండా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను కూడా పోలీసులు అడ్డుకున్నారు. ఇందులో సంభాల్ ఎంపీ కూడా ఉన్నారు. జిల్లా యంత్రాంగం నిషేదాజ్ఞలను ఈనెల 10 వరకు పొడగించిందని అధికారులు వారికి అనుమతి నిరాకరించారు.